ఆగస్టు 01-15, 2021
సంపుటి 01, సంచిక 20

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



ఏ దేశమేగినా, ఎందుకాలిడినా...
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన...
పొగడరా! నీ తల్లి భూమి భారతిని
నిలుపరా! నీ జాతి నిండు గౌరవము.



నాలుగు కోట్ల ప్రజలలో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన తెలంగాణ సిద్ధాంతకర్త...
తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిప్రదాత...
**ఆచార్య శ్రీ కొత్తపల్లి జయశంకర్** గారి జయంతి (ఆగష్టు 06, 1934)
సందర్భంగా ఇదే మా నమస్సుమాంజలి

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




వ్యవసాయ ప్రాధాన్యాన్ని చెప్పే **బసవరాజు** గేయం...
'వలసలు వద్దు....' 44



41
సెల్‌ఫోన్‌లో చేసిన ఈవ్‌టీజింగ్‌ను
ఎదుర్కొన్న యువతి కథ...
**జయంతి** 'తూరుపు సింధూరం'



19
కరోనా కాటుకు బలైన పూజారి
కథ... **అయోధ్యారెడ్డి**
'ఆరడుగుల శ్వాస'




15
నందగిరి ఇందిరాదేవి కథా కథన శిల్పాన్ని
తెలియజేసే **అఫ్రీన్ బేగం** వ్యాసం...
'కథలు... తీరు తెన్నులు'



11
తిరగబడిన మేకపిల్లను చిత్రించిన
**రూప్‌కుమార్ డబ్బీకార్** కథ...
'మర్కపిల్ల దాగ్'



27
కవిత్వ లక్ష్యం తెలియజేస్తున్న
**ఎస్ఆర్ భల్లం** వ్యాసం...
'కవి సామాజిక బాధ్యత...'



31
కవి, చరిత్రకారుడు, విమర్శకుడు
సుంకిరెడ్డి మనోగతాన్ని ముఖాముఖిలో
ఆవిష్కరించిన **వెల్దండి**

వివిధ కాలాల్లో జరిగిన సాహితీ
సేవను తెలియజేస్తున్న **ఏనుగు
నరసింహారెడ్డి** వ్యాసం...
'తెలంగాణ సాహిత్యానికి
సమతల దర్పణం' 37

సగటు మనిషిని చిత్రించే
**గోపగాని రవీందర్** కవిత....
'మనందరిలో
కొందరుంటారు' 29

ఉర్దూ సంస్కృత భాషల అవినాభావ సంబంధం తెలిపిన **డా॥ పత్తిపాక మోహన్** వ్యాసం...
'షేక్ అబ్దుల్ ఘనీ....'... 07 పేజీలో
పాత వ్యవస్థకు, కొత్త వ్యవస్థకు సంధికాలం లాంటి నాటికథ **దుర్గాప్రసాద రావు...**
'రెండు జెండాలు'... 05 పేజీలో

ఇంకా...
**కొలని గణపతి దేవుని** 'మనోబోధ' నాటి కవిత... 10 పేజీలో
జ్ఞాపకాల వాసన తెలియజేసిన **రామా చంద్రమౌళి** కవిత... 04 పేజీలో
కాల్పనిక వాస్తవికతను చిత్రించిన **పొన్నం రవిచంద్ర** కవిత... 'సంభాషణ'... 26 పేజీలో

సాహిత్య శిఖరం, దృశ్య సాహిత్యం, సాహిత్య సమాచారం, పుస్తక పరిచయం,
శ్రీకారం మొదలైనవెన్నో....

# 'తంగేడు' పాఠకులకు ముఖ్య గమనిక

తెలంగాణ జాగృతి తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం నవ యువతను ప్రోత్సహించడం కోసం వెలువరిస్తున్న 'తంగేడు' సాహిత్య పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ కృతజ్ఞతలు. అనూహ్యంగా కోవిడ్ సెకండ్‌వేవ్ విజృంభణ వల్ల పత్రికను నేరుగా ప్రింట్ కాపీను అందించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. ప్రస్తుతానికి పత్రికను వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుంది. పాఠకులు సహకరించగలరు. కోవిడ్ వ్యాప్తి తగ్గేంతవరకు ప్రింట్ కాపీ అందించలేకపోవచ్చు. పరిస్థితి అనుకూలించాక అందించగలం.

మేము అందించినంత కాలం ఎందరో పెద్ద రచయితలు, పాఠకులు ధర నిర్ణయించాల్సిందిగా ఎన్నో విజ్ఞప్తులు చేశారు. మీ కోరికను అనుసరించి కేవలం నామమాత్రమైన వెల రూ. 2/-, వార్షిక చందా రూ. 50/-లుగా నిర్ణయించడం జరిగింది. ప్రింట్ కాపీ మాత్రం చందాదారులకు మాత్రమే పంపడం జరుగుతుంది. పాఠకులు గమనించ ప్రార్థన. చందా దారులుగా, మా పాఠక సభ్యులుగా మన 'తంగేడు' కుటుంబంలో చేరండి. చందావివరాలు దిగువన ఇస్తున్నాం.




## 'తంగేడు' సంచిక వార్షిక చందా వివరాలు

'తంగేడు' పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తంగేడు పత్రిక ప్రతి సంచికను పొందేందుకు గాను, వార్షిక చందాదారులుగా చేరండి. ఇందుకోసం రూ.50 చెల్లించి, 24 సంచికలను పొందండి. చందాదారులుగా చేరేందుకు **http://www.thangedu.co.in** వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకొని, ఆన్ లైన్ లో నగదు చెల్లించేందుకు వీలు కల్పించడం జరిగింది. డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, UPI ద్వారా నిర్ణీత నగదు చెల్లించగలరు. చెక్కుల ద్వారా కూడా వార్షిక చందాదారులుగా చేరవచ్చు.

**వార్షిక చందా చెక్కులను పంపవలసిన చిరునామా:**

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం.1-2-234/13/46/4,
3వ అంతస్తు, ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గర, అరవింద్ నగర్,
దోమలగూడ, హైదరాబాద్ - 500 029.

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 ఆగస్టు, 2021

సంపుటి 01 సంచిక 20



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# సాహిత్యంలో జీవిత చరిత్రలు

ఒక సాహిత్యకారుడు, లేక సాహిత్యేతరుడు తన జీవితాన్ని తానే రాసుకుంటే అది ఆత్మకథ (Auto Biography) అవుతుంది అట్లాగాకుండా ఇతరుల జీవితాన్ని గురించి రాస్తే అది జీవిత చరిత్ర (Biography) అవుతుంది. రాముని జీవిత చరిత్ర రామాయణం. మహాభారతం అంటే పాండవుల జీవిత చరిత్రే. ఆ మాట కొస్తే ప్రాచీన కావ్యాలన్నీ జీవిత చరిత్రల కిందికే వస్తాయి. కాని కావ్య రచన ఉద్దేశంతో కాకుండా ప్రత్యేకంగా ఒకవ్యక్తి జీవితాన్ని, ఆదర్శాలను, వాటిని ఆచరించడంలో అతను పొందే ఇబ్బందులు, అతని సామాజికీకరణ చెందిన వైయక్తిక అనుభూతులు, అతిశయోక్తులు లేకుండా కావ్యాలలో వలె అద్భుతాలు లేకుండా కొనసాగితే అది జీవిత చరిత్ర అవుతుంది. జీవిత చరిత్ర సాహిత్యంలో అంతర్భాగమే అయినా, సాహిత్యంలోని కాల్పనికతకు దూరంగా ఉంటుంది.

హెన్రీ జేమ్స్ గురించి లిఓఇడేల్, జేమ్స్ జాఎస్ గురించి రాసిన రిచర్డ్ ఎల్మన్ (1959) లాంటివి ప్రపంచ సాహిత్యంలో ప్రసిద్ధ జీవిత చరిత్రలు. షేక్స్పియర్ జీవిత చరిత్రను రాసిన స్టెఫెన్ గ్రీన్ బ్లాట్, షేక్స్పియర్ కవిగా ఎదగడానికి ప్రాతిపదికలు వివరిస్తుంది. 1989లో టాల్ స్టాయ్ జీవిత చరిత్ర రాసిన ఎ.ఎన్.విల్సన్ విమర్శక నైశిత్యం కలిగిన టాల్ స్టాయ్ నవలాకారుడిగా ఎట్లా రాణించాడో చెబుతాడు. లిండాల్ గోర్డాన్, ఇలియట్ జీవిత చరిత్రలో ఇలియట్ పాత కొత్త స్వరూపాన్ని వివరిస్తాడు. రిచర్డ్ హెూమ్స్ రాసిన షెల్లీ జీవిత చరిత్ర ఒక కళాత్మక రూపంగా నిలిచింది.

తెలుగు సాహిత్యం విషయానికి వస్తే కందుకూరి వీరేశలింగమే మొదటి జీవిత చరిత్ర రచనాకారుడు అని చెబుతారు. కాగా 1901 బండారు అచ్చమాంబ 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలో పౌరాణిక, చారిత్రిక, స్వదేశీ స్త్రీల చరిత్రలే గాక విదేశీ మహిళల చరిత్రలను కూడా క్రోడీకరించారు. ఇక కందుకూరి వీరేశలింగం రాసిన విక్టోరియా మహారాణి చరిత్రము గ్రంథం లెక్కించదగిన జీవితచరిత్ర.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను శ్రీ జానకీ జాని, డి.రామలింగం, లాంటి వాళ్ళు రచించారు. ఏటుకూరు బలరామమూర్తి, బి. విజయభారతి రాసిన అంబేద్కర్ జీవిత చరిత్ర పేర్కొనదగినవి. సరోజినీ నాయుడు జీవితాన్ని గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, కోడూరు లీలావతి, సంఘమిత్ర రచించారు. డి.రామలింగం "బహుముఖ ప్రజ్ఞాశాలి బూర్గుల" అని రాసిన జీవిత చరిత్ర ప్రత్యేకంగా పేర్కొనదగింది.

జీవిత చరిత్రలలో తత్కాలీన సామాజిక చారిత్రకాంశాలు ప్రతిఫలించాలి. చరిత్ర రచనాకారుల శైలి చదువరికి ఆసక్తి కలిగించే విధంగా కొనసాగాలి. మహాపురుషుల జీవితాలను రాసేటపుడు గాంభీర్యం వస్తువులో కాల్పనికత శైలిలో ఉండాలి.

తెలంగాణలో ఇట్లాంటి జీవిత చరిత్రలు ఎన్నో రావలసి ఉంది. భావితరాలకు ఉత్ప్రేరకంగా నిలిచే నిర్మాణాత్మకమైన ఈ రచనలకు మనం స్వాగతం పలుకుదాం.

జై తెలంగాణ, జై జాగృతి

కవిత కల్వకుంట్ల

కవిత

# జ్ఞాపకాల వాసన



రామా చంద్రమౌళి
9390109993

"ఏయ్ అంతా పొగాకు వాసన ఒళ్ళంతా
అసలు నీదగ్గర 'ఆడ' వాసనేదే.. నీయమ్మ
ఒక వర్షం కురుస్తున్న రాత్రి ప్రక్కగదినుండి నాన్న గద్దింపు
బీడీలు చేసే అమ్మనుండి నాకొచ్చింది దుఃఖపు వాసన, బీదరికపు వాసన
ఇక నిద్రరాని ఆ రాత్రంతా ఎడారి వాసనే -
చదువుకోసం, బ్రతుకుకోసం ఆకాశంలోకి ఖాళీగా చూస్తూ
కుమ్మరి బుచ్చీరు తిరిగే సారెలోకి పిచ్చిగా లీనమైపోతున్నపుడు
బంకమట్టి వాసన, పచ్చి కుండల వాసన, కాలే వాము పొగవాసన
ఆరవ తరగతి పాసైన సంబురంతో నాన్న 'బాలల బొమ్మల రామాయణం'ను కొనిచ్చిన రాత్రి
కొత్త కమ్మల్లో, అక్షరాల్లో, హృదయాన్ని కమ్ముకున్న 'చదువు' వాసన
ఎదుగుతున్నకొద్దీ, లైబ్రరీల్లో ఒదుగుతున్నకొద్దీ
కాలేజ్ కారిడార్లో మట్టితొట్లలోనుండి పచ్చని జీవపరిమళం
'మనిషిని చేతివ్రాతతో కాదు, కంటి రెటీనాతోకాదు
ప్రతి జీవికీ ఉండే సహజ అరోమాతో ఖచ్చితంగా గుర్తించవచ్చు'
అన్న శాస్త్ర రహస్యాన్ని తెలుసుకున్నపుడు
మనిషి సాంకేతికంగా విక్రమిస్తున్నప్పటి జ్ఞానపరిమళం
కళ్ళను స్పృహిస్తూ అరణ్యాలవెంట, ఆత్మాన్వేషణలో పల్లెల వెంట
ఆకాశాంతరాల్లోకి చూస్తూ రేయింబవళ్ళు మౌనించిన రోజుల్లో
పోలీసులనుండి తప్పించుకుంటూ పశువులకొట్టాల్లో ఉచ్చల వాసన
తుపాకీ గొట్టంనుండి వెలువడే పొగనుండి గంధపు వాసన
జీవితమంటే యుద్ధం, జీవితమంటే తిరుగుబాటు
జీవితమంటే ప్రతిఘటన .. జీవితమంటే బిగించిన పిడికిలిగా
సాగుతున్నపుడు
ఒళ్ళు ఒళ్ళంతా ఉడుకునెత్తురు విస్ఫోటన వాసన
చరమాధ్యాయంలో, అస్తమయార్ణవంలో
సంగీతానికి  ప్రాణపరిమళముంటుందనీ
అందమైన చిత్రానికీ, శిల్పానికీ ఆత్మానుగత  అరోమా ఉంటుందనీ తెలుస్తున్నపుడు
నిశ్శబ్దయుద్ధపు చైనా జీవాయుధం 'కరోనా '
కోరలుచాచి ప్రపంచాన్ని కబళిస్తున్నపుడు
మిలియన్లమంది శవాల గుట్టల్లోనుండి
స్మశాన కమురు వాసన, మృత్యు నీచువాసన తెరలు తెరలుగా కమ్ముకొస్తున్నపుడు
అబ్బా.. వీటన్నింటినీ మించిన పరమకంపు
రాజకీయాల్లో నుండి, టీవీల్లో నుండి, ఓటీటీల్లో నుండి
సినిమా హాల్లలోనుండి, మొబైల్ ఫోన్లలోనుండి, పబ్బుల్లో నుండి
నిరంతర కాలుష్య దుర్గంధ స్రావంగా ప్రవహిస్తున్నపుడు
ఉక్కిరిబిక్కిరై ఊపిరాడక చచ్చిపోతున్నాను.. అంతరించిపోతున్నాను
దయతో రక్షిస్తారా ఎవరైనా!

నాటి కథ

# రెండు జెండాలు

నాటి గ్రామాల్లో రాజకీయాన్ని విశ్లేషించిన కథ...

పర్చా దుర్గాప్రసాద రావు

"ఎన్నిసార్లు కాల్చినా ఈ మూర్ఖపు జనానికి బుద్ధిరాదు" అన్నాడు పోలీసు అధికారి జమిందారు రాఘవరెడ్డితో.

"ఇదొక జాడ్యం లాగుంది" అన్నాడు జమీందారు.

"బందిపోటు దొంగలు నయం. వీళ్లు అంతకు మించారు"

"యేండ్ల తరబడిగా యేడిపించుకుంటున్నారు"

"ప్రభుత్వం వీళ్లని తుడిచేయలేకపోతోంది"

"ఈ జాడ్యం మా కుటుంబాల్లోకి వ్యాపించింది?"

"మావాడూ జండా పుచ్చుకొని తిరుగుతోన్నాడు కదా"

"ఏమిటో! ఎటూ తోచదు"

జమీందారు గారి మామిడితోట దాటి ఇద్దరూ ఇవతలికి వచ్చారు. తోటగోడకి పెద్ద 'పోస్టరు' అంటించి వుంది. మూడు రంగుల జండా, ఎర్రజండా 'క్రాస్'గా వున్నాయి. వాటి మధ్యగా యెర్రక్షరాలు...

"సంస్థానం భారత యూనియన్‌లో చేరాలి"

బాధ్యతాయుత ప్రజా ప్రభుత్వం కావాలి" అని వున్నాయి. పోలీసు అధికారీ, జమీందారూ ఆ 'పోస్టర్'ను నమ్మలేకపోయారు.

"కాంగ్రెస్సూ, కమ్యూనిస్టులు ఎట్లా కలిశారు" అన్నాడు పోలీసు అధికారి.

"మీరు చేసిందే..." అని విసుక్కున్నాడు జమీందారు.

"మేమేం చేశాం?"

"కమ్యూనిస్టు, కాంగ్రెసు విచక్షణ లేకుండా కాల్చారు"

"ఇద్దరూ ప్రభుత్వ శత్రువులే"

"ఇక చచ్చాం పద........" అన్నాడు. జమీందారు. ఇద్దరూ నడుస్తున్నారు. దూరాన్నుంచి నినాదాలు అస్పష్టంగా

**"ప్రజలారా ! సోదర ! సోదరీ ప్రజలారా! మనలో మనకున్న చీలికలను ఐక్యపరచిన ప్రభుత్వ దమననీతికి జోహారు లర్పిస్తున్నాను. మనలో ఏ అభిప్రాయ భేదం వున్నా ప్రజా క్షేమంలోనే, శత్రు విషయంలో కాదు. సమిష్టి శత్రువును సమిష్టిగా ఎదుర్కోవాలి. ఇవాళ మన గ్రామం నిదర్శనగా ప్రపంచ ప్రజాశక్తుల ఐక్యతకు పునాది వేస్తున్నాం. మార్గం చూపుతున్నాం. మన సంస్థానాధీశుని పశుబలం ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల అండతో మన మీదికి విజృంభించి మనలో ఒక సంఘాన్ని మొదటా, ఇంకో సంఘాన్ని తరువాత చీలదీసి అణచాలనుకుంది.**

వినిపిస్తున్నాయి. నిశ్శబ్దంగా నడిచి వెళ్ళిపోతున్నారు. గుండెలు కుదించుకుని నడుస్తున్నారు. వాళ్ళల్లో ఏదో తీరని భయం ఆవరించింది. ఎవళ్ళకు వాళ్ళు తమ భయాన్ని దాచుకోవాలని చూస్తున్నారు.

"రెండు జెండాలూ ఒకటైనై" అని గొణిగాడు పోలీసు అధికారి. జమిందారు. వెనుకడుగు వేస్తూ మొహం తుడుచుకున్నాడు. "ఆకలేస్తోంది, పదండి...." అన్నాడు పోలీసు అధికారి. మళ్లీ నిశ్శబ్దం. కొద్ది సేపట్లో దొడ్డిదారిన 'దేవిడీ'లోకి చేరుకున్నారు ఇద్దరూ. ప్రజల నినాదాలు స్పష్టంగా వినిపించసాగినై. ఫలహారం చేస్తూ కూచున్నారు గదిలో, జమీందారూ, అధికారీ. ప్రజా సమూహం 'దేవిడీ'కి సమీపంగా వస్తున్నట్టు వినపడుతున్నై ధ్వనులు.

"మిలిటరీ సహకారం రానట్టేనా?" అన్నాడు జమిందారు.

"ఎన్నిచోట్ల కని వస్తుందీ? నో, నో అని జవాబులు వస్తున్నాయి పైనుంచి" అన్నాడు పోలీసు అధికారి.

"ఈపూట ఊరేగింపు ఆపలేం" అని నిట్టూర్చాడు జమిందారు.

"ఉఁహుఁ సాధ్యపడదు" అన్నాడు పోలీసు అధికారి.

ప్రజల కలకలం చాలా దగ్గరగా వినిపించింది. చేతులు కడుక్కుని మేడపై

భాగం గది కిటికీలోంచి చూస్తున్నారు ఇద్దరూ, 'దేవిడీ' ముందరి మైదానాన్ని ఆక్రమించుకున్నారు ప్రజలు. ఆ మైదానం జమీందారుదే. ప్రజలు మైదానం నిండా పరచుకున్నారు. వాడిపోతున్న యెండ మైదానాన్ని వదిలేస్తున్నది. జమీందారు కొడుకు రామచంద్రారెడ్డి యెత్తయిన ప్రదేశంలో నుంచొని చేయి యెత్తాడు. 'జై' అన్నారు ప్రజలు. వెంటనే లోతైన నిశ్శబ్దం పరచుకుంది.

"ప్రజలారా!" అంటూ నిశ్శబ్దాన్ని భేదించాడు రామచంద్రారెడ్డి. సాయంకాలపు గాలికి రామచంద్రారెడ్డి భుజం మీది ఖద్దరు కండువా నాగుబాములా పడగెత్తింది.

"ప్రజలారా ! సోదర ! సోదరీ ప్రజలారా! మనలో మనకున్న చీలికలను ఐక్యపరచిన ప్రభుత్వ దమననీతికి జోహారు లర్పిస్తున్నాను. మనలో ఏ అభిప్రాయ భేదం వున్నా ప్రజా క్షేమంలోనే, శత్రు విషయంలో కాదు. సమిష్టి శత్రువును సమిష్టిగా ఎదుర్కోవాలి. ఇవాళ మన గ్రామం నిదర్శనగా ప్రపంచ ప్రజాశక్తుల ఐక్యతకు పునాది వేస్తున్నాం. మార్గం చూపుతున్నాం. మన సంస్థానాధీశుని పశుబలం ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల అండతో మన మీదికి విజృంభించి మనలో ఒక సంఘాన్ని మొదటా, ఇంకో సంఘాన్ని తరువాత చీలదీసి ఆణచాలనుకుంది. కాని త్యాగంతో రక్తబలితో, ప్రాణబలితో నిర్మించిన ప్రజా సంఘాలను సామ్రాజ్యవాదుల నక్క జిత్తులకు బలిచేస్తామా? లేదు లేదు. మనం విడివిడిగా దుర్బలంగా వున్ననాడు మన పతాకాలను చింకి పాతలుగా చించి, దగ్ధం చేసిన ప్రభుత్వం నేడు గుర్తిస్తున్నది. ప్రపంచంలో అయిదవ భాగం, నలభై కోట్ల ప్రజల భారతదేశం విముక్తమైనది. ఈ బలవత్తరమైన త్రివర్ణపతాకం నీడనే, అని. "ఇది చింకిపాత కాదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాద రాక్షసిని ఉరితీసి ఆకాశావకాశంలో ధృవంగా ఎగసిన త్రివర్ణ పతాకం. కీర్తిశేషులైన భారతవీరుల స్వప్నధనం. ఈ పతాకాన్ని నాశనం చేయడం బ్రహ్మతరం గాదు. సర్వకాలాల్లో హిమాలయ శిఖరాగ్రంలో ఠీవిగా ఆకాశంతో మంతనాలాడుతూ నర్తిస్తుంది మన మువ్వన్నెజెండా, ఈ జెండా మన స్వాతంత్ర్యానికి చిహ్నం. మన ఆత్మ బలానికి నిదర్శనం. మన భవిష్యత్తుకు ఉజ్జ్వలమార్గం"

"తిరంగా ఝుండా జిందాబాద్"

అన్నారు. ప్రజలు. రామచంద్రారెడ్డి జెండా పైకిలాగాడు. చాలా ఎత్తయిన గెడ కొసలో ఇంద్రధనుస్సు ముక్క మాదిరి సాక్షాత్కరించింది. త్రివర్ణపతాకం.



**"రెండు జెండాలూ ఒకటైనై" అని గొణిగాడు పోలీసు అధికారి. జమిందారు. వెనుకడుగు వేస్తూ మొహం తుడుచుకున్నాడు. "ఆకలేస్తోంది, పదండి...." అన్నాడు పోలీసు అధికారి. మళ్లీ నిశ్శబ్దం. కొద్ది సేపట్లో దొడ్డిదారిన 'దేవిడీ'లోకి చేరుకున్నారు ఇద్దరూ. ప్రజల నినాదాలు స్పష్టంగా వినిపించసాగినై. ఫలహారం చేస్తూ కూచున్నారు గదిలో, జమీందారూ, అధికారీ. ప్రజా సమూహం 'దేవిడీ'కి సమీపంగా వస్తున్నట్టు వినపడుతున్నై ధ్వనులు.**

తరువాత రామచంద్రారెడ్డి సుత్తీ కొడవలి ఎర్రజెండాను ప్రజలకు చూపిస్తూ "ప్రపంచ శ్రామిక వర్గానికి పట్టుకొమ్మ ఈ జెండా. ప్రపంచంలో ఆరవ భాగమైన రష్యాలో ఇదే జెండా నీడన సామ్యవాదం స్థాపించబడింది. కోట్లాది శ్రామికుల ఆశాజ్యోతి ఈ అరుణపతాక. ఈ పతాకను దించ సమకట్టిన హిట్లర్ పేరు మాసిపోయాడు. ఇవాళ ప్రపంచంలో మిగిలిన సామ్రాజ్య శక్తులకు ఎర్రజెండా గుండెలో గాలం మాదిరి వుంది. జమీందారీ, జాగీర్దారీ; పెట్టుబడిదారీ విధానాలను నిర్మూలించే ప్రళయకాళికయీ జెండా" అని గట్టిగా మాట్లాడేశాడు.

"లాల్ ఝుండా జిందాబాద్" అన్నారు ప్రజలు. రామచంద్రారెడ్డి అరుణ పతాకాన్ని పైపైకి లాగాడు. త్రివర్ణ పతాక లోని అశోకధర్మచక్రాన్ని, అరుణపతాకలోని ధవళనక్షత్రం ముద్దెట్టుకుంది. సాయంకాలపు సూర్యుడు రెండు జెండాల మీదా బంగారు కిరణాల హారం వేశాడు. ఎత్తయిన పున్నాగ, తెల్ల గన్నేరు చెట్లు పూల జడివాన కురిసినై.

ప్రజానీకం ముక్తకంఠంతో పాడారు.

"ఝుండా ఊంఛా రహే హమారా"

***(1947 "గెలుపు మనదే" కథా సంపుటి నుండి)***

వ్యాసం

# ఉర్దూ-సంస్కృత భాషల 'గంగా జమునా తహజీబ్' డా॥ షేక్ అబ్దుల్ ఘనీ

భాషల్లో సార్వజనీనకతను తెలిపే వ్యాసం...



డా॥ పత్తిపాక మోహన్
99662 29548

వందలాది భాషలు, భిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశంలో ఒక భాషా సాహిత్య సంస్కృతులు మరో భాషీయులకు చేరువయ్యేందుకు ఆదాన ప్రదానాలు తొలినాళ్ళ నుండి తోడ్పడుతున్నాయి. రవీంద్రుడు, శరత్, ప్రేమ్‌చందలు తెలుగు వారి కుటుంబ సభ్యుల్లో భాగంగా మారిపోయారంటే అందుకు తొలి, మలితరం రచయితలు, అనువాదకులు చేసిన అపారమైన కృషి కారణం. ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, సాహిత్య అకాడమి వంటి అనేక ప్రభుత్వ సంస్థలు తెలుగు కళ్ళకు ఇరుగు పొరుగు వెలుగులను పరిచయం చేశాయి. ఇటీవల ద్రవిడ విశ్వవిద్యాలయం మన పొరుగు భాషల సాహిత్యాన్ని తెలుగులోకి, తెలుగు సాహిత్యాన్ని ద్రావిడ భాషల్లోకి తెచ్చింది. దీనికి తోడు ఆయా రాష్ట్రాల సాహిత్య అకాడమీలు, భాషా సాంస్కృతిక శాఖలు, దక్షిణ భారత అనువాద పరిషత్, వివిధ సాహిత్య సంస్థల కృషి ఈ విషయంలో ఎన్నదగింది.

ద్రావిడ భాషలతో పాటు తెలంగాణలో ఉర్దూ, ఫారసీల విషయంలోనూ మొదటి నుండి విశేషమైన కృషి జరిగింది. అయితే సంస్కృతం-ఉర్దూల విషయంలో మాత్రం వేళ్ళమీద లెక్కపెట్టాల్సిందే. తొలి తరంలో



చూస్తే 'యజుర్వేదం'ను ఉర్దూలోకి చేసిన మౌల్వీ అబ్దుల్ హక్ విద్యార్థి, 'ఈశావాస్యోపనిషత్'ను 1958లో ఉర్దూలోకి అనువదించిన హబీబుర్రహ మాన్ శాస్త్రి వంటి కొందరు మాత్రమే మనకు కనిపిస్తారు. ఈ ఇద్దరే కాదు, డా. మహమ్మద్ షహీదుల్లా, ప్రొఫెసర్ ఇజ్రాయిల్ ఖాన్, డా.హనీఫ్ ఖాన్, యం.కె. దుర్రానీ, ప్రొఫెసర్ ఖాలిద్ బిన్ ఇబ్రాహీం ఖాన్, ప్రొఫెసర్ షరీఫ్, డా. నాహిద్ ఆబిదీ, పండిత్ గులామ్ దస్తగీర్ మొదలగువారు కూడా ఉర్దూ సంస్కృతాల్లో విశేషంగా కృషిచేశారు. వీళ్ళే కాకా ఇంకా అనేక మంది ఉండవచ్చు, నేను చదివింది, విన్నది ఈ కొందరి గురించే. ఇక తెలుగువారిలో మనకు డా. సామల సదాశివ, కాళోజీ, రామేశ్వర్‌రావు 'షాద్', జి.రాములు, డా॥ సి.నారాయణరెడ్డి, ఆచార్య గోపాలకృష్ణారావు, లక్ష్మణ్‌రావ్ పతంగే, పటేలు అనంతయ్య, 'కవిగారు' వంటి మూడు నాలుగు భాషలు తెలిసినవారు, పధ్నాలుగు భారతీయ భాషలు తెలిసిన పి.వి. నరసింహారావు రచనలు, అనువాదాలు చేస్తున్న అరుదైన వ్యక్తి డా॥ నలిమెల భాస్కర్ కనిపిస్తారు. ఇక నేటి తరంలో మెహక్ హైదరాబాదీ, అబ్దుల్ వాహెద్‌తో పాటు మరికొందరిని చూడొచ్చు. ఈ దిశగా పనిచేసినవారిలో మరికొందరు ఉండవచ్చు, నా పరిశీలనలో ఉన్న కొన్ని పేర్లు మాత్రమే ఇక్కడ ప్రస్తావించాను. 'గీటురాయి' పత్రికలో మాలిక్ సాబ్ మొదలుకుని, పవిత్ర ఖురాన్ మొదలు షరీయత్‌లు, ఇతర మత గ్రంథాలను అనువాదం చేసినవారు అనేక మంది ఉన్నప్పటికీ ఇక్కడ వారిని గురించి ప్రస్తావించడంలేదు. పైన పేర్కొన్న వారితో పాటు ఉర్దూ భాషను చదవకపోయినా ఇతర భాషల ద్వారా ఉర్దూ సారస్వతాన్ని, ముఖ్యంగా గజల్ సౌందర్యాన్ని తెలుగువారికి చేరువ చేస్తున్న ఆచార్య ఎండ్లూరి సుధాకర్, డా॥ పెన్నా శివరామకృష్ణలు, తెలుగు గజల్‌పై తొలి పరిశోధన చేసిన డా॥ పత్తిపాక మోహన్‌లు ఉన్నారు.

ఒక అరుదైన పనిగా, సంస్కృతం, ఉర్దూ, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో సమానంగా పనిచేస్తున్నవారిలో డా. షేక్ అబ్దుల్ ఘనీ కనిపిస్తారు. నాలుగు భాషల్లో అరుదైన పనిని తెలంగాణాకు చెందిన

వ్యాసం

రచయిత, అనువాదకుడు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు చేస్తున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డా॥ షేక్ అబ్దుల్ ఘనీ ఆ అరుదైన ఉర్దూ-సంస్కృత భాషల కవి, రచయిత, పరిశోధకుడు, అనువాదకుడు మరియు బాల సాహితీవేత్త. తన సాహిత్యరచనా విషయంలోనే కాక, విద్యార్థిగా కూడా డా. ఘనీది అరుదైన రికార్డు. ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతంలో ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి పూర్తి చేసిన ఉర్దూ మాతృభాషీయుడు ఈయనే. సంస్కృతంతో పాటు, హిందీ, ఉర్దూల్లోనూ ఎం.ఎ చేశారు. ఇంగ్లీష్, తెలుగుల్లో కూడా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రముఖ సంస్కృత ఆచార్యులు ముదిగంటి గోపాల్‌రెడ్డి, భీమ్‌సేన్ నిర్మల్, కప్పగంతుల కమల, బి. నరసింహాచారి మరియు నళినీ సదర్‌ల మార్గ దర్శనం ఘనీ పరిశోధనకు చక్కని ప్రోత్సాహం కలిగించగా, 'ముస్లిం కవులు సంస్కృత సాహిత్యానికి చేసిన సేవ' అంశంపై షేక్ అబ్దుల్ ఘనీ ఉస్మానియా విశ్వ




విద్యాలయంలో పిహెచ్.డి పరిశోధన చేశారు. ఖలీఫాలు మొదలు, ఢిల్లీ సుల్తానులు, మొఘలులు, భారతదేశం లోని వివిధ ప్రాంతీయ ముస్లిం పాలకులు సంస్కృతానికి చేసిన సేవలను తన పరిశోధనలో సాధికారికంగా చూపించారు. ఇవే కాక ఫారసీ భాషలోనూ జరిగిన పనిని గురించి కూడా ఇందులో చెప్పడం విశేషం. ముఖ్యంగా తొలినాళ్ళలో ఫారసీ ఉర్దూలలోకి అనువదించబడిన నల దమయంతి, రామాయణం, భారతం, భాగవతం, పంచతంత్ర, యోగ వాశిష్టం, పురాణాలు, సింగాసన బత్తీసి, ప్రభోధచంద్రోదయం, యోగ, కాళిదాసు రచనలు, సంగీతం వంటి వాటిపై జరిగిన పనులగురించి చెప్పడం ఇందులో చూడవచ్చు. ప్రాంతీయ పాలకుల సంస్కృత సాహిత్య సేవలో బీజాపూర్, ఫారుఖీలు, అహ్మద్‌నగర్ నిజాంషాహీలు, ఖుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలతో పాటు మాల్వా, కశ్మీర్, గుజరాత్, బెంగాల్‌లలో జరిగిన సంస్కృత సాహిత్య సేవలతో పాటు, సంస్కృతంలోకి వచ్చిన ఇస్లాం సాహిత్యాన్ని కూడా సమగ్రంగా తన సిద్ధాంత వ్యాసంలో చూపించారు ఘనీ. ముఖ్యంగా పవిత్ర ఖురాన్, జైనవిలాస్, ఖాన్ చరితం, ఆసిఫ్ విలాస, అల్లోపనిషత్, సర్ సయ్యద్ అహెమద్ ఖాన్ చరితం, ఫారసీక లోకోక్త, ఫిరదౌసి, గులిస్తాన్, రుబాయత్-ఈ-ఒమర్ ఖయ్యాం, గాలిబ్ కావ్యం, ఉమ్రావ్ జాన్ అదా వంటి సంస్కృత అనువాదాలతో పాటు మరికొన్ని ప్రసిద్ధ గ్రంథాల గురించి ఆయనిందులో పేర్కొన్నారు.

వీటితో పాటు పూర్వ ముస్లిం సంస్కృత పండితులు, పరిశోధకులైన అల్‌బరూనీ, మహమ్మద్ షా, అబ్దుల్ రహీంఖాన్ ఖానా, దారాషికో, అక్బర్ షాలతో పాటు నేటి ఆధునికులైన పండిత్ గులాం దస్తగిర్, ప్రొఫెసర్ మహ్మద్ ఇస్రాయిల్ ఖాన్, డా. నహిద్ అబిదీ, పండిత్ సయ్యద్ హుస్సేన్ శాస్త్రి, డా. మహ్మద్ హనీఫ్ ఖాన్ శాస్త్రి, డా. కిష్వర్ జబీ నస్రీన్, ప్రొఫెసర్ ఖాలిద్‌బిన్ యూసుఫ్ ఖాన్, డా. మహమ్మద్ షరీఫ్, డా, సల్మాబేగం, డా.షరీన్ జాఫ్రీ, డా. శాలిమా తబసుమ్, డా. వహీద్ నస్రూ, డా. మహమ్మద్ ఖాన్ దుర్రానీ, బి.సి.హుస్సేనీ, డా.ఎస్.కె. కరీంఖాన్, డా.మహమ్మద్ షహీదుల్లా, మహమ్మద్ పండిత్ హసీమ్ హజ్రా, డా. ప్రానీ, డా.కుసుమా రక్షమణి (థాయిలాండ్), ప్రొఫెసర్ ఫతేఉల్లా మొజ్తాబీల సాహిత్య సేవను ఘనీ అత్యంత విపులంగా ఇందులో వివరించడమే కాక ఉర్దూ-సంస్కృత సారస్వతాలతో పాటు రెండు భిన్న సంస్కృతీ సంప్రదాయాల గురించి, అవి భారతీయ జీవన విధానంలో ఏర్పరిచిన ఐక్యతా దారులగురించి, సూఫీ తదితరాల గురించి వివరించారు. ఉర్దూ సంస్కృత సాహిత్యాలపై వచ్చిన చక్కని పరిశోధనా గ్రంథాల్లో ఇదొకటి.

నిజానికి సంస్కృతం-ఉర్దూ భాషల కలయిక ఒక రకంగా అరుదనే చెప్పాలి. అందులోనూ ఉర్దూ భాషీయులకు సంస్కృత సాహిత్యాన్ని పరిచయం చేయడం ఒకరకంగా ఛాలెంజ్ లాంటిదే. దీనిని సుసాధ్యంచేసిన రచయిత, అనువాదకులు ఘనీ. ఆయన మాతృభాష ఉర్దూ, బాల్యం నుండి చదువుకున్నది ప్రాంతీయభాష అయిన తెలుగులో. వృత్తిరీత్యా పాఠాలు బోధిస్తున్న ఉద్యోగ భాష హిందీ, అనువాదాలు చేస్తున్నది ఉర్దూ, సంస్కృతం, ఆంగ్లం, తెలుగుతో కలిపి నాలుగు భాషల్లో. నాలుగు భాషల్లో దాదాపు నలభైకి పైగా రచనలు, అనువాదాలు, సంకలనాలు, బాల సాహిత్యాన్ని ప్రచురించిన ఘనీ సంస్కృతంలో భాసుడు రాసిన 'కర్ణభారం' ఏకాంకికను ఉర్దూలోకి అనువాదం చేశారు. కర్ణుని దానగుణాన్ని తెలిపే ఈ ఏకాంకికను ఉర్దూ పాఠకులకు అందించాలన్న ఆలోచనే గొప్పది. ఇదే కోవలో ఘనీ చేసిన మరో గొప్పపని సంస్కృత సాహిత్య చరిత్రను 'తారిఖ్ సంస్కృత్ అదబ్-1' పేరుతో ఉర్దూలో రాయడం. ఇది కూడా ఒక రకంగా సాహసమే. వైదిక సాహిత్యం, వేదాలు, మహా కావ్యాల పరిచయం ఉర్దూ సాహిత్య విద్యార్థులకు పరిచయం చేయడం ఈ రచనలో మూల ఉద్దేశ్యం. దీనికి ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమి వారి లిటరరీ అవార్డు లభించింది. అరుదైన రెండు భారతీయ భాషా సాహిత్యాలు, సంస్కృతుల అవగాహనకు, సమన్వయానికి ఈ గ్రంథం తోడ్పడుతుంద నడంలో సందేహం అక్కరలేదు.

కేవలం సాహిత్యానువాదం, రచనలతో




సరిపెట్టుకోలేదు ఘనీ. తొలినాళ్ళ నుండి ఉర్దూ, సంస్కృత సాహిత్యాల మధ్య సంబంధాలు, భారతీయ భాషయైన ఉర్దూ పైన 'జనని సంస్కృతంబు ఎల్ల భాషలకు' అని చెప్పబడే సంస్కృతం ప్రభావం ఏమేరకు ఉందో చూపించే ప్రయత్నం తన పరిశోధనలతో చేస్తున్నారు. ఆ దిశలో వచ్చిన గ్రంథమే "సంస్కృత్ అవుర్ ఉర్దూకే లిసానీ వ అదబీ రవాబిత్ వ తహజీబ్ హమ్ ఆహంగే". ఇందులో ఉర్దూ భాషపై సంస్కృతం ప్రభావాన్ని తనదైన కోణంలో శాస్త్రీయంగా చూపించే ప్రయత్నం చేశారు ఘనీ. అంతేకాక ఉర్దూ పద్యం, గేయం, వచన సాహిత్యంలో ప్రతిబింబించిన సంస్కృత సాహిత్యంలోని అంశాలను, విషయాలను, ప్రతిబింబాలను నిరూపించి చూపించారు. వీటితో పాటు రెండు భాషా సంస్కృతుల సమన్వయానికి దోహదం చేస్తున్న అనేక అంశాలు ఇందులో ఉండడం గమనార్హం.

2019లో ఘనీ రాసిన మరో గ్రంథం "దఖనీ జుబాన్-వ-అదబ్‌కే సంస్కృత్ అనాసిర్" కూడా ఈ కోవలోనిదే. దఖనీ ఉర్దూ భాషా సాహిత్యాలపై సంస్కృత ప్రభావాన్ని వర్ణించే గ్రంథమిది. కేవలం ఉర్దూలోనే కాక హిందీలోనూ తన పరిశోధనా గ్రంథాలను వెలవరించిన ఘనీ 5వ శతాబ్దికి చెందిన సంస్కృత కవి భర్తృహరి, 16వ శతాబ్దికి చెందిన హిందీ కవి అబ్దుల్ రహీం ఖానాల నీతి కావ్యాలపై తులనాత్మక అధ్యయనం చేశారు. నీతి అనేది మానవునికి మూలమని, వేరు వేరు కాలలకు, ధర్మాలకు, భాషలకు చెందిన దార్శనికులైన ఇద్దరు కవులు దానిని ఎలా నిర్వర్తించారో తన పరిశీలనలో చక్కగా చూపించారు. ఇది హిందీలో రాసిన గ్రంథం. ఘనీ కేవలం సంస్కృత, ఉర్దూ హిందీలకే పరిమితం కాలేదు, హిందీ అనువాదాలలో ఉర్దూ భాష ప్రభావం, హిందీ తెలుగు సమాన ఉచ్చారణా శబ్దాలు, భగవద్గీత తెలుగు అనువాదాలు వంటి వాటిపై చక్కని పరిశీలన, పరిశోధన చేసిన ఘనీ "భాషాయి ఆధార్-వివిధ్ స్వర్" పేరుతో హిందీలో సాహిత్య వ్యాస సంపుటి ప్రచురించారు. ఈశాన్య భారత గిరిజన బాలల కథలను అనువాదం చేయడమే కాక జానపద సాహిత్యంలో చక్కని పరిశోధనా పత్రాలను తన సంపాదకత్వంలో ప్రచురించారు.

పరిశోధనను తన నిరంతర వ్యాసంగంగా మలుచుకున్న ఘనీ తెలంగాణ సాహిత్య చరిత్రలో అపరిష్కృతంగా ఉన్న గ్రంథాలను సైతం పరిష్కరించారు. ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ దర్బార్‌లోని అధికారి రాజా గిరిధారి ప్రసాద్ బాఖీ 1890లో ఉర్దూలో రచించిన "శివ పురాణ్" ను సంస్కరించి ప్రచురించారు. ఉర్దూ లిపిలో ఉన్న దీనిని సంస్కరించడం ఘనీ చేసిన అరుదైన పని.

దేశంలోని వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్న ఘనీ యాభైకి పైగా పరిశోధనా పత్రాలు హిందీ, ఉర్దూ, సంస్కృతం, దఖనీ భాషలపై సమర్పించారు. వృత్తిరీత్యా హిందీ ఉపాధ్యాయులైన డా.ఘనీ హిందీలో పరిశోధనా పత్రాలతో పాటు మౌలిక రచనలు చేశారు. తెలుగులో అనువాదాలు చేశారు. బాల సాహిత్యాన్ని అనువాదం చేయడమే కాక స్వయంగా రచించారు. 'మౌలానా ఆజాద్', 'బాపు (గాంధీజీ)లను ఆంగ్లంలోరాసి పిల్లలకు కానుకగా అందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల హిందీ పాఠ్యపుస్తక రచనల్లో రచయితగా పాల్గొన్నారు. మణికొండ వేదకుమార్ సారథ్యంలో బాల చెలిమి ప్రతిష్ఠాత్మకంగా ప్రచురించిన తెలంగాణ బడి పిల్లల కథలను అనువాదం చేసిన ఘనీ, బాల సాహితీవేత్త డా. సిరి రాసిన 'అక్షరాలతో ఆట'ను కూడా ఉర్దూలోకి, తెలుగులో వచ్చిన బాలల స్వచ్ఛసర్వేక్షణ గేయాలు 'ఆకుపచ్చని పాట'ను 'హరేబరే గీత్'గా హిందీలోకి తెచ్చారు. నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా కోసం గతంలో బాల సాహిత్యాన్ని అనువాదం చేశారు. కేవలం సాహిత్యంతోనే కాదు వివిధ సామాజిక కార్యక్రమాల్లోనూ ఆయనది అంతే భాగస్వామ్యం. అందులో భాగంగా తాను పుట్టిన ఊరిలో ఉర్దూ అభ్యసిస్తున్న ఆర్థికంగా వెనకబడిన పిల్లలకు తమ సంస్థ మైనారిటీ డెవలప్‌మెంట్ కమిటి ద్వారా తన టీంతో కలిసి ప్రతియేడు జాతీయ విద్యా దినోత్సవం రోజు వారికి పుస్తకాలు, బ్యాగులను అందిస్తారు ఘనీ.

తన రచన, పరిశోధన, సాహిత్యకృషికి అనేక పురస్కారాలు, అవార్డులు అందుకున్న ఘనీ ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాజ్య కర్మచారి సాహిత్య సంస్థాన్ ప్రతియేడు హిందీయేతర రాష్ట్రాల్లో హిందీ భాషా వికాసానికి చేసిన సేవలకు అందించే లక్ష రూపాయల నగదు పురస్కారానికి ఎంపికయ్యారు. పదిహేను విభాగాల్లో పదిహేను మందికి ప్రతియేటా లక్ష రూపాయల నగదును అందించి సత్కరించడం ఈ పురస్కార విశేషం. తెలంగాణకు చెందిన డా. ఘనీకి 'శరత్‌చంద్ర చటోపాధ్యాయ పురస్కారం' రావడం దఖనీ భాషాసంస్కృతులతో పాటు, ఉర్దూ-సంస్కృతాలలో తెలంగాణలో జరుగుతున్న కృషికి లభించిన గుర్తింపు.

నాటి కవిత

# మనోబోధ

## కొలని గణపతి దేవుడు

కొలని గణపతి దేవుడు క్రీ.శ. 15వ శతాబ్దం. కాకతీయ ప్రతాపరుద్రుని వద్ద మంత్రిపదవి చేసిన కొలని రుద్రదేవుడు ఇతనికి ముత్తాత. శివయోగ సారం అనే శివభక్తి సంబంధమైన సంస్కృత రచనను తెలుగులోకి అనువాదం చేశాడు. అదీ కాక మనోబోధ పేరుతో మనస్సును సంబోధించి మనస్సును గురించి మనస్సు పోయే పోకడల గురించి ఎన్నోవిధాల తెలియజెప్పిన రచన మనోబోధ. ఇది సుమారు 450 పాదాల ద్విపద. ఇందులో కథ వంటిది ఏమీలేదు. కాని మనస్తత్వాల గురించి వివరించడం విశేషం. సామాన్యులకు కూడా అర్థమయ్యే పద్ధతిలో రాశారు.

ద్వి. మాయబంధులనేల మరిగెదవు మనస
చుట్టాలు పక్కాలు సుతులు సోదరులు
కలిమిలో సరి, వారు కలిమి కందినను
సిరివోయెనని తన్ను జేరంగ నీరు
కొంటె పెంపున మాన దూలపోనాడి
ఏమేడ? మీరేడ? యేమి పోరామి
అని పెక్కుభంగులనందంద పలుక
పగల సందడి నోర్చి వాసికిన్ బాసి
మాటలు తలపోసి మది నీవు కుందు
చుండుట కోపుదే ఉండవు మనస
ఎవ్వరెవ్వరి వారు ఏమి పోరామి
చావు మాన్పగ లేరు చాదోడ రాదు
తన చేయు పుణ్యంబు తనతోడు నీడ

# మర్కపిల్ల - దాగ్

ఆటవిక న్యాయం మానవ సంస్కృతిలో
భాగమయ్యిందని తెలిపే కథ...



డా॥ రూప్ కుమార్ డబ్బీకార్
99088 40186

రోహిణి ఎండపోత అతని చెమటతో తడిసి చల్లబడిపోతోంది. ఆడుకునే సమయం. మూడు గంటల టయానికి బయల్దేరిండు ఇంటి నుంచి. ఆడుకుంటోన్ని పిలిచి తిట్టి యాటల్ని చేతికంటగట్టి "దాగ్ ఏయించాలి, పశుల దవాఖానకి పోవాల పిలగా, రా తొరగా!" అంటూ ఆగమాగం చేసి "తాత వస్తడు పో ఎన్కాల" అని అదిలించినట్లే పంపింది గౌరుబాయి మనవణ్ణి. మర్కపిల్ల, బక్క గొర్రెను తీసుకొని నడుస్తుండు. అవి నడిచినట్లే నడిచి మొండికేస్తే, జీవాలకు కట్టిన తాళ్ళను కాసేపు కుడిచేత్తో, కాసేపు ఎడమ చేత్తో పట్టుకొని లాగుతుంటే అరచేతులు మంట పుట్టుకొస్తున్నయి. పదమూడేళ్లు దాటని లేత చేతులు. మద్దెమద్దెల యాష్ట పెట్టినా ఎట్లో అట్లా బార్‌పేట నుంచి మాన్యం చెల్క దగ్గరున్న పశుల దవాఖానకి వచ్చే సరికి గాలి గాలైపోయింది బద్రి పానం. దవాఖాన కాంపౌండులోకి రాగానే గొల్ల పర్వతాలకు చెప్పి రెండు జీవాల్ని మందల తోలిండు. మందల దూరి అవి కూడా బుద్ధిగా కదలకుండ నిలబడ్డయి. మందల అందరి యాటలు కల్సిపోతయి. గుర్తుగా వారి వారి గొర్లు, మేకల నడుంపై భాగాన వెంట్రుకలు ఒకటి, రెండు, మూడు వరుసలుగా, తల ఒక తీరుగా కత్తిరించి పెట్టుకుంటారు. బద్రికి తోటి వయసు పోరలు తోడు దొరికే సరికి ఆటల మునిగి యాటల్ని తెచ్చిన అలసట కాసేపు మరిసిపోయిండు. అందరితో కలిసి ఎండు పుల్లలు, సన్నకట్టెలు ఏరుకొచ్చి కుప్ప పోసిండు. సద్రున పరుగెత్తి డాక్టరు దగ్గర నుండి, ముందు భాగాన 'ఆకారంలో నున్న గుర్తు అచ్చోసిన ఇనుప సువ్వను 'దాగ్' వెయ్యడానికి లాక్కొచ్చినంతగా చేసి తీసుకొచ్చి కట్టెల మధ్య పెట్టి నిప్పంటించిండు. అక్కడున్న నల్గురు పెద్ద మనుషులు మెచ్చుకుంటే పొంగిపోయి కుప్ప దగ్గర మోకాళ్ళ మీద కూసోని 'ఉఫ్ ఉఫ్' మని ఊదుతూ మంట నెగదోసిండు. మంట లోపల ఇనుప సువ్వను గుచ్చి అటూ ఇటూ తిప్పుతూ ఇచ్ఛగ చూస్తున్నడు.

"బడికి పోయినావురా బద్రి" - జమాల్ అడిగాడు. జమాల్ కూడా తన మేకలను దాగ్ వేయించడం కోసం తెచ్చిండు. నడి వయసు, ముప్పై ఐదేళ్లు ఉండొచ్చు.

"పోయిన మామ"

"ఏ క్లాసులున్నవ్ బేటా! సార్లు పాఠాలు బాగా చెప్తరా?"

"ఏడవ క్లాసులే, చెప్తరంటే చెప్తరు. నాకే సరిగా అర్థం కావు. లెక్కలంటే భయం. తెలుగు నాన్ డిటేల్‌ల కథలంటే ఇష్టంగుంటది. బాగింటా!" సరదాగా చెప్పుకు పోతుండు బద్రి.

జమాల్ అప్పుడే వచ్చిన నర్సోజిని చూస్తూ, "క్యా మాము తేర పోత్ర ఐస బోల్తా?! పాఠాలు సమాజ్ గావంట! కహానీలంటే పసంద్ పోరగాడికి "వీడింకేం చదువుతడు. నెమ్మదిగా కులం పని నేర్పించు ఇప్పట్నుంచే, ఎందుకైనా మంచిది?" అంటూ సలహా పారేసిండు.

ఆ మాటలు విని నవ్వి వూర్కున్నడు నర్సోజి. నర్సోజి, బద్రికి తాత. వెనుక నిల్చున్న తాతను చూసి ధైర్యం తెచ్చుకున్నడు బద్రి. వెళ్లి తాత ఎన్క నిల్చొని ఇక నీ పని నువ్వు చూస్కో అన్నట్లు చూపు పెట్టిండు. గొర్లు, మేకలు కలిసిన మందకు వీళ్లకు ఏమి తేడా కనబడదు బద్రికి. ఆరె కటికోళ్ళు, తురక కటికోళ్ళు, గొల్లోళ్లు అందరూ వచ్చి కలిసి మంచి చెడు మాట్లాడు కుంటరు. యాటల బేరం సంగతి, మాంసం దుకాణాల వ్యవహారాలు, ఇండ్లల్ల జరిగే భాగోతాలన్నీ ఏకరువు పెట్టు కుంటారు. ఆ గంట సేపు వాళ్ళదో వింత ప్రపంచం. ముచ్చట్లు జరుగుతుండగానే కాంపౌండర్ వస్తడు. తలా రెండు రూపాయలు తీస్కొని ఇనుప సువ్వను కాలుతున్న నిప్పులనుంచి తీసి యాట ఎడమ తొడ మీద సుయ్యి మని అంటిస్తాడు. అంత మటుకు వెంట్రుకలు కాలి 'S' ఆకారంలో అచ్చు అదే 'దాగ్' పడ్తది. అంటే ఈ గుర్తుంటే యాట



ఆరోగ్యంగా వున్నదని, దీని మాంసం అమ్మడానికి, తినడానికి పనికొచ్చేదని, డాక్టర్ అనుమతి ఇచ్చినట్లు రుజువన్న మాట.

కాంపౌండర్‌కు రెండు రూపాయి లెందుకని అడిగితె, "చాయ్ పైసలకు తీసుకుంటడు లే రా!" అని అన్నడు తాత. దాగ్ పెట్టిన తర్వాత తిరిగి ఆ మందలకెళ్ళి ఎవరి యాటల్ని వాళ్లు తీసికెళ్తరు. దాగ్ కార్యక్రమం అయ్యేంత వరకు బద్రికి ఆట విడుపే. తన ఈడు పిల్లలు వస్తరు, వాళ్ళతోటి ఆటలు. దవాఖాన కాంపౌండ్ లోపల వున్న చిలికేశ్వరం, కానుగ, చింత చెట్ల కొమ్మల మీదెక్కి దుంకులాటలు, రేగుకాయల చెట్ల కొమ్మలు ఒంపి, పచ్చి ఒగరు, కసరు కాయలు తెంపుడు, రేగు ముండ్లు గుచ్చుకొని మంటలేస్తే బాధ అదో సరదా. ఎంతో ఇష్టంగా ఏరుకున్న తుమ్మ కాయలతో జేబులు నిండేవి. అవ్వ వాటిని సేరు కొలత తవ్వను తిరగేసి దాని మీద రుద్ది కాటుక తీసేది. అందరూ పరాచి కాలాడుతుంటే కాస్త సిగ్గు పడటం, తప్పించుకోవటం, నవ్వటం, ఏడవటం అంతా అల్లరి, సరదాయే. పనై పోగానే తాత మళ్ళీ బద్రికి పని అప్పజెప్పిండు. "జాగ్రత్తగా తీస్కపోరా, మర్క పిల్ల హుషారుగా వుంటది, విడిపించుకొని పోగాల, జర జతన్ సే" అంటూ బద్రి చేతుల పది పైసల బిళ్ళ పెట్టిండు నర్సోజి. ఏమైనా కొనుక్కోపొమ్మని. మూతి ముడుసుకొని తల పైకెత్తి తాత వైపు చూసిండు బద్రి.

"ఏందిరా, ఏమైంది?" నర్సోజి కనుబొమ్మలెగరేస్తూ అడిగిండు.

"సీన్మాకు పోత ఇంకో పదిపైసలివ్వు నేల టికెట్టుకే గదా?! తోటోళ్లు అందరూ పోతుండ్రు ఫస్ట్ షోకి. గడ్డ మీద ప్రేమ్ టాకీస్‌ల. కాంతారావు కత్తి ఫైటింగ్ సిన్మా. మాయలు మంత్రాలు గూడ వున్నయి" అంటూ అలిగిన మొహం పెట్టిండు బద్రి.

"శనివారం పగటి ఆటకు పోక పోదువారా?" అంటూనే మరో పది పైసలిచ్చి కదిలిండు నర్సోజి, గొల్ల పర్వతాలను వెంటబెట్టుకొని. సిన్మా సంబురం మనసులో నింపుకొని యాటల్ని తీసుకొని ఇంటి బాట పట్టిండు. యాటల్ని చూడగానే బద్రికి బుగులు పట్టుకుంది. "సక్కగ నడవవు, సతాయిస్తవి. మొరాయిస్తవి. ఎట్ల కొంటబోవాలో ఏమో!? వచ్చేటప్పుడు అంతగా సతాయించలేదు, బాగనే నడిచినయ్" అనుకుంటూనే తాడు పట్టుకొని యాటల్ని అదిలించి నెమ్మదిగా ఇంటిదారి పట్టిండు. మాన్యం చెల్క దాటింది. మధ్యల సన్నకాలువ ఒకటుంది, అది దాటగానే డొంకెబడి సర్కారు తుమ్మచెట్లు గుంపు గుంపుగా, ఏపుగా పెరిగి వున్నయి. మనుషుల సందడి తక్కువ. గౌరె, తల నేలకేసి నెమ్మదిగా ముందుకు నడుచుకుంటూ పోతూ వుంది. మర్కపిల్ల మధ్య మధ్యల ఆగిపోతూ నడవడానికి మొరాయిస్తూ సతాయిస్తుంది. తాడు పట్టి లాగినా ముందుకు కదలదు. గౌరె ముందర. మర్క వెనక. రెండింటికి లంకె కుదరక బద్రికి విసుగు, కోపం తెప్పిస్తున్నాయి. బద్రి కోపం పెరిగిన కొద్దీ మర్కకు మొండితనం పెరుగుతూ వచ్చింది. యాటలు తాళ్లు వదిలించుకొని యాడ కాట కలిసిపోతాయోనన్న దిగులు పట్టుకుంది బద్రికి. వెయ్యి దేవుళ్లను మొక్కుతున్నడు. కాసేపు సతాయించ కుండ ఇంటి గడపకు చేరేదాకా బుద్ధిగా నడవాలని. అటు ఏ దేవుడు వినిపించు కోలే! ఇక్కడ మర్క పిల్ల వినడంలే. రెండడుగులు ముందుకు వేస్తె రెండు నిమిషాలు ఆగిపోతుంది. గౌరె ఈ ప్రపంచంతో నాకేం పని అన్న తీరుగ భావరహితంగా వెళ్ళిపోతోంది.ఎటు పోతుందో గౌరెకు తెల్వదు, ఎటెల్తాదో బద్రికి తెల్వదు. గౌరెను నిలుపుదామంటే మర్కను వదలాలి! మర్కను వదిలితే దీనమ్మ పరిగెత్తుకుని పోతది!? కాట

**గౌరుబాయి** ఎటూ తోచక, ఏం చెయ్యాలో తెల్వక కాలు గాలిన పిల్లిలా అటూ ఇటూ, లోపలికి బయటికి పిచ్చిగా తిరగసాగింది. చిన్న కొడుకు రాంజీ కోసం ఎదురు చూస్తే అతని జాడ లేదు. తాత వస్తే ఇంకేం గొడవయితదోనని బద్రి భయంతో ముందు సాయమాను అర్రల కిటికీ చప్టా మీదికి ఎక్కి కాళ్ళు ముడుచుకొని కూర్చుండు. యంత్రంలా ఇంటి పని, వంట పని చేసుకుపోవడం తప్ప బద్రి తల్లి ఇవేం పట్టించుకోదు. తండ్రి చిన్నపాటి ఉద్యోగస్తుడు.

కలిస్తే అవ్వ తిట్లు. తాత తన్నులు. గీ లంజ ముండలు గింత గనం యాష్ట పెట్టేదెవ్వరూ చూడరు!" అంటూ గొణుక్కుంటున్నాడు బద్రి. ఎటూ తేలక, గండం నుంచి ఎట్లా బయట పడాలో తెల్వక తల్లడమల్లడమవుతున్నడు. కాసేపు తాడు వదులు చేసి నిల్చున్నడు. మెడకు ఉచ్చులా వున్న తాడు కాస్త వదులయ్యే సరికి మర్క తన కాళ్ళను వదులు చేసి బద్రి వైపు జాలిగా చూసింది. బద్రికి ఒళ్ళు మండిపోతుంది. సాయంకాలం పూట. చీకటి కమ్మితే కష్టం. పైగా సిన్మా టైమవుతుంది. సిన్మా టైంకు ఆలస్యం ఐతే దోస్తులంతా ఎల్లిపోతరేమోనని ఆందోళన. సినిమా మతికి రాగానే బద్రిలో ఆత్రం ఎక్కువయ్యింది. బుదగించినట్లు మర్క తోక దగ్గర ప్రేమగా నిమిరి నెమ్మదిగా ముందుకు అదిలించిండు. బదులుగా రెండడుగులు ముందుకు వేసి మళ్ళీ ఆగిపోయింది. బద్రి కోపం కట్టలు తెగింది. బలమంతా కూడదీసి గుంజుతున్నడు తాడును. కచ్చ గట్టినట్లు అంతే పట్టుదలతో తన ముందరి రెండు కాళ్ళను గట్టిగా నేలకు అదిమి పట్టి బలమంతా కూడదీసి ముందుకు కదలడం లేదు. ముందుకు లాగే ప్రయత్నంలో చెమటలు కక్కుతున్నడు బద్రి. శరీరం సన్నగా వణుకుతోంది. విసుగు, అసహనం, బద్రి ఓపిక నశించిపోతుంది. "లంజముండ కదుల్త లేదు. ఎంత మొండికేసింది. నడు, నడవ్వే నీయమ్మ.." బద్రి అదిలిస్తుండు. బూతులు తిడ్తుండు. ఎంత బలంతో లాగినా రవ్వంత కదలటం లేదు. తాడు కొద్దిగ వదులు చేసిండు. అంతే అది కాళ్ళు కాస్త వదులు చేసి ముందుకురికి ఒక్క పోటు పొడిచింది. దాని కొమ్ములు చిన్నగా, వాడిగా వుండి ఎడమ చేతికి గుచ్చుకొని చివ్వున రక్తం చిందింది. బద్రి కండ్లల్ల నీళ్ల తిరిగాయి. బాధతో ఒక్క సారిగా 'అమ్మా' అని మూలిగి తాడును వదిలేసాడు. ఇదే అదనుగా మర్క పిల్ల సర్కారు తుమ్మ కంప చెట్లలోకి పరిగెత్తుకు పోయింది. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో అట్లాగే నిల్చుండి పోయాడు. ఒక వైపు భయం, తాత ఏమంటాడోనని. మరోవైపు కోపం, చిరాకు, అలసట. కాసేపు తండ్లాడిండు. దాని వెనకాల పరిగెత్తిండు. దొంగాట ఆడినట్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకు పోతుంది. ఎంత తండ్లాడినా చేతికంద లేదు. గొర్రె పిల్ల ఆగకుండా ముందుకెళ్లి పోతూనే వుంది. ఇగ మర్క చిక్కదన్న నిర్ణయానికొచ్చి దాన్ని వదిలేసి, గొర్రె పిల్లనే తోలుకుంటూ భయం భయంగా, బిత్తర చూపులతో ఇంటికొచ్చిండు. గౌరు బాయి బద్రిని చూసింది. మొహం వేలాడేసుకొని బెదురు చూపులతో వున్నడు. వెంట మర్క కనబడక పోయేసరికి కంగారుపడి అడిగింది.

"యాట పిల్ల ఏదిరా!?" ఒక్క దాని తోటే తిరిగొస్తివి? "

"తుమ్మ కంపలకి పరిగెత్తుకు పోయింది. ఎంత బడ్డి, చేతి కందలే" బెదురుగానే చెప్పిండు బద్రి.

"ఏ పని సక్కగా చెయ్యవు కదరా, ఎట్ల చేద్దు?! ఎవర్నని పంపుదు వెతకడానికి. చీకటి పడొస్తుంది."

"ఏం ఆపతొచ్చిందని ఆగం మీద పడి ఇంటికొస్తివి. కాసేపు నిమ్మళంగా వుండి వెతికి వెంట పట్టుకు రాక అడవిల వొదిలి ఒస్తివేందిరా.. నీ మొల్తాడు దెంప.." గౌరు బాయి తిట్ల ప్రవాహం సాగిపోతూనే వుంది.

చేసిన నిర్వాకానికి సినిమా మాట కూడా ఎత్తలేకుండా పోయిండు బద్రి. దోస్తులొస్తే సైగ చేసే పంపేసిండు, తన అదృష్టానికి తిట్టుకుంటూ." తన తప్పేముంది, కావాలని వదిలేసిన్నా? ఎంత జేసినా కదలక పాయె! రాక పాయె! చివరికి తాడోదిలించుకొని.. తుమ్మ కంపల ల్లకి!! ఎంత యాష్ట పెట్టింది. మంకు ముండ. దొరికితే దాన్ని తెల్లారే ముందుగానే 'హలాల్ చెయ్యాలె. దాని దుంప తెగ' అంటూ అవ్వ మీది కోపం, కసి అంతా మర్కపిల్లను తిడుతూ తీర్చుకుంటున్నడు.

గౌరుబాయి ఎటూ తోచక, ఏం

> **గొర్రె తల నేలకేసి నెమ్మదిగా ముందుకు నడుచుకుంటూ పోతూ వుంది. మర్కపిల్ల మధ్య మధ్యల ఆగిపోతూ నడవడానికి మొరాయిస్తూ సతాయిస్తుంది. తాడు పట్టి లాగినా ముందుకు కదలదు. గొర్రె ముందర. మర్క వెనక. రెండింటికి లంకె కుదరక బద్రికి విసుగు, కోపం తెప్పిస్తు న్నాయి. బద్రి కోపం పెరిగిన కొద్దీ మర్కకు మొండితనం పెరుగుతూ వచ్చింది. యాటలు తాళ్లు వదిలించుకొని యాడ కాట కలిసిపోతాయోనన్న దిగులు పట్టుకుంది బద్రికి.**

చెయ్యాలో తెల్వక కాలు గాలిన పిల్లిలా అటూ ఇటూ, లోపలికి బయటికి పిచ్చిగా తిరగసాగింది. చిన్న కొడుకు రాంజీ కోసం ఎదురు చూస్తే అతని జాడ లేదు. తాత వస్తే ఇంకేం గొడవయితదోనని బద్రి భయంతో ముందు సాయమాను అర్రల కిటికీ చప్టా మీదికి ఎక్కి కాళ్ళు ముడుచుకొని కూర్చుండు. యంత్రంలా ఇంటి పని, వంట పని చేసుకుపోవడం తప్ప బద్రి తల్లి ఇవేం పట్టించుకోదు. తండ్రి చిన్నపాటి ఉద్యోగస్తుడు. చాలాసార్లు ఆఫీసు నుండి అటే స్నేహితులతో కలిసి ఏదో ఒక సినిమాకి వెళ్లిపోతుంటాడు. పెద్దోళ్లంతా హాయిగానే వున్నట్లనిపించింది బద్రికి. తనకేనా ఈ తంటంతా! అని అనుకుంటూ దిగులు మొహంతో కూసున్నడు.

గోడ గడియారం గంటలు కొడతావుంటే లెక్క బెట్ట సాగాడు. ఏడు గంటలు కొట్టింది. చీకటి పడింది. ఎక్క బుడ్లు, కందీలు వెలిగించి దిగూట్లల్ల పెట్టసాగింది గౌరు బాయి. బయట వాకిట్ల తాత గొంతు వినబడుతోంది.

"ఎక్కడే ఈ పిల్లగాడు, ఉన్నడా! సినిమాకు పోయిండా?! యాటల్ని భద్రంగా గొంటపోరా అంటే మర్కను వదిలేసి వచ్చిండు.." నర్సోజి గొంతు,

గౌరు బాయిని ఉద్దేశించి మాట్లాడుతుండు.

బద్రి భయంతో బిక్కచచ్చిపోయి వున్నాడు. ఇప్పుడిక మహాభారతమే ఉంటది పో! అని మనసుల అనుకుంటూ గుండె గట్టి చేస్కుండు. శాపనార్థాలు, తన్నులు, తిట్లు తినడానికి సిద్ధపడుతూ. ఒక్కసారి నిర్ణయం తీసుకునేసరికి అతనికి ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. భయం నెమ్మదిగా తగ్గి మనసు నిమ్మలపడ సాగింది. అతనికే అర్థం కాలే. తనేం చేసిండిపుడు. ఏదైతే అదైంది అని శిక్షకు సిద్ధపడిండు, అంతేగా. అతనికి ఏదో ఒక గొప్ప రహస్యం కనుగున్నంత సంతోషం కలిగింది. అప్పటిదాకా వున్న బుగులు మాయమైంది. సినిమా చూసే అవకాశం పోయిందన్న చింత కూడా మాయమైంది.

తాత వెంట గొల్ల పర్వతాలు వున్న సిగ్నల్స్ అందుతున్నాయి బద్రికి. 'మే.. మే..' అంటూ మేక పిల్ల అరుపులు వినపడుతూ వుంటే ఆశ్చర్యంతో నెమ్మదిగా కిటికీ తలుపులు కొద్దిగా తెరిచి బయటికి చూసి అదిరిపోయిండు. ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది. గొల్ల పర్వతాలు చేతిలో తాడు. అది మర్క పిల్ల మెడకు కట్టేసి వున్న తాడు. కళ్ళు నులుముకున్నాడు. కల గాదు గదా! అనుకున్నాడు. అస్సలు కాదు. బయట అరుగు మీద మర్క పిల్ల అమాయకంగా ఏమి ఎరగనట్లు చూపులు పెట్టి నిలబడింది. దాని దవడలు కదులుతూ వున్నాయి. ఇరామం లేకుండా నెమరేస్తూ వుంది. "లంజముండ నన్నింత తిప్పలు పెట్టి ఎంత హాయిగా వుంది." అని అనుకున్నాడు. నెమ్మదిగా కిటికీ చప్తా దిగి వరండాలోకి వచ్చాడు. తాత మాటలు వినబడుతూనే వున్నాయి.

చిన్నబుడన్ కొడుకు వచ్చి చెబితే తెలిసింది. "దాదా, తుమ్హారి బక్రి - ఆ సర్కారు తుమ్మ కంపల్ల కనబడ్డది. బద్రి 'దాగ్' పెట్టించిన బక్రీనే అది. పశుల దవాఖానల చూసిన. తప్పించుకు పోయిందేమో! వదిలేసి పోయిండు పిలగాడు. చూసి రా పో!" అంటే పర్వతాలను వెంటబెట్టుకొని వెళ్లి చూస్తి. ఆ డొంకలల్ల, కంప చెట్లల్ల కాసేపు వెతికితే అక్కడే వుంది. పర్వతాలు దగ్గరికెళ్లి బుదగరిస్తే చేతికందింది. గా బుడన్ సాబ్ కొడుకు చెప్పక పోతే యాడికి పోయేదో కదా! మంచిగయ్యింది వచ్చి చెప్పిండు.. అంటూ నర్సోజి వివరిస్తూ పోయిండు.

"అవ్, బుడన్ తాత కొడుకంటే ఇస్మాయిల్ చిచ్చా! దాగ్ పెట్టే దగ్గర అతనే మర్కపిల్లను మంద నుంచి లాక్కొచ్చి ముద్దరేయించిండు, "అభీ బచ్చ హై, వో క్యా పక్ డేగా.." అంటూ ముందుకొచ్చి మదద్ చేసిండు. రెండు గంటల ముందు జరిగిన సంఘటన బద్రి మనసులో మెదిలింది.

"మేకపిల్లను దొడ్ల కట్టేసి రా పోరా!" పర్వతాలకు ఆజ్ఞ జారీ చేసిండు నర్సోజి.

పర్వతాలు యాట పిల్లను తీసుకొని ఇంటెనకాల దొడ్లోకి పోతూ నా వైపు ఓ చూపు చూసి కన్ను గీటి నవ్వుతూ పోయిండు.

"గట్లోదిలేసి పోతావురా పిలగా! గింత సబర్ లేకుంటే ఎట్ల బిడ్డ" అని నెమ్మదిగానే మందలించినట్లు చెప్పి వూర్కున్న తాతను చూసి నమ్మలేక పోయిండు. ఇంత అల్కాగ పనైపోతది, గీ యాట పిల్ల ఇంత తొందరగా దొరుకు తుందని, ఇంత ప్రశాంతంగా తుఫాను సద్దుమణుగుతదనీ అనుకోలేదు. ఈ రోజు సినిమా పోతే పోయింది, శనివారం పోవచ్చులేనని, గండం గడిచినందుకు సినిమా చూసినంత ఆనందం కలిగి తనకు తాను సర్ది చెప్పుకొని సంబరపడి పోయాడు.

కాలం కరిగిపోతదేమోగాని అనుభవం, జ్ఞాపకాలు మాత్రం మిగిలిపోతాయి. ఐనా ఈ సంఘటన ఇప్పుడెందుకు యాదిల కొచ్చింది.

బద్రి, ఆఫీసులో ఫైల్ మీది కాగితాలెగరకుండా పెట్టిన ఎడం చేతి మీద మరక తనకు గత కాలపు సంఘటనని యాదికి తెచ్చింది. ఔను, మర్కపిల్ల పొడిచిన గుర్తు అచ్చు 'దాగ్'లా మిగిలింది. అది మరక గాదు, బద్రికి ఒక జీవిత పాఠం.

అవ్, ఆ మేక పిల్ల నిరోధించడంలో తప్పేంటి. దాని చర్యను మర్ల బద్ద చర్యగా ఎందుకు తీసుకోకూడదు?! దానిదీ జీవితమే కదా ! అమాయక జీవి. ఏ తప్పు చేసిందని?ఎవ్వరికి అన్యాయం చేసిందని? ఎవరిని గాయ పరిచింది? ఏం లేదే ! నోరు వాయి లేని జీవి కదా, దాని సంవేదనలను, బతుకు మీది తీపిని గమనించకుండా మనిషి ఎంత క్రూరంగా ప్రవర్తిస్తున్నాడు కదా?! దాని తొడ మీద ఇనుప సువ్వను ఎర్రగా కాల్చి వాత పెడితే దానికి బాధ కలగదు!? దానికి అచ్చు (దాగ్) వేసి జీవితానికి చరమాంకం పాడటం అన్యాయం కాదా! బద్రికి ఈ చర్య అంతా అన్యాయంలా అనిపించ సాగింది. కానీ, ఆ ఆటవిక న్యాయం మానవ సమాజం, సంస్కృతిలో ఒక భాగమై పోయిందన్న వాస్తవం అప్పుడు ఆ మనిషి పిల్ల బుర్రకు సమజ్ గాక పోయింది.

ఏదో విపత్తు ఎదురు కాబోతున్నది అన్న సందేహం కలిగినపుడు అంతరాత్మ పిలుపు మేరకు ప్రతిస్పందనగా మనసు ఎదురు తిరిగే స్వభావాన్ని ఆయుధంగా మలుచుకుంటుంది కాబోలు. బలహీనమైన ప్రాణి నిస్సహాయ స్థితిలో వర్తమానం నుండి దూరంగా పారిపోయే ప్రయత్నం చేస్తుంది. బద్రికి తన జీవితం కూడా దొడ్లో గుంజకు కట్టేసిన మర్క పిల్లలా మారిపోకూడదని నిశ్చయించు కున్నాడు. బలహీన జాతులపై ఆధిపత్యాల అమానుషత్వాన్ని నిరోధించాల్సిందే. ప్రశ్నించేతత్వంతో చైతన్యమే కరదీపికలా సమాజంలో వెలుగు నింపాలి. బలహీన వర్గాలకు అండగా నిలవాలి. అదే లక్ష్యంతో ఈ రోజు బద్రి ఉద్యోగుల సంఘానికి వయసుతో నిమిత్తం లేకుండా తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు.

చేజారిపోతున్న జీవితాన్ని తిరిగి చిక్క బట్టుకున్న ధీమాను తన తాత ముఖంలో అతను దర్శిస్తున్నాడు.

సమాజం

# నందగిరి ఇందిరాదేవి కథలు - తీరుతెన్నులు

నాటి కథాశిల్పంలో సామాజికత....



డా॥ సయ్యద్ ఆఫ్రీన్ బేగం
9908028835

సాహిత్య ప్రక్రియల్లో కథకు విశేషమైన స్థానం ఉంది. కథలు రాయడానికి, చదువుకోవడానికి కూడా తేలిగ్గా ఉంటాయనేమో కథలే ఎక్కువగా కనబడతుంటాయి. కథల్లో మనకు అనేక రకాల కథలు దర్శనమిస్తాయి. ఒక్కో రచయితది ఒక్కో బాణి. కొందరు రచయితలు కొన్ని రకాల కథలే రాయగలుగుతారు. కొందరు అన్ని రకాల కథలు ఆవిష్కరించగలుగుతారు. అలాంటి రచయితల్లో తెలంగాణ తొలి తరం రచయిత్రి నందగిరి ఇందిరాదేవి ఒకరు. ఆమె రాసిన ఒక్కో కథ ఒక్కో విధంగా రూపుదాల్చుకొని ఎందరో పాఠకులను అలరించాయి. ఆమె ఆ కాలంలోనే అందించిన మచ్చుకు కొన్ని కథలను పరిశీలిద్దాం.

**పందెం**

సహజత్వాన్ని చిత్రించడంలో ఇందిరాదేవిది అందెవేసిన చెయ్యిగానే చెప్పుకోవచ్చు. ఈమె కథల్లో ఎక్కువగా సహజత్వం కనిపించినా ఏ కథకు ఆ కథే విభిన్న తరహాలో సాగిపోతూ అందరిని ఆకట్టుకుంటాయి. ఈ కథలో సేటు రాజారాం ఇంట్లో మిత్రులు పార్టీ చేసుకోవడం, పనిమనిషి లక్ష్మణ్ ఖాళీ అయిన గ్లాసుల్లో వైను పోయడం, వాళ్లు వేసుకున్న దుస్తులు, వాళ్ల భావాలు ఇలా ఆ సన్నివేశంలోని ప్రతి అంశాన్ని కూలంకషంగా వర్ణించిన తీరు ఆ దృశ్యం పాఠకులకు కళ్లముందు కానవస్తుంది. ఇంతకన్నా రచనలకు పరమార్థం ఏముంటుంది? పాఠకులను కథలో లీనం చేయడమే రచయిత లక్ష్యం. ఆ లక్షణం ఈ కథలో చివరి వరకు కనిపిస్తుంది.

స్నేహితుల మధ్య చర్చ పెరిగిపోయింది. చర్చ యావజ్జీవ శిక్ష, ఉరిశిక్ష వైపు మళ్లింది. ఈ రెండిటి ఉద్దేశం వ్యక్తుల ప్రాణాలు తీయడమే. తప్పుచేసిన వారిని మంచి మార్గంలో నడిపించడానికి బదులు వాళ్ల ప్రాణాలు తీయడమంటే దెబ్బతగిలిన వేలుకు మందు వేయ కుండా, వేలును పూర్తిగా కోసివేయడం వంటిదే అనే అభిప్రాయం ఈ కథలోని లలితా ప్రసాదు పాత్ర ద్వారా పలికించారు. సామాజిక చైతన్యం విషయంలో రచయిత్రి అభిరుచికి ఈ అభిప్రాయం అద్దం పడుతుంది.

చర్చ ముదిరిపోయి పందెం కాసేవరకు వెళ్లింది. ఈ కథ విభిన్నంగా ఉందని చెప్పడానికి ఈ పందెమే నిదర్శనం. నరోత్తమ దాసు పదేళ్లపాటు సేటు రాజారాం ఏర్పాటు చేసిన గదిలో ఏకాంతంగా అంటే ఖైదీగా ఉండాలి. అలా ఉండగలిగితే సేటు రెండు లక్షల రూపాయలు ఇచ్చుకోవాలి. అదీ పందెం. రచయిత్రి అందించింది భిన్నమైన కథాంశమని ఒప్పుకొని తీరాల్సిందే.

స్నేహితులు ఇద్దరిని రెచ్చగొట్టి ఇలా పందెం వేయించి ఇరికించడం గమనిస్తే ఇలాంటి స్నేహితులతో జాగ్రత్తగా ఉండాలనే హెచ్చరిక మనకు కనిపిస్తుంది.

నరోత్తమదాసు పందెం డబ్బుల కోసం ఏకాంతంగా (ఖైదీగా) ఉండి అనుభవించిన మానసిక వేదన ఈ కథలో కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. పందెం కాచి ఏళ్లు గడుస్తున్నాయి.సేటు రాజారాంలో ఆందోళన మొదలయింది. ఓడిపోతాడని అనుకున్న నరోత్తమదాసు ఇంకా శిక్ష అనుభవిస్తుంటే రెండు లక్షలు ఇవ్వవలసి వస్తుందని రాజారాంలో అలజడి మొదలయింది. డబ్బుకోసం ఇద్దరు మనుషులు విభిన్నంగా ఎలా ఆలోచిస్తారో వ్యక్తమయింది. డబ్బులు ఎగ్గొట్టడం కోసం రాజారాం అతన్ని చంపాలను కోవడం మనిషికి డబ్బుపై ఉన్న వ్యామోహం మానవత్వంపై ఉండదనేది తేటతెల్లమవుతుంది. మరో పక్క నరోత్తమదాసు ఏకాంతం అనుభవించి విరక్తిలోకి వెళ్లిపోయాడు. డబ్బు అవసరం లేదనుకున్నాడు. ఏకాంతంలోనుండి తప్పుకుందామనుకున్నాడు. అందుకు సంబంధించి ఓ ఉత్తరం రాత్రి రాసిపెట్టాడు. తెల్లవారే వెళ్లిపోతానని కూడా ఆ ఉత్తరంలో పొందుపరిచాడు. నరోత్తమదాసును హత్య చేయడానికి

సమాజం

వచ్చిన సేటు ఆ ఉత్తరం చదివి అవాక్కయ్యాడు. ఈ కొసమెరుపుతో ముగిసిన ఈ కథ మనుషుల మధ్య వ్యత్యాసాన్ని మానసిక సంఘర్షణలను ఆవిష్కరించి అందరిని ఆకట్టుకుంది.

**గంగన్న**

ఈ కథ మానవ సంబంధాలను ప్రధానంగా చూపిస్తున్నప్పటికీ వివిధ కోణాలను కూడా ఆవిష్కరిస్తుంది. తన వాళ్లకోసం జైలుకు వెళ్లిన గంగన్న తనవాళ్లను కలుసుకోవడం కోసం పడే తపన, వాళ్లకోసం పడే ఆవేదన, ఆరాటం హృదయం ద్రవించేలా చిత్రించారు. పన్నెండేళ్ల జైలు శిక్ష పడిన గంగన్న మరో రెండు రోజుల్లో విడుదల కాబోతున్నాడు. ఆ రెండు రోజులు ఎలా గడుస్తాయోనని ఎదురుచూసే గంగన్న మానసిక సంఘర్షణ వర్ణించిన తీరు అమోఘం. తన వాళ్లను తలుచుకుంటూ, గతాన్ని నెమరు వేసుకుంటూ గడుపుతున్న గంగన్న దృక్కోణంలో కొనసాగే ఈ కథలో ప్రతి సన్నివేశం విలువైనదే.

గంగన్న జైలుకు వెళ్లకముందు పోలీసు కానిస్టేబుల్. కష్టపడి, ఇష్టపడి ఆ ఉద్యోగం సంపాదించుకున్నాడు. పోలీసు ఉద్యోగంపై తనకున్న ఇష్టం ఎన్నో రోజులు నిలువలేదు. ఆ ఉద్యోగంలో తనకు అనుకున్నంత స్వేచ్ఛలేదని కొద్దిరోజుల్లోనే తెలుసుకున్నాడు. గంగన్నకు పల్లెటూరి పిల్ల రామితో పెళ్లయింది. ఉద్యోగంలో పడిన కష్టాలు, అధికారుల తిట్లు ఇంటికి వచ్చాక కళకళలాడే రామి ముఖం చూసి అంతా మరచిపోయేవాడు. ఇక్కడ భార్య పట్ల తనకున్న ప్రేమ వ్యక్తమవుతుంది. రామి వేష భాషలు, కట్టు బొట్టు వర్ణించిన విధానం చదువుతూ ఉంటే ఆ అందమైన రామి పాత్ర మన కళ్లముందు కదలాడుతుంది. భార్య రూపవతి శత్రు అన్నారు పెద్దలు. తన భార్య రామి అందమే తనకు శాపంగా మారింది. అమీన్ కామదాహానికి రామి బలయింది. ఈ సంఘటన ఈ కథను మలుపుతిప్పింది. రామి తనపై అమీన్ చేసిన అత్యాచారాన్ని తన భర్త గంగన్నకు చెప్పకపోతే ఈ కథ మరో విధంగా ఉండేది. అవమానంతో కుమిలిపోతున్న రామి గంగన్నకు విషయం చెప్పడం, గంగన్న ఆవేశంతో రెచ్చిపోవడం కథలో ప్రధాన మలుపుకు కారణమయింది. ఆ మలుపే ఈ కథకు బలమయింది.

అత్యాచారానికి గురయిన భార్య రామిని విస్మరించకుండా దగ్గరకు తీసుకొని ప్రేమించడం, లాలించడం, ధైర్యం చెప్పడంతో గంగన్న పాత్ర ఎంతో ఎత్తుకు ఎదిగిపోయింది.

రామి, గంగన్న ఒకరినొకరు వదలి ఉండలేని పరిస్థితి. తప్పని పరిస్థితిలో రామిని పుట్టింటికి పంపించాడు గంగన్న. రామి కూడా వెళ్లలేక వెళ్లలేక వెళ్లడం వారి మధ్య ఉన్న ఆప్యాయత అనురాగాలను వెల్లడి చేసింది.

రామి పుట్టింటికి వెళ్లిన తెల్లవారే గంగన్నను అరెస్టు చేశారు. అమీనుపై హత్యాయత్నం చేశాడని పన్నెండేళ్ల జైలు శిక్ష వేశారు. తనను పుట్టింటికి ఎందుకు పంపించాడో రామికి ఇప్పుడు అర్థం అయింది. గంగన్నకు శిక్ష పడడానికి కారణం తానేనని రామి కుమిలిపోవడం భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. రామి వాళ్ల పుట్టింటి వాళ్లందరు గంగన్నను అసహ్యించుకున్నారు. తప్పుడు పని చేసి జైలుకు వెళ్లాడని, వాడికి తమ ఇంటి పిల్లనిచ్చినందుకు తమ పరువు పోయిందని బాధపడ్డారు. ఇది సందర్భాను సారం మనుషుల మనసులు ఎలా మారిపోతాయో తేటతెల్లం చేస్తుంది. రామి మాత్రమే తన భర్త మనసును, మంచి తనాన్ని అర్థం చేసుకుంది. తనకు తగిన భర్త దొరికాడని అనుకుంది. ఇది నిజమైన ప్రేమకు తార్కాణంగా భావించవచ్చు.

> **పెళ్లి చేసుకోబోయే అమ్మాయి ఎవరని అడిగింది. రేపు చూస్తావుగా అన్నాడు. అప్పటికే ఆమె తనను తాను బాగా కంట్రోల్ చేసుకుంది. ఇంకా ఆమె మనసు తట్టుకోలేకపోయింది. అనుకోకుండా బయటపడింది. మిమ్మల్ని చేసుకొని అదేం సుఖపడుతుంది. నేను కాబట్టి వేగుతున్నాను అంది. ఆ మాటలంటున్నప్పుడు ఆమె గొంతు జీరబోవడం, భర్త గుండెలపై వాలిపోయి, వ్యధ చెందడం, అతడు ఆమెను మరింత దగ్గరగా తీసుకోవడం వారి మధ్యనున్న ప్రేమాను బంధం చక్కగా ప్రకటితమయింది.**

అక్కడ జైల్లో గంగన్న రెండురోజుల్లో విడుదల కాబోతున్నందుకు సంబరపడిపోవడం, ఆ రెండు రోజులు భారంగా గడవడం, తన రామిని కలుసుకోవాలన్నా ఆరాటం, ఇక్కడ రామి గంగన్న పట్ల ఆలోచనలు, కళ్లల్లో కన్నీరు, గుండెల్లో బాధ అంతా ఉత్కంఠభరితంగా సాగిపోవడం ఆకట్టుకునే అంశం.

జైలునుండి బయటకు రాగానే పెరిగిన జుత్తును, గడ్డాన్ని తీయించుకొని శుభ్రంగా వెళ్లి రామిని కలవాలనుకున్నాడు. తనను రామి ఎలా ఆహ్వానిస్తుందో, అత్తమామలు ఎంత బాగా చూసుకుంటారో జరగబోయే సంఘటనలన్నీ గొప్పగా ఊహించుకుంటున్నాడు గంగన్న.

కానీ అక్కడ పరిస్థితి మరోలా ఉంది. అదే ఈ కథలో మరో మలుపు. ఈలోపు రామి మనసు మార్చడానికి అనేక ప్రయత్నాలు జరగడం, మరో పెళ్లి చేసుకొమ్మని అందరు బలవంతం చేయడం, ఒంటరిగా ఉన్న ఆడదాన్ని చూసి అందరు చులకనగా చూడడం ఇలా అనేక కారణాల వలన రామి మరో పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంది. ఇది ఈ కథలో ఎవరూ కాదనలేని సహజత్వం.

జైలునుండి ఆనందంగా బయటికి వచ్చిన గంగన్న ఆతృతగా అత్తారింటికి వెళ్లాడు. అక్కడ పరిస్థితి చూసి విస్తుపోయాడు. అంతా హడావుడి. ఏదో వేడుక జరుగుతున్న వాతావరణం. ఆ వేడుకే పెళ్లి. ఆ పెళ్లి రామికి జరుగబోతోంది. అక్కడికి వచ్చిన గంగన్నను

సమాజం

చాలామంది గుర్తుపట్టలేదు. గుర్తుపట్టినవారు పట్టించుకోలేదు. తాను ఎదురు చూస్తున్న రామి వచ్చింది. ఈ కథలో ఇది ఉద్వేగ భరితమైన సన్నివేశం. రామి ఆ పెళ్లిని నిరాకరించి గంగన్నతో

ఉండిపోతుందని అందరు ఊహిస్తారు. కానీ పాఠకుల ఊహకు అందని కొసమెరుపు ఈ ముగింపు. రామి తనను మరచి పొమ్మని గంగన్నకు చెప్పింది. తాను మరో పెళ్లి చేసుకుంటున్నానని చెప్పింది. మనుషులు ఎప్పుడూ ఒకే రకంగా ఉండరని, ప్రేమలు, అనురాగాలను కాలదన్ని తమ స్వార్థం కోసం, తమ సుఖాల కోసం ఎలా మారిపోతారో ఈ కథ తెలియజెపుతుంది.

## రూల్సు ప్రకారం మా ఇల్లు

ఈ కథలో ఆద్యాంతం సహజత్వం ఉట్టిపడుతుంది. ప్రతి వారికి స్వంత ఇంటి కోరిక ఉంటుంది. దానిని ప్రధాన ఇతివృత్తం చేసుకొని కథ అల్లిన తీరు సహజంగా ఉంది. స్వంత ఇల్లు కావాలనే కోరిక సహజమైనదే కాబట్టి కథలోని సన్నివేశాలు, సంభాషణలు అన్నీ కూడా సహజంగా ఆవిష్కరించారు. తన శైలి ద్వారా పాత్రల స్వభావాన్ని వర్ణించిన తీరు ఆ పాత్రలు పాఠకుల కళ్లముందు కదలాడుతాయి. ప్రతి పాత్ర నిత్య జీవితంలో మనకు పరిచయం ఉన్న పాత్రలాగే కనబడుతుంది.

ఇల్లు కావాలనే కోరిక భార్యది. ఆ కోరిక కష్టాలపాలు చేస్తుందని భర్త అభిప్రాయం. వారిద్దరి మధ్య ఈ చర్చ తమాషాగా సాగుతుంది. ఇంటి స్థలం కోసం ఓ సొసైటీలో మెంబరయ్యారు. ఇల్లు స్వర్గధామంలా ఉంటుందని కళ్లముందు దృశ్యాన్ని చూపించారు. తీరా చూస్తే సొసైటీ ద్వారా దొరికిన స్థలం మురికి కూపం. ఇలాంటివన్నీ నేడు రియల్ ఎస్టేట్ లో జరుగుతున్నవే. ఇల్లు కోసం సొసైటీ వాళ్లతో అంటే నేటి రియల్ ఎస్టేట్ వాళ్లతో పడే వెతలన్నీ సహజసిద్ధంగా అందించారు. రూల్సు పేరుతో అందరిని ముంచిన సొసైటి కథలను సహజంగా అందించారు.

## మా వారి పెళ్లి

కుటుంబ సంబంధాలు, సహజత్వం, కొసమెరుపులతో ఈ కథ పాఠకులను అలరిస్తుంది. భార్య అమాయకత్వం ఈ కథలో ప్రధాన అంశం. అందరిని ఆకట్టుకునే అంశం. రేపు తాను పెళ్లి చేసుకోబోతున్నానని భర్త భార్యతో చెప్పడం విభిన్నం. కొత్తదనం. అదేదో నవ్వులాటకో, సరదా కోసమో చెప్పాడనుకుంటే పొరపాటే. అతను నవ్వుతూ చెప్పినా, భార్య నవ్వుతూ సమాధానమిచ్చినా ఆ చర్చ రాను రాను సీరియస్‌గా మారింది. భార్యకు గతం గుర్తుకు వచ్చింది. పెళ్లయిన కొత్తలో పనిమనుషులు దొరకక, దొరికినా కుదరక ఇబ్బందులు పడవలసి వచ్చేది. ఆ సందర్భంలో భర్తకు కోపం వచ్చి వీళ్ళందరిని పెళ్లి చేసుకుంటే అందరూ ఇంట్లోనే పడుంటారు అనేవాడు. అది గుర్తొచ్చి భార్య కాస్తా ఆందోళన పడింది. అయినా భర్త అలా చేస్తాడంటే నమ్మబుద్ధి కాలేదు. భర్త ఎంత చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా భార్య నమ్మనుగాక నమ్మనంది. నువు నమ్మకపోతే నాకేంటి, నేను మాత్రం పెళ్లి చేసుకుంటు న్నానన్నాడు. ఒక వేళ నిజంగా పెళ్లి చేసుకున్నా మరో వ్యక్తితో చెప్పిస్తారు గానీ ఇలా భర్త నేరుగా ఎక్కడైనా భార్యకు చెబుతాడా అని ఆమె అనుమానం. తాను భార్య దగ్గర ఎప్పుడూ ఏదీ దాచలేదు. కాబట్టి పెళ్లి విషయం కూడా దాచకుండా నేరుగా చెప్పానని అతని వాదన. ఇలా వారిందరి మధ్యన పెళ్లికి సంబంధించిన వాదన ఆసక్తికరంగా అక్షర రూపం దాల్చింది.

రేపు ఉదయం దేవాలయానికి వెళ్లాలి. సాయంత్రం విందు అంతా నీ చేతుల మీదుగా జరగాలని చెప్పి అప్పుడే వచ్చిన స్నేహితునితో బయటకు వెళ్లాడు భర్త. ఇక భార్య ఆలోచనల్లో పడింది. పరి పరి విధాల ఆలోచనలు. ఆమె మానసిక సంఘర్షణను అద్భుతంగా, ఆసక్తికరంగా ఆవిష్కరించారు. అయినా సరే భార్యకు తన భర్త పెళ్లిచేసుకోబోతున్నాడంటే నమ్మబుద్ధి కావడం లేదు. అదీ సగటు




భార్య పాత్ర స్వభావం. తనను ఫూల్‌ని చేయడానికో లేక తాను ఏడిస్తే చూడడానికో ఇలా నాటకమాడుతున్నాడని అనుకుంది.

రాత్రి వంటచేసి పిల్లలకు చదువు చెప్పుకుంటుంటే ఒకావిడ వచ్చింది. రేపు ఈ ఇంట్లో విందట. ఏమేం చేయాలో అడిగి, లిస్టు రాయించడానికొచ్చానని చెప్పింది. ఆమె విస్తుపోయింది. ఆ తర్వాత మరొకడొచ్చాడు. రేపు ఈ ఇంట్లో లైట్స్ పెట్టమన్నారు ఇల్లు చూసిపోవడానికొచ్చానన్నాడు. ఇలా కథలోని పాత్రలకే కాక చదువుతున్న పాఠకులకు కూడా ఆసక్తి కలిగిస్తుంది.

ఇంత జరుగుతున్న భార్య నమ్మడం లేదు. మనసు ఒక్కోసారి కీడు శంకిస్తున్నా ఛ ఛ భర్తమీద ఇలాంటి తప్పుడు ఆలోచనలు వస్తున్నందుకు తనను తానే తిట్టుకుందంటే భార్య పాత్రను ఎంత అమాయకంగా చిత్రించారో అర్థం చేసుకోవచ్చు.

ఇంటికొచ్చిన భర్తను చూసింది. మెరిసిపోతున్నాడు. పెళ్లికళ వచ్చేసిందే అని అనేసింది. మరంతే కాదా అన్నాడు భర్త. వంటల వాళ్ళు, లైట్లవాళ్లు వచ్చారా?

సమాజం

అని అడిగాడు. వచ్చారని చెప్పింది భార్య. నేను పెళ్లి చేసుకోవడం నీకు అంత ఉత్సాహంగా లేనట్టుందని అడిగాడు. తాను ఎంత చెప్పినా ఏడవను గాక ఏడవను అనుకుంది భార్య ఇలా వారిద్దరి మధ్య సంభాషణ చాలా సహజంగా సాదాసీదాగా సాగిపోతుంది.

తాను బజారుకెళ్లి తెచ్చిన వస్తువులు భార్యకు చూపిస్తున్నాడు. పెళ్లికూతురుకని తెచ్చిన చీరలు చూపించడం, ఒంటిరవ్వ ఉంగరం చూపించడం, అవన్నీ చూసి భార్య తననుకున్నంత తేలిక విషయం కాదేమోననుకోవడం నాటకీయతే అనిపించినా బిగి సడలకుండా కథ నడిచింది.

పెళ్లి చేసుకోబోయే అమ్మాయి ఎవరని అడిగింది. రేపు చూస్తావుగా అన్నాడు. అప్పటికే ఆమె తనను తాను బాగా కంట్రోల్ చేసుకుంది. ఇంకా ఆమె మనసు తట్టుకోలేకపోయింది. అనుకోకుండా బయటపడింది. మిమ్మల్ని చేసుకొని అదేం సుఖపడుతుంది. నేను కాబట్టి వేగుతున్నాను అంది. ఆ మాటలంటున్నప్పుడు ఆమె గొంతు జీరబోవడం, భర్త గుండెలపై వాలిపోయి, వ్యధ చెందడం, అతడు ఆమెను మరింత దగ్గరగా తీసుకోవడం వారి మధ్యనున్న ప్రేమానుబంధం చక్కగా ప్రకటితమయింది.

అప్పుడు చెప్పాడు భర్త తాను చేసుకోబోయే అమ్మాయి ఎవరన్నది. రేపు తాను పెళ్లి చేసుకోబోయేది నిన్నేనని చెప్పాడు. భార్యకేమీ అర్థం కాలేదు. అయోమయంలో పడింది. వాళ్లు పెళ్లి చేసుకొని రేపటికి పాతికేళ్లు. అందుకే ఈ ఏర్పాట్లన్నీ చేశాడతను. భర్త ప్రేమకు కరిగిపోయిన తనకు మాటలు రాలేదు.

కథలో అసలు విషయం తెలియకుండా చివరి వరకు నడిపించడం ఏ రచయితకైనా కత్తిమీద సామే. ఓ మంచి కథ చదివిన అనుభూతి పాఠకులకు మిగిలిపోతుంది.

ఇలా నందగిరి ఇందిరాదేవి కథలు నవరసాలతో నిండి అన్ని వర్గాల పాఠకులను అలరిస్తాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

---

కవిత

# ఆదిశక్తి అగ్నితత్వం



నక్కహరికృష్ణ, 9948877662

ఒక కనబడని వేషం వేసుకొని
అక్కడ మనిషి మాట్లాడే మృగం అయ్యాడు
నెత్తుటి నదాల ఒడ్డున
కీచకపర్వం నాయకుడయ్యాడు

వాడు
రంగుల మోహపు ఉచ్చును పన్ని
నువ్వు ఆకాశ సామ్రాజ్యపు దేవతవంటాడు
నిన్ను నిన్నుగా గుర్తించని చోటనే
నిన్నొక ఒంటరి సింహాసనపు
మహారాణిని చేస్తాడు
ఉన్మాద కండ్లె మొలుస్తుంటాడు

వాడి గొంతు ఓ కృత్రిమ స్వరం
చేతులలో కాలకూట వలయం

మాటల్లో మాయ చేస్తూ
శరీరానికి తుప్పు పట్టిస్తాడు
ఒక్కసారిగా
శూన్యంలోకి విసిరేస్తాడు

వాడికి నువ్వంటే
అవసరాలను తీర్చే వినియోగవస్తువు
వినోదం వడ్డించే వింతబొమ్మవు

నీ ప్రపంచంలో
తెల్లటి పూలు చూపి
నల్లటి ముసుగేస్తాడు
ముసుగువెనుక అంగడికి
బానిస చేస్తాడు
చీకటి కూడిన
కలత నిద్రను నింపుతాడు

వాడంటే
ఎడారి ఇసుకతిన్నెల మీద
కనబడని కత్తులను
ఒళ్లంతా దాచుకున్నవాడు
మిఠాయిలలో మత్తివ్వడం
నేర్చినవాడు
నీతి వచనాలు వల్లించుకుంటూ
శాంతికాముకుడిగా
పేరు మార్చుకున్నవాడు

నువ్వంటే కేవలం
ఒక మాంసపు బొమ్మవు కాదని
మనిషి జీవితచక్రానికి
తొలిబిందువు నువ్వని
వాడికెప్పుడు అర్థమవుతుందో

నువ్వంటే
లోకాన్ని చెక్కిన
మొదటి శిల్పివని
వాడికింకెప్పుడు తెలుస్తుందో

నువ్వంటే
ఊపిరి పోసే అమ్మవని
వాన్ని మోసే అవనివని
వాడికిప్పుడు ఎరుకజేయాలి

నువ్వంటే
వాడి నలుపు రాజ్యాన్ని
తెగనరికే ఆదిశక్తివని
వాడికిప్పుడు తెలిసిరావాలి
నీ అగ్నితత్వం వెలికిరావాలి.

కథ

# ఆరడుగుల శ్వాస

కరోనా కాటు నుండి ఎవరూ కాపాడలేరనే
వాస్తవాన్ని చెబుతున్న కథ...



ఎగుమామిడి అయోధ్యారెడ్డి
93999 62117

మొన్న మొదలైందా లక్షణం. ఆ తర్వాత మరిన్ని సంకేతాలు. అప్పట్నుంచి రామాచారి ఆందోళనగా ఉన్నాడు. మనసులో అలజడి దేహానికి పాకుతూ చిన్నగా వొణుకుతుంది. ఆలయంలో కిక్కిరిసిన భక్తులు, సందడి నింపుకున్న పరిసరాలు, చెవుల్లో ధ్వనులు ఢీకొడుతున్న జేగంటల మోత, ఇవేవీ అతని మనసును మరల్చలేకపోతున్నయి.

అది రాష్ట్రంలోనే బాగా పేరున్న దేవాలయం. ఆచారి అందులో ప్రధాన పూజారి. గుడి పంతులుగా అందరికి తెలిసిన.. అందరి మన్ననలు పొందినవాడు. దేవుణ్ణి సర్వస్వంగా నమ్మిన పరమభక్తుడు. తను భగవంతునికీ భక్తులకూ అనుసంధానమైనవాణ్ణని భావించేవాడు. అర్చకునిగా విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్నవాడు.

ఆరోజు అతని పెదాలు మంత్రోచ్చారణ చేస్తూ యథాలాపంగా కదులుతున్నా మనసు అక్కడ లేదు. పరిపరి విధాల పోతుంది. గర్భగుడి ముంగిట నిలబడి భక్తులకు శఠగోపం, తీర్థప్రసాదాలు, అర్చన చేయడం వంటి విధులన్నీ అన్యమనస్కంగానే కానిస్తున్నాడు. సాధారణంగా అతనెప్పుడూ అట్లా ఉండడు. చేస్తున్నది కేవలం ఉద్యోగమని భావించకుండా భక్తిశ్రద్ధలతో అంకితమైపోతాడు. కానీ ఇప్పుడతని మనసూ.. దేహమూ రెండూ సహకరించడం లేదు. ఒక అవ్యక్త ఆందోళన అద్దంలో ప్రతిబింబం మాదిరి అతనిలోకి తొంగిచూస్తున్నది.

మొన్న సాయంత్రం బస్సు దిగి ఇంటికి పోతున్నప్పుడు గ్రహించాడు ఎప్పటికంటే ఎక్కువ అలిసిపోయినట్టు. ఒంట్లో కండరాలు బిగపట్టేసినట్టు నొప్పులు. అడుగు వేస్తుంటే దేహం గాల్లో తేలినట్టుంది. గొంతు తడారి చిన్నగా పొడి దగ్గు. కానీ స్థిరంగా లేదు. ఇల్లు చేరేసరికి తలనొప్పి మొదలైంది. తనకు వైరస్ సోకి వుండొచ్చన్న అనుమానం అతనికి అసలు రాలేదు. కరోనా వల్ల గుడి మూతపడినందున ఎక్కువ రోజులు పనిలేకుండా ఉండటం, తిరిగి ఇప్పుడు పనివొత్తిడి బాగా పెరగటం వల్లే తన దేహం అట్లా సంఘర్షిస్తున్నదని భావించాడు. వేడినీళ్ళతో స్నానంచేసి టీ తాగితే అంతా మామూలై పోతుందనుకున్నాడు.

కానీ అట్లా జరగలేదు. రాత్రి పడుకునే సమయానికి జ్వరం కూడా వొచ్చింది. ఒంట్లో పూర్తిగా సత్తువలేనట్టు అయింది. అన్నం సరిగా తినబుద్ధి కాలేదు. మర్నాడు ఉదయం మామూలుకన్నా ఆలస్యంగా నిద్రలేచిన ఆచారి మంచం దిగేందుకే కష్టపడాల్సొచ్చింది. తడిబట్టను పిండినట్టు అవయవాలు వేటికవే బిగదీసుకున్నయి. తప్పనిసరి గనుక అలసటతోనే ఆలయానికి బయలుదేరాడు. బస్టాప్ వరకు నడిచేసరికే బాగా అలసిపోయాడు.

“ఓ పంతులుగారూ.. ఏందట్లా పరధ్యానంగా చూస్తున్నరు..? ఈరోజు మా మనుమడి పుట్టినరోజు. వాడి పేరుతోని అర్చన చెయ్యాలి” ఎవరో పెద్దగా అన్నారు.

రామాచారి పరధ్యానంలోంచి బయటపడి చూశాడు. ఎదురుగా ఒక పెద్దావిడ. ఆమె వెంట ఐదుగురు సభ్యుల కుటుంబం. పూజారి అంత అన్యమనస్కంగా ఉన్నందుకు వాళ్ళతన్ని అదోలా చూశారు.

యథాలాపంగా పేరు, గోత్రం, నక్షత్రం వగైరాలన్నీ అడిగాడు. పళ్ళెం అందుకొని దేవునివైపు తిరిగి అప్పటివరకు వేలసార్లు పఠించిన మంత్రాలనే మరోసారి చదివి అర్చన పూర్తి చేశాడు. దీవెనలు తీసుకొని వాళ్ళు వెళ్లిపోయారు.

అతనికి బాగా నీరసంగా ఉండి వొళ్ళు వెచ్చబడినట్టు అనిపించింది. ఆచ్ఛాదన లేని అతని అర్ధదేహం మీద చెమటలు ధారలు కడుతున్నయి. దేవుణ్ణి సైతం గుడిలో క్వారంటైన్ చేసిన కరోనా లాక్డౌన్ కొద్దిరోజుల క్రితమే ఎత్తేశారు. ఫలితంగా చిన్నాపెద్దా ఆలయాలన్నీ తెరిచారు.

రామాచారి తలెత్తి చూశాడు. గుడికి జనం పెద్దసంఖ్యలోనే వొస్తున్నారు.

క్యూలైన్లలో భక్తుల కోలాహలం. బిగ్గరగా దైవనామ స్మరణలు. ప్రజలకు తెలియని హెచ్చరికలేవో చేస్తున్నట్టు గంటల చప్పుడు.

అతడు ఆలోచిస్తున్నాడు. లాక్డౌన్ సమస్తాన్ని మార్చేసింది. జన జీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఆచారి ఉపాధి పోగొట్టి కడుపుమీద కొట్టింది. సగటుజీవి అయిన అతని కుటుంబం అష్టకష్టాలు పడ్డది. భుక్తి గడవని బాధ ఒకపక్కా..

భగవంతుని సేవకు దూరమైన రంధి ఇంకోపక్కా అతన్ని అస్థిర పరిచాయి. నిస్సహాయంగా ఇంట్లో ఉండిపోయి.... ఎప్పుడెప్పుడాని ఎదురుచూశాడు. లాక్డౌన్ ఎత్తేశాక బతుకుదెరువును స్వామి సన్నిధిలో మళ్లా వెతుక్కున్నాడు. ఉద్యోగం చెయ్యకుంటే ఇల్లు గడవదని తెలిసికూడా భర్త గుడికి వెళ్ళడం అతని భార్యకు ఇష్టంలేకపోయింది. విపత్తు పూర్తిగా తొలగిపోలేదన్న భయం... గుడికి వెళితే ప్రతినిముషం జనంలో ఉండాల్సి వస్తుందన్న ఆందోళన.

"కరోనా ఇంకా తీవ్రంగానే ఉన్నది. ఈ టైములో గుడికి పోవుడెందుకయ్యా? అక్కడ రోజూ వేలమంది భక్తులొస్తరు. ఎవరెట్ల ఉంటరో తెల్వదు" అభ్యంతరం చెప్పింది.

"అదేం మాట..! వెళ్లకుంటే కలుస్తదా? ఇల్లెట్ల గడుస్తది. ఇప్పటికే బాకీలు ఎక్కువ చేసినం. అవన్నీ ఎప్పటికి తీరుస్తామో తెలియదు. పనికి పోకుండా ఇంకెంతకాలం ఉండగల్గుతం? అయినా ఎవరికిలేని భయం మనకెందుకు? ఏదైనా నొసట్లో రాసుంటే తప్పదుగద."

"మీరు చేసేది ఇంకో ఉద్యోగమైతే నాక్కొంచెం నిమ్మలంగా ఉండేది. కానీ గుడి పూజారంటే దూరదూరంగా మసులుకోలేరు. భక్తుల నడుమ ఉండాలి. ఎందరినో ముట్టుకుంటరు. ఎవరెవరో వొస్తుంటరు. అదే నా భయం"

"ఫరవాలేదులేవే..! నా జాగ్రత్తల నేనుంటలే. బయట అందరు పనులకు పోతలేరా? అయినా దేవుణ్ణి నమ్ముకున్నోణ్ణి. ఆ దైవం తోడుండగా నాకేం కాదు, భయపడకు"

భర్త చెప్పిన సమాధానం ఆమెకు నచ్చలేదు. "మీ చాదస్తం కాకుంటే దేవుడేం చేస్తాడండీ? కరోనా అంటుకునేది మనుషులకు. కనిపించని దేవునికో.. విగ్రహాలకో కాదు" మనసులో వున్న ఆరాటంలో విసుగ్గా అన్నది.

ఆమె మాటలకు ఆచారి అభిమానం దెబ్బతింది. భార్య మీద అంతెత్తున లేచాడు. "నోర్ముయ్.. అజ్ఞానివి..! నీకేం తెలుసు దేవుని గురించి. నోటికి ఎంతొస్తే అంత వాగకు. భగవంతున్ని ధిక్కరించేటంత దానివా? ఆ స్వామి తనను నమ్ముకున్నోళ్లకు ఎప్పుడూ అండగా ఉంటాడు" మందలించాడు.

అది పూర్తిగా చాదస్తమనిపించి ఆమెకు చిరాకు కలిగింది. అతడట్లా జనంలోకి పోవడం ఆమెకు ఏమాత్రం ఇష్టంలేదు. కానీ ఎదురుచెప్పలేక పోయింది. ఇంకా ఏమైనా అంటే అతనికి మరింత తిక్కలేస్తుంది. కోపానికి జంకి మౌనం వహించింది.

అట్లా అవసరమైన జాగ్రత్తలన్నీ పాటిస్తూనే తిరిగి పూజారి అవతారమెత్తాడు. ఓపక్క కూటి అవసరం... ఇంకోపక్క దేవుని పుణ్యకార్యం. ఇవి తలచుకొని విధుల్లో చేరిపోయాడు.

చిక్కులు పడుతున్న ఆలోచనల్ని బలవంతంగా తెంపుకున్నాడు ఆచారి. అతనిలో అసహనం పెరుగుతున్నది. బయట ఎండకన్నా ఎక్కువగా లోపల మనుషుల ఉబ్బరానికి చెమటతో తడుస్తున్నాడు. ఆలయం ఆవరణలో చెట్లకొమ్మలు చిరుగాలితో రహస్యాలు చెప్పుకుంటూ చిన్నగా కదులుతున్నయి. ఆ రహస్యాలు తనను గురించేని తలపోశాడు. కానీ పట్టించుకోలేదు. వాటి భాష తనెట్లా గ్రహించగలడు..? ఇప్పుడున్న స్థితిలో బయటి ప్రకృతే కాదు, అతని హృదయధ్వని కూడా అంతరాత్మకు చేరడం లేదు.

అతడు తలతిప్పి గర్భగుడిలోకి చూశాడు. లోపల స్వామి తన దేవితో

**"ఆచారీ.. అదే పనిగా, అనవసరంగా ఆలోచించకు. నువు కేవలం నిమిత్తమాత్రుడివి. మరో యోచన లేకుండా నువు చేసేది చెయ్యి" దైవసంకల్పం చెవుల్లో ప్రతిధ్వనించినట్టయింది. అది అతనిలో కల్లోలాన్ని రేపింది. దాన్ని శాసనంగా భావించాడు. సవినయంగా తలొంచుకున్నాడు. స్వామి ఆదేశించాడు. దైవాజ్ఞకు కాదని ఎట్లా చెప్పగలం..?**

గుసగుసలాడుతున్నాడు. అది కూడా తన గురించేనని భావించుకున్నాడు.

"అసలు దేవుడున్నాడా?" ఇలాంటి ప్రశ్న ఆచారి కలలో కూడా వేసుకోడు. అసలా ఆలోచన రావడం కూడా పాపమని అంతరాత్మని నొక్కేస్తాడు.

"గుడిని మూసి దేవుణ్ణి క్వారంటైన్ చేశారు. మరి కరోనా దేవుణ్ణి గెలిచినట్లా? లేక మహమ్మారి కూడా దైవసృష్టేనని నమ్మి విజయాన్ని దేవుడి ఖాతాలో వేయాలా?" ఈ రకమైన అంతర్మథనానికి అతను అస్సలు తావివ్వడు.

"మనిషి గుడి తలుపులు తెరిస్తేనే కదా ఇప్పుడు దేవునికి స్వేచ్ఛ లభించింది. మనిషి కాదనుకుంటే ఇంకా లోపలే బందీగా వుండేవాడు. మరి ఎవరు ఎవరి చెప్పుచేతల్లో వున్నట్టు?" ఆచారి దృష్టిలో ఈ ఆలోచనలన్నీ పరమపాపాలు.

'రామాచారీ..! నీ మనసు పక్కదారులు పట్టనీయకు. దేవుడినైన నా ఉనికిని శంకించడమంటే అది నన్ను ధిక్కరించినట్టే' భగవంతుడు ఆగ్రహంతో తన మనస్సాక్షిని ఆదేశించినట్టు భావించుకుంటాడు. దైవాజ్ఞని ఎల్లవేళలా శిరసావహిస్తాడు.

కరోనా విపత్తు పోవాలంటే మనిషి దేవుణ్ణి ప్రసన్నం చేసుకోవాలని చెపుతాడు. అందుకు స్వామి కొలువుండే ఆలయాలెప్పుడూ తెరిచే వుంచాలని కోరుతాడు. దేవుణ్ణి తను సృష్టించిన

లోకాన్నీ, ప్రాణికోటినీ చూడకుండా చేయాలనుకోవడం మనిషి అజ్ఞానమేనని అనుకుంటాడు.

అందరి దృష్టిలో కరోనా విపత్తు కావొచ్చు. కానీ తన దృష్టిలో అది దేవుని ఆయుధం. లోకంలో పాపవినాశనానికి స్వామి ఎత్తిన మరో అవతారమే కరోనా. మానవాళికి ఆయన చేస్తున్న హెచ్చరికే వైరస్. భుక్తి గడవడం కోసం తను స్వామి సన్నిధిలో పనిచేస్తున్నాడు. కనుక తన బాగోగులు చూసుకునే బాధ్యత ఎప్పటికీ ఆయనదే.

క్యూలైన్లలో భక్తులు నెమ్మదిగా కదులుతున్నారు.

ఒక్కొక్కరే సర్వాంతర్యామిని దర్శించుకుంటున్నారు. శఠగోపం పెట్టించుకొని, తీర్థ ప్రసాదాలు తీసుకొని కదిలిపోతున్నారు.

తనకొచ్చిన లక్షణాలు కోవిడ్ సంకేతాలన్న అనుమానం ఏమూలలో కదిలినా నమ్మడానికి ధైర్యం చాలక కాదులెమ్మని సర్దిచెప్పుకున్నాడు. అతడా లక్షణాలను కరోనాతో ముడిపెట్టు కునేందుకు సిద్ధంగా లేడు. విధిరాతను తప్పించుకోలేమనే వేదాంతాన్ని కూడా గుర్తు తెచ్చుకుంటున్నాడు. తనకేదైనా అయితే చేసేది దైవకార్యం గనుక స్వామియే కాపాడతాడన్న భరోసాను గుండెకు ఎక్కించుకుంటున్నాడు.

చుట్టూ సందడి పెరుగుతున్నది. ఆచారిలో నిస్సత్తువ కమ్మేస్తున్నది. దేహం కాలుతున్నట్టు గ్రహించాడు. చిన్నగా కంపిస్తున్నాడు. ఉండి ఉండి కణతలు పగిలిపోయే తలనొప్పి.

మనసు ముక్కలవుతున్నది. పడికట్టుగా స్తోత్రపఠనం చేస్తూనే చూపును దూరంగా విస్తరించాడు. అప్పటిదాకా రావిచెట్లను పరామర్శిస్తూ ఆకుల్ని కదిలించిన చిరుగాలి ఇప్పుడు ఆ చెట్లవెనుక తన ఉనికినే కోల్పోయి అదృశ్యమైంది.

అతడు కొన్నిక్షణాలు కళ్లు మూసుకొని ఉండిపోయాడు. క్యూలో వున్న భక్తుల్లో కొందరు మాస్కులు ధరించారు. కొందరు ఏమీ లేకుండా మామూలుగా ఉన్నారు. బయట అందరూ చెప్పుకునే సామాజిక దూరం అనేదానికి అక్కడ తావేలేదు. ఒకరినొకరు అంటుకొని కదులుతున్నారు. ముఖంలో ముఖంపెట్టి ముచ్చట్లు పెడుతూ మధ్య మధ్య గట్టిగా దైవనామ స్మరణ చేస్తున్నారు. కరోనా వృద్ధులకు శత్రువని శాస్త్రవేత్తలూ.. వైద్యనిపుణులూ చెపుతారు. వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని చెపుతారు. కానీ గుడికొచ్చిన భక్తుల్లో వాళ్ళే ఎక్కువున్నారు. వీళ్ళెవరికీ మహమ్మారి గురించిన ఆందోళన లేదా? లేక తన మాదిరే దేవుడున్నాడనే ధీమానా? దేవునితోడు కోసమే గుడికొచ్చారా?

"ఆచారీ.. అదే పనిగా, అనవసరంగా ఆలోచించకు. నువు కేవలం నిమిత్త మాత్రుడివి. మరో యోచన లేకుండా నువు చేసేది చెయ్యి" దైవసంకల్పం చెవుల్లో ప్రతిధ్వనించి నట్టయింది. అది అతనిలో కల్లోలాన్ని రేపింది. దాన్ని శాసనంగా భావించాడు. సవినయంగా తలొంచు కున్నాడు. స్వామి ఆదేశించాడు. దైవాజ్ఞకు కాదని ఎట్లా చెప్పగలం..?

అయినా తనకేమవుతుంది..? మహమ్మారి తన దరికి రాదు. అంతా ఆయన చూసుకుంటాడు.

* * *

**చిక్కులు పడుతున్న ఆలోచనల్ని బలవంతంగా తెంపుకున్నాడు ఆచారి. అతనిలో అసహనం పెరుగుతున్నది. బయట ఎండకన్నా ఎక్కువగా లోపల మనుషుల ఉబ్బరానికి చెమటతో తడుస్తున్నాడు. ఆలయం ఆవరణలో చెట్లకొమ్మలు చిరుగాలితో రహస్యాలు చెప్పుకుంటూ చిన్నగా కదుల్తున్నయి. ఆ రహస్యాలు తనను గురించేనని తలపోశాడు. కానీ పట్టించుకోలేదు. వాటి భాష తనెట్లా గ్రహించగలడు..?**

రామాచారి గుడి నుంచి ఇంటికొస్తూనే ఒంటిమీది పూజారి బట్టల్ని బయటే విప్పేస్తాడు. భార్య టవలూ, లుంగీ, బనియన్ బయటనే పెడుతుంది. అటునుంచి అటే బాత్రూముకు పోయి శుభ్రంగా స్నానంచేసి లోపలి కొస్తాడు. అతడు ఫ్రెష్ అయ్యేంతవరకు భార్య, పిల్లలు దగ్గరికి రారు. కుటుంబంతో కలిసి కూర్చొని భోంచేయడానికి కూడా ఈమధ్య కాలంలో రామాచారి సందేహిస్తున్నడు. భార్య ఫరవాలేదని చెపుతున్నా వినడు. దూరదూరంగానే మసులుకుంటాడు. తనగదిలో ఒక్కడే పడుకుంటాడు.

ఆ రాత్రి అతనికి హై టెంపరేచర్ వొచ్చింది. దానికితోడు చలి. ఒకదశలో రెండు దుప్పట్లు కప్పుకున్నా ఆగలేదు. మెడికల్ షాపులో

అడిగి టాబ్లెట్లు తెచ్చి వేసుకుని పడుకున్నాడు. ఆ స్థితిలోనూ తనకు వైరస్ సోకి వుండొచ్చని ఖచ్చితంగా నమ్మలేదు.

దేవుణ్ణి తలుచుకుని ధీమాతో ఉన్నాడు.

వారం రోజులుగా తనలో వస్తున్న లక్షణాలు, తన మానసిక సంఘర్షణ గురించి భార్యకు చెప్పలేదు. ఆమెకు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. కానీ ఆ మర్నాడు ఊపిరి తీసుకోవడంలో అతడు పడే ఇబ్బందిని గ్రహించిన ఆమెకు భయంతో కాలు చెయ్యి ఆడలేదు. "పదండి దవఖానకు పోదాం" ఏడుపు ముంచుకొస్తుంటే తొందరపెట్టింది.

ఎప్పుడూ గుడికిపోవడమే తెలిసిన రామాచారికి ఆస్పత్రికి పోవాలంటే కొత్తగా అనిపించింది. అప్పటికీ వేచిచూద్దామనే

అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. "ఈమాత్రం దానికి ఆస్పత్రికి ఎందుకే? ఇంకో రెండు మందు బిళ్ళలు వేసుకొని, వేడినీళ్ల కషాయం తాగుతూ నాలుగుసార్లు ఆవిరి పట్టుకుంటే అదే తగ్గుతుంది. అయితే కొంచెం వొళ్ళు నొప్పులే ఎక్కువున్నయి. నిలబడే ఓపిక కూడా లేదు.

ఇంత నీరసంతో ఆలయానికి పోలేను.

అదొక్కటే బాధగా ఉన్నది. అంతేగాని నాకేమీ కాదు, నువ్వు పరేషాన్ గావొద్దు'' అన్నాడు.

"అది కరోనా అయితే కష్టంగదనయ్యా''

"కాదులే..! నువ్వాత్రపడకు. మహాఅయితే వైరల్ జ్వరం కావొచ్చు. బిళ్లలు వేసుకుంటే తగ్గిపోద్ది''

"ఎప్పుడూ మీ మొండిపట్టేగాని ఇంకొకరి మాట వినరు. దయుంచి మీ చాదస్తం విడిచిపెట్టి నామాట వినండి. ఇది వైరల్ జ్వరం కాదనుకుంటా. ఎండకాలంలో వైరల్ జ్వరాలు రావని నేను విన్నాను.''

"ఇంట్లో కూర్చొని అన్నీ నీకే తెలిసినట్టు మాట్లాడకు. ఇది మామూలు జ్వరమే. ఇదిగో.. ఇప్పుడే నా దైవానికి కూడా మొక్కుకున్న. ఆ పరమాత్మ నాకెప్పుడూ తోడుంటాడు. నాకేమీ కానివ్వడు, నువ్వు అనవసరంగా రంధిపడకు.''

భార్యను దబాయించాడే గాని అతని మనోగతం వేరు. ఆస్పత్రికి పోవడమంటే మాటలా! అక్కడ పరీక్షలకనీ, మందులకనీ బోలెడన్ని ఖర్చులు. లాక్డౌన్ దెబ్బకు ఇప్పటికే కిందా మీదా పడి బతుకుతున్నరు. అందినకాడల్లా అప్పులైనయి. అవి తీర్చలేక తెలిసినోళ్లకు మొఖం చూపించలేకపోతున్నరు. ఇప్పుడు మళ్లీ పైసలంటే ఎక్కడ పుడతయి? అందుకే భారాన్ని దేవునిపై వేసి ఆయన్నే నమ్ముకున్నాడు.

ఆమెకు అంత దుఃఖంలోనూ మొగుడి మీద చిరాకెత్తింది.

"అవుతల కరోనాతో జనం కుప్పలుకుప్పలుగ చచ్చిపోతుంటే మీరేమో మామూలు జ్వరం, మందు బిళ్ళలతో తగ్గిపోతదంటరు. దేవుడేమన్నా దిగొచ్చి వైద్యం చేస్తాడా? మీ ప్రాణాలు కాపాడుతాడా?''

వినకూడని మాటలు విన్నట్టు రామాచారికి కోపం పొంగివచ్చింది. ఆమెను కొట్టినంత పనిచేస్తూ పక్కకి నెట్టేశాడు.

"మాట్లాడింది చాలు.. నోర్మూయ్యి..! నాకేమీ కాదు. నీ పనిచూసుకో పో ''
అన్నాడు గట్టిగా.

"మీకు దండం పెడతాను. మూఢ నమ్మకాలు విడిచిపెట్టి నామాట వినండి. దయుంచి దవఖానకు పోదాం పదండి'' ఆమె పట్టువీడకుండా అదేపనిగా బ్రతిమాలింది.

భార్య దీనత్వం చూసి ఆచారి కొంచెం మెత్తబడ్డాడు. ఇంకా మొండిగా వాదించకుండా

"సరేలే.. నీమాటనే కానియ్యి. ఎక్కడికి పోదాం?'' అన్నాడు.

* * *

ఆచారికీ.. అతని భార్యకీ కోవిడ్ టెస్టు జరిగింది. పీపీఈ కిట్ ధరించిన నర్స్ ఒకరు వాళ్లిద్దరి శాంపిల్సు తీసుకున్నాడు. రెండు రోజుల తర్వాత రిపోర్టు. ఫలితం అతడు లోలోపల భయపడిందే. అతనికి పాజిటివ్. ఆమెకి నెగెటివ్.

ఆచారి షాక్ తిన్నాడు. మరోమాట లేకుండా ఐసొలేషన్ లోకి వెళ్ళిపోయాడు. ఇంట్లో గదికే పరిమితమయ్యాడు. అవసరమైనవన్నీ భార్య జాగ్రత్తగా చూస్తున్నది.

కరోనా రామాచారి మనోస్థితిని



కథ

కల్లోలం చేసింది. భయంతో తన యాజమానిని తలుచుకున్నాడు. సర్వాంతర్యామి అయిన దేవుడే తన యజమాని అని అతడెప్పుడూ నమ్ముతాడు. తన దీనస్థితిని ఒకసారి గుర్తుచేస్తూ మనసులోనే ప్రణమిల్లి శరణు కోరాడు.

"నాన్నకు కరోనా వొచ్చిందా? నాన్న చచ్చిపోతాడా అమ్మా?" విషయం తెలిసిన చిన్నకొడుకు భయంతో అడిగిన ప్రశ్నకు ఆచారి భార్య సమాధానం చెప్పలేదు. ఈ పరిస్థితిలో తను ధైర్యంగా ఉండాలను కుంది. భర్తను చూసుకోవాలనుకుంది.

"నాన్న చచ్చిపోతడా అమ్మా" అని బాబు మళ్ళీ రెట్టించి అడగటంతో "లేదు నాన్నా.. రెండురోజుల్లో తగ్గిపోతుంది" అనిచెప్పి లోపలికిపోయింది.

★ ★ ★

కానీ ఇంకొక్క రోజులోనే పరిస్థితి విషమ మలుపు తిరిగింది. ఆచారి ఆరోగ్యం ఇంకా దిగజారింది. విపరీతమైన అలసట అతన్ని పూర్తిగా కబలించింది. మంచంలోంచి లేవలేని స్థితి. నిలకడగా ఉన్న జ్వరం. బరువైన మంచు దిమ్మెలు పెట్టినట్టు ఛాతి నలిగిపోతూ శ్వాస తీసుకోవడానికి ప్రయాసపడుతున్నాడు.

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆచారి భార్య అతన్ని ఆస్పత్రికి తీసుకుపోయింది. ప్రయివేటు ఆస్పత్రికి పోయేంత స్తోమత తమకు లేదనే విషయాన్ని ఆమె మరిచిపోలేదు. అప్పటికే పరీక్షలనీ, ఎక్సరేలనీ, స్కానింగులనీ చేతిలో పైసా లేకుండా కరిగింది.

ఆస్పత్రి వద్ద పరిస్థితి భయం గొలిపేలా ఉన్నది. కోవిడ్ నోడల్ సెంటరైన ఆ దవఖాన ముందు సరుకు దింపడాని కొచ్చిన లారీల మాదిరి రోగులను తెచ్చిన అంబులెన్సులు వరుసగా ఆగివున్నాయి.

అది చూసి ఆమె హతాశురాలైంది. ఆచారిలో ఉన్న సత్తువ కూడా పోయింది. అక్కడ పరిస్థితి ఎవరూ ఎవరినీ పట్టించు కునేలా లేదు. భార్య ఆసరాతో లోపలివరకూ రాగలిగిన అతడు మరింక ఓపికలేక కూలబడ్డాడు. చాలాసేపటికి ఎవరో దయదలిచి తెచ్చిన వీల్ ఛెయిర్లో కూర్చోబెడితే కళ్లు మూసుకొని అచేతనంగా ఉండిపోయాడు.

అట్లా ఎంత టైము గడిచిందో తెలియదు. అరగంట.. గంట.. రెండుగంటలు. భారంగా గడిచిపోతుంది. ఆచారికి సగం కలలో, సగం మెలుకువలో ఉన్నట్టుగా ఉన్నది. చుట్టూ మనుషుల హడావిడి. సెల్ఫోన్లలో మాటలు. ఏడుపు గొంతుతో చిన్నగా ముచ్చట్లు. అంతలోనే పెద్దగా ఏడుపులు.

ఆచారి భార్య ఎవరెవరికో మొరపెట్టుకుంది. ఎంత బ్రతిమిలాడినా ఎవరూ పట్టించుకోలేదు. ఆచారిని లోపలికి రానివ్వలేదు. అతని పరిస్థితి దిగజారుతున్నదని చెప్పినా కనికరించ లేదు.

> **అతడు** కొన్నిక్షణాలు కళ్లు మూసుకొని ఉండిపోయాడు. క్యూలో వున్న భక్తుల్లో కొందరు మాస్కులు ధరించారు. కొందరు ఏమీ లేకుండా మామూలుగా ఉన్నారు. బయట అందరూ చెప్పుకునే సామాజిక దూరం అనేదానికి అక్కడ తావేలేదు. ఒకరినొకరు అంటుకొని కదులుతున్నారు. ముఖంలో ముఖంపెట్టి ముచ్చట్లు పెడుతూ మధ్య మధ్య గట్టిగా దైవనామ స్మరణ చేస్తున్నారు. కరోనా వృద్ధులకు శత్రువని శాస్త్రవేత్తలూ.. వైద్యనిపుణులూ చెపుతారు.

"ఉండవమ్మా..! ఇవన్నీ ఇక్కడ మామూలే. మీఆయన కంటే సీరియస్ కేసులు వందలున్నయి. లోపల ఒక్క బెడ్డు కూడా ఖాళీలేదు. పోపో.. బయట నిలబడి వెయిట్ చెయ్యి" వార్డుబాయ్స్ సహా నర్సులు, వైద్య సిబ్బంది ఎవరికి చెప్పినా నిర్దయతో కసురుకున్నారు. ఊపిరి తీసుకునేందుకు అవస్థలు పడుతూ క్యూజువాలిటీ వద్దే ఉండి పోయాడు ఆచారి.

దాదాపు మూడు గంటల తర్వాత కనికరించి ఆచారిని లోపలికి తీసుకెళ్లారు. అతన్ని ఎమర్జెన్సీ వార్డుకి తెచ్చారు కానీ లోపల బెడ్స్ లేవు. అట్లానే అతనికి అత్యవసరంగా ఆక్సిజన్ కనెక్టు చేయించి చికిత్స మొదలుపెట్టారు. ఇంకో రెండు గంటలు పోయాక చివరికి బెడ్ దొరికింది.

ఐసొలేషన్ వార్డులో వరుసగా బెడ్స్ వేసివున్నాయి. వాటిలో ఒకటి అతనికి అలాట్ చేశారు. అందరూ కోవిడ్ రోగులే. ఒకరికొకరు ఆరడుగుల దూరంలో మంచాల మీద శ్వాస కోసం పరితపిస్తున్నారు. వారిలో రోగం విషమించినవారే ఎక్కువమంది. డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది ఊపిరి సలుపకుండా పనిచేస్తున్నారు. కుప్పలు తెప్పలుగా వస్తూనేవున్న బాధితులను ఎంతమందిని వారు చూడగలరు?

డాక్టర్ల కొరత, నర్సుల కొరత. బెడ్స్ లేవు.. మందులు లేవు. ఆక్సిజన్ లేదు.. చివరికి అటెండర్లు కూడా కొరతే.

వార్డులో రోగులను చూస్తున్న ఇంచార్జ్ డాక్టరు మనసు వికలమై ఉన్నది. రోగుల ఆరాటం.. వాళ్ళ దీనస్థితి.

జీవితానికి రెండో ఛాన్సు కోరు కుంటూ పడుతున్న తపన. మరోపక్క మహమ్మారిని ఎదురొడ్డే వీర సైనికుల్లా వైద్యులు, నర్సులు, సిబ్బంది చేస్తున్న పోరాటం. వైద్యశాస్త్రానికి కొరుకుడు పడని వైరస్ భూతం అమాయకుల ప్రాణాలను హరిస్తుంటే అంతకన్నా ఏమీ చేయలేక పోతున్న నిస్పృహ.

స్థానికుడైన డాక్టరుకు ఆలయ పూజారిగా రామాచారి తెలుసు. అతన్ని పరీక్షిస్తూ "పంతులుగారూ.. మీకు కరోనా. మీ లంగ్స్ ఇన్ఫెక్ట్ అయినయి. అయినా ఫరవాలేదు. తగ్గిపోతుంది. ధైర్యంగా ఉండండి" భరోసా మాటలు పలికాడు.

కళ్లు మిటకరించే మరబొమ్మలా ఆచారి కనురెప్పలు మూసి తెరిచాడు. డాక్టరు మీద నమ్మకం కంటే అతనికి దేవునిమీద గురి ఎక్కువ. దైవకటాక్షం తనకు దుర్భేధ్యమైన రక్షణ కవచమని

నమ్ముతాడు.

ఆచారి భార్య గుండెజబ్బు మనిషి. ఆమెను లోపలికి రానివ్వలేదు. రాబోతుంటే అడ్డుకున్నారు. భార్య ముఖంలో చిక్కటి ఆందోళన ప్రతిఫలించింది. అదిచూసి ఆస్థితిలోనూ ఆచారి గుండె ద్రవించింది. ఆమె కళ్ళలో ప్రేమను గమనించిన అతనికి భార్య దేవతలా అనిపించింది. దూరంగా అద్దాల వెనుక నుంచి చూస్తుందామె. చెమర్చిన అతని కళ్ళకి అస్పష్టంగా కనిపించింది.

నర్సు బయటికొచ్చినప్పుడు ఆమెను అడిగింది: "ఆయన కొలుకునేందుకు ఎన్నిరోజులు పడుతుందమ్మా? నేనేం చేయాలి?"

"మా ప్రయత్నాలన్నీ చేస్తున్నాం. ఆయన బాగవుతారు. మీరు టెన్షన్ పడకండి" హడావిడిగా చెప్పి నర్సు ముందుకుపోయింది.

ఆమె ఏడుస్తున్నది. ఆచారి మనసు వికలమైంది. తనామెను మళ్ళీ చూడగలడా? భార్య ఎర్రచీరలో ఉంది. అది అతనికి ఎంతో ఇష్టమైన చీర. అతని కళ్ళ మసకలు కమ్మి కరువుతీరా చూడలేకపోయాడు.

నర్సు దగ్గరున్న తన ఫోన్ ఇప్పించుకొని భార్యతో మాట్లాడాడు. అబద్ధం చెప్పి ఆమెను నమ్మించే ప్రయత్నం చేశాడు. తనకు కరోనా ప్రారంభదశలో ఉన్నదని తెలిపాడు. భగవంతుని దయతో నాలుగు రోజుల్లో ఇంటికి తిరిగొస్తానన్నాడు.

"పూజారిగారూ.. మీరు త్వరగా కోలుకుంటారు" నర్సు కూడా అబద్ధమేచెప్పి అతనికి ఊరట కలిగించబోయింది.

తన మంచానికి ఇరువైపులా.. ఎదురుగా మంచాలపైన అంతా మహమ్మారి బాధితులే. అక్కడివారిలో ఎక్కువమంది బతకడానికంటే చావడానికి లైసెన్సులు పొందినవాళ్లే. ఆచారికి దమ్ము తీస్తుంటే గుండెల మీద గుట్టల్ని మోస్తున్నట్టు ఉన్నది. అతని ఆక్సిజన్ లెవెల్స్ మాటిమాటికి చెక్ చేస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది పడుతున్న శ్రమనే ఎక్కువగా కనిపిస్తుంది తప్ప రోగం అదుపులోకి వస్తున్న పరిస్థితి లేదని అతనికి అనిపించింది.

వైద్యశాస్త్రానికి అంతుపట్టని రోగానికి వాళ్లయినా ఏం చేయగలరు?

మనసులో తన దైవాన్ని ప్రార్థించుకున్నాడు. తనను గట్టెక్కించే భారం ఆయనదే అని తలచాడు. బయట ప్రకృతి నిండా వున్న గాలిని పీల్చుకొని ఎప్పుడు గుండెలు నింపుకుంటాడో. భార్యాపిల్లలకు చేరువై వాళ్ళను కంటినిండా ఎప్పటికి చూస్తాడో. వీటికిమించి గుడిలో జేగంటల మోతల మధ్య మంత్ర పఠనం చేస్తూ స్వామికి సేవలు ఎప్పుడు చేసుకుంటాడో.

ఈ వైద్యులు, నర్సులు, ఆస్పత్రి, ఆరడుగుల శ్వాస... అన్నింటిని దాటుకొని తప్పక బయటికి వెళతాననే ఆశించాడు. తన జీవితానికి రెండో అవకాశం ఉంటుందనే అనుకున్నాడు.

తన మంచానికి దగ్గరలో చిన్నగా ఏడుపు వినిపిస్తే ఆచారి కష్టంగా అటు చూశాడు. నడివయసు మనిషి ఒకతను పీపీఈ కిట్ ధరించి వున్నాడు. కుడివైపున ఉన్న మంచం ముందు నిలబడి కొంచెం పెద్దగానే ఏడుస్తున్నాడు. బెడ్ మీద కోవిడ్ సోకిన రోగి అచేతనంగా పడివున్నాడు. పాపం.. యువకుడే. ఏడుస్తున్న వ్యక్తి కొడుకై వుంటాడు. వృద్ధులనే కాదు, ఎవరినీ వదలడం లేదు కరోనా.

"పాపం.. ఒక్కడే కొడుకట. ఇద్దరు పిల్లలుకూడా. అతని పరిస్థితి బాగాలేదు" నర్సు చెప్పింది.

ఆ రాత్రి... టైమెంతో తెలియదు.. మగతగా ఆచారికి చిన్నగా మాటలు వినిపించాయి. జాగ్రత్తగా విన్నాడు.

నర్సు ఎవరితోనో చెపుతుంది. "ఆ అబ్బాయికి పాపం ఆస్తమా కూడ వుంది. ఎంతో యాతనపడి ఇప్పుడే చనిపోయాడు."

నా పక్క బెడ్ ఖాళీ అయింది. నాకు ఆరడుగుల దూరంలో ప్రాణవాయువు అందుకోలేక ఒక ప్రాణం పోయింది. మరో అరగంట వ్యవధిలో దానిపైకి మరో కోవిడ్ బాధితుడు చేరాడు.

సిబ్బంది చనిపోయిన ఆ యువకుని శవాన్ని ప్లాస్టిక్ పేపరులో చుట్టారు. బాడీ బ్యాగులో పెట్టేసి దాదాపు వస్తువు మాదిరి ప్యాకింగ్ చేసి పంపించారు. శవాన్ని మోసుకెళుతున్న ట్రాలీ చక్రాల మోత... యముడి మహిషపు గంటల చప్పుడులా. ఆ ధ్వని ఎంత మరిచిపోవాలన్నా సాధ్యం కాదనిపించింది.

రామాచారికి మైకం కమ్మినట్టు అయింది. అతడు హెలుసినేషన్ లోకి జారిపోయాడు.

'ఇంతకూ తాను బతుకుతాడా? లేక ఆ యువకునిలాగే ఊపిరందక పోతాడా?'

దిగులూ భయమూ పోటీ పడ్డాయి. 'అసలు బతికేవున్నానా?' ప్రశ్నించుకున్నాడు. గడచిన జీవితంలోని ఎన్నెన్నో ఘటనలు కళ్ళముందు కదిలినయి. తను అప్పటివరకు చేసిన పాపుణ్యాలను, మంచిచెడ్డలను తలుచుకున్నాడు. తను తిరిగిన ప్రదేశాలు, కలుసుకున్న మనుషులు, బంధువులు, మిత్రులు.. వాళ్ళతో మాటలు. చెప్పిన అబద్ధాలు.. నిజాలు.

**తన మంచానికి ఇరువైపులా.. ఎదురుగా మంచాలపైన అంతా మహమ్మారి బాధితులే. అక్కడివారిలో ఎక్కువమంది బతకడానికంటే చావడానికి లైసెన్సులు పొందినవాళ్లే. ఆచారికి దమ్ము తీస్తుంటే గుండెల మీద గుట్టల్ని మోస్తున్నట్టు ఉన్నది. అతని ఆక్సిజన్ లెవెల్స్ మాటిమాటికి చెక్ చేస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది పడుతున్న శ్రమనే ఎక్కువగా కనిపిస్తుంది తప్ప రోగం అదుపులోకి వస్తున్న పరిస్థితి లేదని అతనికి అనిపించింది.**

అవునూ...తనెప్పుడైనా అసత్యాలు పలికాడా? చావడానికి ముందు అందరికీ ఇట్లా అన్నీ గుర్తుకొస్తాయా..?

సాయంత్రానికి ఆచారి పరిస్థితి విషమించింది. శ్వాస తీసుకోవడానికి సర్వశక్తులతో శ్రమపడాల్సి వస్తున్నది.ఎంత పీల్చుకున్నా ఊపిరితిత్తుల్లో పావుభాగమైనా ప్రాణవాయువు చేరడంలేదు. గుండెను పిడికిట్లో ఒడిసిపట్టి నలుపుతున్నట్టు బలహీనంగా కొట్టుకుంటుంది. దుష్టశిక్షణ కోసం దేవుడు సృష్టించిన వైరసే ఇప్పుడు తన శ్వాసకు అడ్డుపడుతున్నది.

అయితే తను దుష్టుడా? భూభారాన్ని పెంచుతున్న పాపుల్లో ఒకడా? తనను కూడా దేవుడు అంతంచేయాలని భావిస్తున్నాడా?

ఎవరికీ.. ఎప్పుడూ హానిచేయని, భగవత్ సన్నిధిలోనే ఎక్కువకాలం గడిపిన తను పాపి ఎట్లా అవుతాడు..?

అతని ఆక్సిజన్ స్థాయి 70 శాతం కంటే పడిపోయింది. ఐసీయూలోకి మార్చించారు. తనకోసం వైరస్ తో పోరాడుతున్న డాక్టర్లూ.. నర్సులూ దేవుని ప్రతినిధులుగా ఆచారికి కనిపించారు.

"ఎంత అంకితభావంతో పనిచేస్తున్నారు?" అనుకున్నాడు.

వీళ్ళను దూతలుగా పంపించి స్వామి తనను కాపాడాలనుకుంటున్నాడా? ముఖ్యంగా తనను పర్యవేక్షిస్తున్న నర్స్ ఎంత ఓపిగ్గా సేవలు చేస్తున్నది. తను చేసేది డ్యూటీయే అయినా ఆమె కళ్ళలో సానుభూతి కురుస్తున్నది. వైరస్ అంటుకుంటుందన్న భయం నర్సుకు లేదా? ఆమె ఇంట్లోవాళ్లు ఎంత ఆందోళన చెందుతూ వుంటారు?

ఆచారికి ఆమెలో దైవత్వం కనిపించింది. తను పూజించే స్వామి కనిపించాడు. దేవుడు తన వెంటే ఉన్నాడు. తోడుగా ఉన్నాడు. తను భయపడాల్సిన అవసరం లేదు.

రామాచారి భార్యకు అతనితో సంబంధాలు తెగినయి. అతన్ని అటెండ్ చేస్తున్న డాక్టర్లు, నర్సులు చెప్పే సమాచారం తప్ప భర్తను చూసే అవకాశం లేదు. ఆచారి అభ్యర్థనపై నర్సు అతని ఫోన్ తీసుకొని భార్యకు డయల్ చేసింది.

**తన మంచానికి ఇరువైపులా.. ఎదురుగా మంచాలపైన అంతా మహమ్మారి బాధితులే. అక్కడివారిలో ఎక్కువమంది బతకడానికంటే చావడానికి లైసెన్సులు పొందినవాళ్లే. ఆచారికి దమ్ము తీస్తుంటే గుండెల మీద గుట్టల్ని మోస్తున్నట్టు ఉన్నది. అతని ఆక్సిజన్ లెవెల్స్ మాటిమాటికి చెక్ చేస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది పడుతున్న శ్రమనే ఎక్కువగా కనిపిస్తుంది తప్ప రోగం అదుపులోకి వస్తున్న పరిస్థితి లేదని అతనికి అనిపించింది.**

"నిమిషం కన్నా ఎక్కువ మాట్లాడకండి పూజారిగారు" హెచ్చరించింది. ఫోన్ అతనికి అందించి ఆక్సిజన్ మాస్కు తప్పించింది. రెండు మాటలు మాట్లాడేసరికి అతనికి దగ్గు తెరలా వొచ్చింది. శ్వాస అందలేదు. గుండె బరువెక్కి మెలిపెట్టినట్టు అయింది. ఎంత గింజుకున్నా మాట రాలేదు. నర్సు అతని నుంచి ఫోన్ తీసేసుకుంది.

"అతని పరిస్థితి దిగజారుతున్నది. మేము చేయాల్సిందంతా చేస్తున్నాం" ఆచారి భార్యతో చెప్పింది.

భార్యతో మాట్లాడలేక పోయినందుకు బాధపడ్డాడు. భార్య ముఖంలోని దీనత్వం, కళ్ళలోని నిస్సహాయతను ఆచారి ఊహించుకున్నాడు. ఆమెను ఒంటరిగా వొదిలి పోతానన్న దిగులు కమ్ముకుంది. బీరువాలో ఎన్ని మంచి చీరలున్నా ఎప్పుడూ మామూలు కాటన్ చీరల్లో ఎంతో సింపుల్గా, నిండుగా వుండే భార్య రూపాన్ని తలుచుకున్నాడు.

అతడు సొంతంగా శ్వాస తీసుకోలేక పోతున్నాడు. ఊపిరితిత్తులు పూర్తిగా వైరస్ ఆధీనమైనయి.

"ఎనీటైమ్ కార్డియాక్ అరెస్ట్" అతన్ని పరీక్షిస్తూ డాక్టరు పెదవి విరిచాడు.

చివరికి వెంటిలేటర్ మీద పెట్టారు. వెంటిలేటర్ మీద పెడితే తను పోవడానికి దారులు ఇంకా పెరిగినట్టని ఆచారికి ఉన్న పరిజ్ఞానం. నువ్వు నిస్తేజమై నీకు బదులు మిషన్ ప్రాణం పోసుకుంటుంది.

అతనికి నీటిలో మునిగిపోతున్నట్టు అనిపిస్తుంది. దేవుణ్ణి తలుచుకున్నాడు. రెండో అవకాశం కోసం ఆశగా ప్రార్థించాడు. తానున్న స్థితికి దారుణంగా భయపడ్డాడు. ఒక్కో అడుగు చీకటి గుయ్యారంలోకి పోతున్నట్టుంది. పీపీఈ రక్షణ ధరించిన డాక్టర్లు, నర్సులు హడావిడిగా లోపలికి వచ్చి చూస్తున్నారు. నిమిషంలో తిరిగి పోతున్నారు. ఆచారి తనకుతాను ఏకాంతమై పోయాడు. ఛాతి ఒక లయతో కదులుతున్నది. మిషన్ ఆక్సిజన్ లోపలికి తీసుకుంటూ నత్రజనిని హిస్సుమనే శబ్దంతో బయటికి పంపుతున్నది.

అంపశయ్య మీద మరోరోజు గడిచింది. పూజారి ఎంతగానో నమ్ముకున్న దేవుడు రక్షించేందుకు రాలేదు. కానీ డాక్టరొచ్చి పరీక్షించి వెంటిలేటర్ తీసెయ్యమని చెప్పాడు.

ఆరాత్రి ఒకటిన్నరప్పుడు ఆస్పత్రి నుంచి ఫోన్. ఆచారి భార్య లేచి ఎత్తింది.

"ఉయ్ ఆర్ వెరీ సారీ మేడం.. మీవారిని కాపాడలేకపోయాం" నర్సు గొంతు.

ఆమె చేతిలోంచి ఫోను జారి కిందపడింది. నిలువునా కుప్పకూలింది. చుట్టూ చీకటిలో ఇల్లు నిశ్శబ్దంగా ఉన్నది. ఎదురుగా పూజగదిలో దేవుడు ఎప్పట్లాగే నిశ్శబ్దంగా ఉన్నాడు. భగవంతుడంటే ప్రేమ స్వరూపుడు. భక్తుల హృదయాల్లో కొలువుండేవాడు. భక్తులను ఆదుకునే వాడు. కోరికలు తీర్చేవాడు. కానీ, నమ్ముకున్న ఆచారికి తోడు కాలేక పోయాడు. అతనొక్కడేకాదు, ఇప్పుడు లోకంలో లక్షలాది హృదయ చలనాలు నిలిచిపోతూవుంటే.. మరెన్నో గుండెల గుడులు దేవుణ్ణి కోల్పోతున్నయి.

# సంభాషణ



పొన్నం రవిచంద్ర, 9440077499

ఆరుబయట వెన్నెల కురుస్తోంది...
మనసు మనోహరమై సుమధుర గీతాలు పాడుతోంది...
ఆకుపచ్చని నీడల మధ్య నుంచి అలవోకగా
చూస్తుంటే వేసవి కూడా
మంచు వీణను సవరిస్తున్నట్టుగానే ఉంది...

అదిగో...
ప్రకృతికి అద్దం పట్టి చూపిస్తున్నట్టుగా
ఉన్నా కిటికీలోంచి బయటకి తొంగి చూసానా..
పూలు లేని పారిజాతం చెట్టు..
పూలు రాలువుకున్నట్టుగా తోస్తున్నది...
అది ఒకే ఒక్క దృశ్యం- చిక్కబడిన దృశ్యం-
జన్మ జన్మలకూ మర్చిపోలేని ఏదో జ్ఞాపకాన్ని
సుతిమెత్తగా మోసుకొస్తున్న దృశ్యం-
ఎవరన్నారు ప్రియా...??

జ్ఞాపకాలు మధురాతి మధురమని.
గుర్తుకొచ్చినప్పుడల్లా అవి గడచిన దినాలేనని..
అందని అందుకోలేని గతమేనని..
ఇప్పుడదంతా ఒక కల మాత్రమేననీ..
ఇక ఆ క్షణాలు అల్లంత దూరమని..
తిరిగి జీవించడం అసాధ్యం
ఎన్ని యుగాల సమాగం మన ప్రేమ?
ఎదని గుచ్చి గుచ్చి బాధించే జ్ఞాపకాలని
మధురస్మృతులని ఎలా పిలవాలి

ఇదిగో...
ఈ వేసవీ ఈ వర్షం.. ఆ తరవాత హేమంతం...
ఆ తుషారాల్లో నువ్వు మళ్ళీ తెల తెల్లగా...
మనసు నింపే అరోమాతో వచ్చేస్తావని ఎదలో ఏదో ఆశ..
కిషోర్ కుమార్ పాట మనసులో అలలు అలలుగా
కదులుతుంది.
"కల్ రహే నా రహే... మౌసం యే ప్యార్ కా
కల్ రుకె నా రుకె.... డోల బహార్ కా..."
నిజమే ప్రియా..
రేపుంటుందో లేదో ఎవరికి తెలుసు.
ఉంటేనేగా, జ్ఞాపకాలుగా బాధో సంతోషమో
ఏదో ఒకటి మెలి పెట్టేది మనల్ని..
రా ఒక్క సారి..

మనకి దొరికిన ఈ నాలుగు క్షణాల్నీ..
ప్రేమలో ముంచేద్దాం..
దోసిటతో ఎంత వెన్నెలని పోసుకుని తాగినా
ఈ దాహం తీరట్లేదు.
ఒక చల్లని నవ్వు ఇవ్వు...
జ్ఞాపకాలే లేని నిరంతర ఏకాంతంలో
యథేచ్ఛగా ఈదులాడేలా
నిరాకార కాలంలోకి ఇంకిపోదాం.

అవునూ...
నన్ను నేను ప్రకటించుకున్న ప్రతి క్షణమూ
నువ్వు వెల్లడవ్వటంలో నా గొప్పేం ఉందో చెప్పూ
కాలమంతా వెదికి నా కోసం రాసుకున్న స్వేచ్ఛవి నువ్వు
గాలిలో గిరికీలు కొడుతున్న కట్టకడపటి గానాన్ని
నా కోసం ఆలపించే నీ మంత్రస్వరాన్ని వింటూ
ఆకుపచ్చని గరికనై ?
నీ పాటవాటుగా కొట్టుకుపోయే
అమాయకత్వాన్ని నేను...

అవునూ..
నేను ఇంకా ఇప్పటికీ నాలో
నిన్ను దర్శించుకుంటూనే ఉన్నా
నా జ్ఞాపకాల్లో నిరంతరం
నీతో సంభాషిస్తునే వున్నా..

వ్యాసం

# సామాజిక బాధ్యతే కవికి గొప్ప గుర్తింపు

కవి సమాజం నుంచి వేరు కాదని నిరూపించే వ్యాసం...



ఎస్.ఆర్. భల్లం
98854 42642

ఏ కవిత్వమైనా ఏదో ఒక స్థిర బిందువు వద్ద జడంగా నిలిచిపోదు. అది చైతన్య సహితమై చలన శకలమై, వినూత్న శిల్పాన్నీ, చింతననూ, తాత్వికతనూ, నిరంతరం అన్వేషిస్తూనే ఉంటుంది. కాబట్టే కవి తన ఆలోచనల్ని, ఆవేశాన్ని, దుఃఖాన్ని, కన్నీళ్లని కవితీకరించడానికి ప్రయత్ని స్తూనే ఉంటాడు.

ఎవరి కోసమైతే కవిత్వం రాయబడుతుందో, ఆ కవిత్వం అట్టడుగు మనుషులకు అర్థం కావాలన్న దృక్పథం ఏర్పడ్డ తర్వాత వచన కవిత్వంలో ప్రజల భాష చోటుచేసుకుంటుంది. అయితే అందులో లయ లేనందువల్ల, శుద్ధవచనం అయినందువల్ల అది కొన్ని పరిమితులలో ఉండిపోతుంది.

**ఏ కవిత్వ అస్తిత్వానికయినా తన-పర అన్న నిర్వచనం కీలకమై, అస్తిత్వ, ఉద్య మాలన్నీ అంతకుముందు చెలామణిలో ఉన్న అస్తిత్వాలను చీల్చుకుని వచ్చినవే. కవిత్వ ప్రక్రియా అస్తిత్వం, అంతకు ముందు ఉనికిలో ఉన్న అస్తిత్వాన్ని చీల్చుకుని వచ్చిందే అవుతుంది. కొందరు వర్తమాన కవులు తమ భావుకత్వాన్ని సామాజిక నేపథ్యంతో ముడిపెట్టుకుని మరీ రాస్తూ, అవసరమైనప్పుడల్లా తమ మానసిక క్షోభను, ఉద్రేక పూరితంగా, సామాజిక స్వరంగా వినిపిస్తుంటారు. తద్వారా సమ సమాజ స్థాపనకు ప్రయత్నిస్తూ వుంటారు.**

భావోద్వేగాల కళాత్మక బాహ్యరూపమే కవిత్వమనుకుంటే దేని ప్రత్యేకత దానిదే. దృశ్య, శ్రావణాలకన్నా కవిత్వం భిన్నంగా ద్యోతకమౌతుంది. కవిత్వం కేవలం పండితులకే పరిమితమనుకునే కాలం కాదిది. పామరుని సైతం రంజింప చేయగలిగినదే కవిత్వంగా భావించ బడుతుంది.

వచన కవితా ప్రస్థానంలో వైవిధ్యం, ఉక్తి వైచిత్రి, అభివ్యక్తి, వ్యూహ నిర్మాణం, ప్రాపంచిక విశ్లేషణాత్మక దృక్పథ అత్యధిక మైపోగానే కవిత్వం రాయడానికి పనికొచ్చే అక్షరాల మిణుగురులు అవుతాయి. ఆయుధాలు అవుతాయి. కన్నీళ్ల అవుతాయి. ఆత్మీయంగా పలకరించే చెలిమి పలుకులు అవుతాయి. కవిత్వం జీవిత ప్రతిబింబమే కాని, ఉన్నది ఉన్నట్టుగా చూపెట్టే నకలు మాత్రం కాదని ఈ సందర్భంగా గ్రహించుకుంటే మంచిది.

ఆధునిక నాగరికత జీవితాన్ని శకలాలు శకలాలుగా విభజించడం మొదలుపెట్టాకా, కవిత్వం కూడా కొన్ని పార్శ్వాలను, కొన్ని పరిధులను మాత్రమే తీసుకొని, ఒక ప్రత్యేక పరిమితిని, సృష్టించుకుంటోంది. ప్రపంచీకరణ ప్రభావంతో అది అత్యధికమైందని చెప్పక తప్పదు.

ఇదెంత వరకు ముదిరిందంటే వర్ణం, వర్గ ప్రాంతం విషయంలోనే కాదు లబ్ద ప్రతిష్టులైన మహా కవులను కూడా కుల వేర్పాటు తత్వానికి అతీతులు కానీ స్థితి తెస్తూంటే బాధగాను, భయంగాను ఉంటుంది. ఈ పరిస్థితి ఎలా చక్కదిద్దాలో అర్థం గాని అయోమయం గానూ వుంటుంది.

కొందరైతే సాహిత్య సంఘాల పేర్లూ, గత చరిత్రను చర్విత చరణంగా చెప్పుకొని, వ్యక్తులుగా, సాహితీ శక్తులుగా కాలరెగరేసు కోవడమే తప్ప, ఆ సాహిత్య సంఘాలలో అరకొరగా కూడా సభ్యులే లేని పరిస్థితి కూడా వుండి పైకి గత వైభవం దాని చుట్టూ వర్తమానాన్ని అల్లుకుంటూ, ఆ కవులు కూడా సుకవులుగా పబ్బం గడుపుకుంటూ, కనీస సభ్యులు కూడా లేని పేరు పడ్డ కవిత్వ సంఘాలు ఇంగువ కట్టు చేలాంచెలంగా మిగిలిపోయాయని చెప్పక తప్పదు.

కొందరి కవుల మధ్య వ్యక్తిగత నిందలు, విద్వేషాలు, పగలు, ప్రతీ కారాలు, ఉద్యమాల పేరుతో పెడ

వ్యాసం

ధోరణులు, ప్రాంతీయ దురభిమానంతో ఏక పక్షంగా సాగే చర్యలు, కలం సాక్షిగా ప్రకంపనలు, ఊపిరిని ఉరితీసే ఉద్యమాల ఉధృతిలో కవిత్వం చివరికి ఎటు పోతున్నదో తెలియని పరిస్థితి కవితాభిమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తుంది.

కవి ఎప్పుడూ ఏ భేషజాలకు భయపడకుండా, ఎవరికీ తలవంచకుండా, ఎట్టి పరిస్థితిల్లోను ప్రజావాహినికి దూరం కాకుండా వుండాలి. సమాజ గతిని బట్టి సాహిత్యంలో కొత్త నీరు వచ్చి చేరుకుంటుంది. ఛందో రూపం, ఆ తర్వాత ఛందో నియమేతర రూపం కవిత్వ వ్యక్తీకరణకు, కవి ప్రధాన వాహికగా స్వీకరించడం జరుగుతుంటుంది.

కవి తన అనుభవం నుంచి, లోక పరిశీలనలోంచి, ఉపమానాది అలంకారాన్ని ఎంచుకుంటాడు. అందువల్ల అవి పాఠకులకు సూటిగా చేరుకోవడమే కాక ఒక కొత్త ఉత్సాహ జనితమైన వాతావరణాన్ని కలిగిస్తాయి.

**కొందరైతే సాహిత్య సంఘాల పేర్లూ, గత చరిత్రను చర్విత చరణంగా చెప్పుకొని, వ్యక్తులుగా, సాహితీ శక్తులుగా కాలరెగరేసు కోవడమే తప్ప, ఆ సాహిత్య సంఘాలలో అరగొరగా కూడా సభ్యులే లేని పరిస్థితి కూడా వుండి పైకి గత వైభవం దాని చుట్టూ వర్తమాన్ని అల్లుకుంటూ, ఆ కవులు కూడా సుకవులుగా పబ్బం గడుపు కుంటూ, కనీస సభ్యులు కూడా లేని పేరు పడ్డ కవిత్వ సంఘాలు ఇంగువ కట్టు చేలాంచెలంగా మిగిలిపోయాయని చెప్పక తప్పదు.**

కాల్పనిక వాద కవి వ్యక్తి వాదంలో తన కవిత్వంలో ప్రతీక చిత్రాల వాడకం, సృజనాత్మక కల్పన, ఆదర్శవాదం, వ్యక్తిగత అవలోకనం, ప్రకృతి అవలోకనం, మొదలైన వాటిని అధికంగా ప్రయోగిస్తూ వుంటాడు.

ఏ కవిత్వ అస్తిత్వానికయినా తన-పర అన్న నిర్వచనం కీలకమై, అస్తిత్వ, ఉద్యమాలన్నీ అంతకుముందు చెలామణిలో ఉన్న అస్తిత్వాలను చీల్చుకుని వచ్చినవే. కవిత్వ ప్రక్రియా అస్తిత్వం, అంతకు ముందు ఉనికిలో ఉన్న అస్తిత్వాన్ని చీల్చుకుని వచ్చిందే అవుతుంది.

కొందరు వర్తమాన కవులు తమ భావుకత్వాన్ని సామాజిక నేపథ్యంతో ముడిపెట్టుకుని మరీ రాస్తూ, అవసరమైనపుడల్లా తమ మానసిక క్షోభను, ఉద్రేక పూరితంగా, సామాజిక స్వరంగా వినిపిస్తుంటారు. తద్వారా సమ సమాజ స్థాపనకు ప్రయత్నిస్తూ వుంటారు.

కవిత్వం నిత్య చైతన్య ప్రవాహం కావాలి. అంతేకాని నిలిచిన నీరు కాకూడదు. ఎందుకంటే పారుతున్న నీరు పలుదారులు తొక్కుతుంది. పాయలుగా చీలుతుంది. ఎన్ని గుట్టలనో కోసేస్తుంది. నిత్య చైతన్యశీలమైన ప్రవాహానికి అది జీవలక్షణం. అలాగే కవిత్వమూను ప్రతిఫలిస్తుంది.



**వచన కవితా ప్రస్థానంలో వైవిధ్యం, ఉక్తి వైచిత్రి, అభివ్యక్తి, వ్యూహ నిర్మాణం, ప్రాపంచిక విశ్లేషణాత్మక దృక్పథ అత్యధికమైపోగానే కవిత్వం రాయడానికి పనికొచ్చే అక్షరాల మిణుగురులు అవుతాయి. ఆయుధాలు అవుతాయి. కన్నీళ్లు అవుతాయి. ఆత్మీయంగా పలకరించే చెలిమి పలుకులు అవుతాయి. కవిత్వం జీవిత ప్రతిబింబమే కాని, ఉన్నది ఉన్నట్టుగా చూపెట్టే నకలు మాత్రం కాదని ఈ సందర్భంగా గ్రహించుకుంటే మంచిది.**

కవి పొందే అనుభూతులు, సంతృప్తులు, ఆనందాలు, వీటన్నింటికి మించి కవిత్వం రాయడం అనేది ఒక మహత్తరమైన సామాజికమైన బాధ్యత. దానిని గుర్తెరిగి రాసినవారే గొప్ప కవులుగా మిగిలిపోతారు.

తాము రాసిన ప్రతి అక్షరం మహా కవిత్వమై పోతోందని భ్రమిస్తున్న కొంతమంది కవిత రూప శిల్పులకి ఎంతో ప్రచారం చేసే అనుచరగణం ఎంతో మంది ఉంటారు. కానీ కాల పరీక్షలో వారంతా మరుగున పడిపోతుంటారు.

కొంతమంది కవులెప్పుడూ అత్యుక్త ఉపమ రూపకాది అలంకారోక్తి కనుక వారిలోని రాజకీయ రచన దర్శనం కేవలం సూచన మాత్రమే. వచన, రచనల్లోనే రాజకీయం వాస్తవావరణంలో తిరుగుచుండటం వలన అవాంఛనీయ శిల్ప వైపరీత్యాలకు తావుంటుంది.

నిజానికి కవితా ప్రక్రియల యుద్ధంలో గాయపడేదీ, మరణించేదీ కవులు కాదు కవిత్వం. అవును నిత్య ప్రక్రియ యుద్ధం ప్రారంభం కాగానే అక్షర శాంతికి విఘాతం కలుగుతుంది. భావనా శాంతి గాయపడి మరణిస్తుంది. కొంత కాలానికి కాలం గాయాలు మానాక, కవి కలంలో మృదు మధుర కవిత్వం చిగురించక మానదు.

కవిత

# మనందరిలో కొందరుంటారు..!



గోపగాని రవీందర్, 94409 79882

కొందరుంటారు
తరిగిపోని జ్ఞాన నిధుల్లా
మన మధ్యనే తిరుగుతుంటారు
సంభాషణల మధురిమలతో
అద్భుత కావ్యాల్లా అలరిస్తుంటారు
అపరిమితమైన కోరికలను
అడుగడుగున దహించుకుంటూనే
అసాధ్యాలను సుసాధ్యం చేసుకుంటూ
విజయ రాగాలను వినిపిస్తుంటారు
రంగులమయమైన జీవనంలో
సింగిడిలా విరాజిల్లుతుంటారు
సమస్యల సవాళ్లు ఎదురైనా
తలవంచని యోధుల్లా వర్ధిల్లుతుంటారు
అపజయాలు వెంటాడుతున్నా
నిర్భయంగానే సంచరిస్తుంటారు
ఆలోచనల సాకారం కోసం
నిర్విఘ్నంగా శ్రమిస్తుంటారు..!

ఇంకొందరుంటారు
పున్నమి నాటి వెన్నెల వలె ఉండాలంటే
అందులోని మచ్చలను వెతుకుతుంటారు
పదాలలోని అర్థాలను గ్రహించాలంటే
విపరీతార్థాలతో
ఒళ్ళును తడుముకుంటారు
ఆత్మీయ బంధాలను నెలకొల్పాలంటే
విరోధభరితమైన
విస్మయాన్ని కలిగిస్తుంటారు..!

తమ చుట్టు తాము గీసుకున్న
వలయంలోనే సేదతీరుతూ
అన్ని తెలుసుననే
భ్రమల్లోనే బ్రతుకుతూ
వంచనలతో కూడిన ప్రసంగాలను
చెప్తూ సేవ చేస్తున్నామంటారు

ఏవో కల్లబొల్లి వాగ్దానాలను
మాయమాటలతో నమ్మిస్తుంటారు
ఆ క్షణాలు గడిచిపోగానే
మటుమాయమై పోతుంటారు
స్నేహపు సంకెళ్ళల్లో మనల్ని బంధించి
వెర్రి వాళ్ళను చేసి ఆడుకుంటారు..!

మనలను మెట్లుగా మార్చుకొని
వాళ్ళు దర్జాగా అధిరోహిస్తుంటారు
అవసరం తీరితే చాలిక
అంతుబట్టని ఆరోపణలను గుప్పిస్తూ
మానసిక వేదనలకు గురి చేస్తుంటారు..!

ప్రాణంగా విశ్వసించిన వాళ్లే కావచ్చు
విలాపాలకు కారణమవుతుంటారు
బ్రతకడం నేర్చుకోవాలని
లౌక్యమిట్ల ప్రదర్శించాలని
పక్కా ప్రణాళికలతో చేరుతుంటారు
అందుకనే జర జాగ్రత్త సుమా
జనారణ్యంలో వేటగాళ్ళుగా
నీడలా వెంటాడుతున్న మోసగాళ్లతో..!

మరి కొందరుంటారు
తనువంతా రక్తసిక్త గాయాలైన
లక్ష్యాన్ని వదలని సాధకులు వాళ్ళు
రక్త మరకలు చెరిగిపోతాయేమో కాని
ఆశయాలను మరువని ధీరులు వాళ్ళు
ముసురుకున్న చీకట్లను పారద్రోలే
కొంగ్రొత్త వెలుగు రేఖలు వాళ్ళు
యుగ యుగాలుగా అవిశ్రాంతమైన
మానవీయ సేద్యంలో కర్షకులు వాళ్ళు
ఒడ్డున నిలబడి ఉన్నంతకాలం
నది సొగసును ఆస్వాదించడమే కాదు
పరువళ్లెత్తుతున్న దాని హొరును పసికట్టి
పడిపోకుండా నిలువడమెట్లనో
నేర్పే కార్యసాధకులు వాళ్ళు
తేజోమయమైన బోధనలో
ఉత్తేజపరిచే ఆచార్యులు వాళ్ళు
నిర్విరామ గమనోత్సాహంలో
మడమ తిప్పని
మార్గ నిర్దేశకులు వాళ్ళు..!











## 2001 జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత

# రాజేంద్ర షా

రాజేంద్ర కేశవ్ లాల్ షా 1913-2010. గుజరాత్ భాషలోని ఒక సృజనకారుడు. కంపద్వాజ్‌లో జన్మించిన ఆయన 20కి పైగా కవితలు, పాటల సంకలనాలు వెలువరించారు. ఆయన ప్రకృతి ఆరాధకుడు. ఎంత ప్రకృతి ఆరాధకుడో అంత సమాజవాది. స్వదేశీయులు అందునా మత్సకారులు వస్తువుగా తన కవిత్వం కొనసాగించాడు. కవితా రచన చేస్తూనే ఆయన ముంబైలో ప్రచురణకర్తగా కూడా వ్యవహరించాడు. 1957లో ఆయన కవిలాల్ అనే పత్రిక ప్రారంభించాడు. మరోవైపు ఠాగూర్ కవిత్వాన్ని ఆయన గుజరాత్‌లోకి అనువాదం చేశారు. జయదేవ్ గీతా గోవిందం, కొల్ రిడ్జ్ ది ఎన్సియంట్ మేరినర్, డాంటే డివైన్ కామెడి, లాంటివి ఆయన అనువదించిన గ్రంథాలు. షా 2001 జ్ఞానపీఠ అవార్డ్‌ను గెలుచుకొన్నారు. దీనితో పాటు గుజరాత్ సాహిత్య పరిషత్ అవార్డ్, నరసింహ మెహతా అవార్డ్ లాంటి సుప్రసిద్ధమైన గుజరాతి సాహిత్యంలోని అవార్డులు ఆయనను వరించాయి. ధ్వని, అన్దోళన్, శృతి శాంత్ కోలాహల్, చిత్రనా ఆయన రచనలు.

## 2002 నోబెల్ ప్రైజ్ విన్నర్

# ఇమ్రేకెర్టాజ్





ఇమ్రేకెర్టాజ్ (Imre Kertesz) హంగేరికి చెందిన రచయిత. ఇతడు హంగేరి నుండి నోబెల్ ప్రైజ్ గెలుచుకున్న మొదటి రచయిత. అయన జీవితకాలం 1929 నుండి 2016 వరకు. ఆయన జీవిత భాగస్వామి మగ్దకెర్టెజ్ (Magda Kertesz) మరియు అల్బియ వాస్ (Albiya vas). ఈయన నోబెల్ ప్రైజ్ తో పాటు Bavariyan Minister, President Kosselth నుండి అవార్డ్‌లు అందుకున్నాడు. ఆయన ఇతర రచనలు Fatelesnes Kaddish for an unborn child మొదలైనవి. ఫేట్లెస్ నెస్ నిర్బంధ శిబిరాల్లో 15 ఏళ్ల గ్గెర్జి అనుభవాన్ని వివరిస్తుంది.







1969-73ల మధ్య రాసిన ఈ నవల ప్రచురణను హంగేరిలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వం నిలిపివేసింది. తరువాత 1975లో ఇది ప్రచురించబడింది. కొందరు ఈ పుస్తకాన్ని పాక్షిక ఆత్మకథగా అభివర్ణించారు. క్రమంగా ఈ పుస్తకం హంగేరిలోని అన్ని పాఠశాలల్లో పాఠంగా చేరింది. తరువాత చలనచిత్రంగా కూడా వచ్చింది. మొత్తానికి ఈ రచయిత సాహిత్య జీవితం వివాదాస్పదంగా కొనసాగింది.

ఆయనకు వైయక్తిక విషాదానుభవాల చిత్రీకరణకు గాను నోబెల్ ప్రైజ్ లభించింది. ప్రముఖంగా పేర్కొదగిన ఆయన ఇతర రచనలు Kaddis for an Unborn Child, Galeerentagebuch, Die English Flagge , The Halocaust As Culture.

ముఖాముఖి

# అవి ముమ్మాటికీ తెలంగాణ అస్తిత్వానికి భంగకరమే - సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

**ఉద్యమం, జీవితం, కవిత్వం అవిభాజ్యం అని తెలిపిన సుంకిరెడ్డితో ముఖాముఖి...**



డా॥ వెల్దండి శ్రీధర్
98669 77741

తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టడానికి ఇంకా ఎంతో చేయాలి! కవి, విమర్శకులు, పరిశోధకులు, చరిత్ర కారులు, ఉద్యమ కారులు, కథకులు, అధ్యాపకులు, సాహిత్య సంస్థల స్థాపకులు అంటూ, అస్తిత్వ ఉద్యమాలకు పురుడు పోసిన తెలంగాణ సాహిత్య దిగ్గజం డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డితో డా॥ వెల్దండి శ్రీధర్ జరిపిన ఇంటర్వ్యూ.

**మీ కుటుంబ నేపథ్యం చెప్పండి?**

మాది వ్యావసాయిక మధ్యతరగతి కుటుంబం. ఇంటిల్లిపాది శెలకల్లో పొలంలో పనిచేసే వ్యవసాయ జీవితం. నల్లగొండ జిల్లా కనగల్లు మండలంలోని పగిడిమర్రి మా ఊరు. మా వూరి దొరలు కాక అక్షర జ్ఞానం ఉన్న కొద్దిమందిలో మా నాయనొకడు. 5, 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోయన్‌పల్లి అనే వూరిలో ఒక ముస్లిం పంతులు వద్ద గిద్దెలోడ్సు (వడ్ల లెక్క), బొట్లొడ్సు (పైసల లెక్క) చదువుకుండు. చదివింది తక్కువే గని మంచి వ్యవహార జ్ఞానం ఉన్నవాడు. బావుల తవ్వకం కొలతలు, భూమి కొలతల్లో దిట్ట. ఏ పత్రాలయినా ఆయనే రాసేవాడు. మంచి అందమైన రాత (రాత మంచిగుండాలనేవాడు. కాని నాకది అబ్బలేదు). పంచాయతీలు చెప్పడంలో నేర్పరి. ఇరువర్గాల వారు మా నాయననే పెద్దమనిషిగా కోరుకునేవారు. నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా తీర్పు చెప్పేవాడనడానికి అది నిదర్శనం. (సాహిత్యంలో నేను న్యాయం వైపు నిలబడడానికి పరోక్షంగా అది దోహదం చేసిందనుకుంట). ఆయన బతికున్నంతదాకా ఒకటి రెండు హత్యకేసులు దప్ప ఏ కేసూ ఊరుదాటి పోలీసు స్టేషన్‌కో, పెద్ద నాయకుడు దగ్గరకో వెళ్ళిన దాఖలాలు లేవు. ఈ న్యాయబద్ధతే ఆయనను గ్రామ సర్పంచిని చేసింది. ఆ రోజుల్లో ఏడవ తరగతి చదివి మా మేనమామ టీచరయిండు. ఆయనను చూసో, ఇతరులను చూసో మానాయన నన్ను డిగ్రీదాకా చదివించిండు. డాక్టర్ సదువు చదవాలన్న ఆశ ఎప్పుడో పోయింది. ముగ్గురు చెల్లెళ్ళ పెండ్లీలు చేసేసరికి అయిపోయింది. ఇంక చదువు ఆపి వ్యవసాయం చూసుకుంటూ కాంట్రాక్టులు గింక్రీట్లు చేసుకుంటూ ఊర్లోనే ఉండమన్నడు. ఆయనకు చెప్పకుంట మా అమ్మమ్మ వూరికి బోయి అమ్మమ్మ ఇచ్చిన అయిదువందలతో ఉస్మానియాలో ఎం.ఏ.లో చేరిన.

**మీ కుటుంబం నుంచి మీ కన్నా ముందు ఎవరూ సాహిత్య రంగంలో లేకున్నా సాహిత్యం వైపు ఎలా ఆకర్షితు లయ్యారు?**

దీనికి ఒక్క సంగతి చెప్పలేం ఎన్నో... నాట్లప్పుడు, పచ్చగలుపప్పుడు. వరికోతలప్పుడు అమ్మ పాటలు బాడేది. మాకు బాలనాగమ్మలాంటి కథలు చెప్పేది. ఊర్లె బాగోతాలకు, శారదగాండ్ల కథలకు మమ్మల్ని తీసుకెళ్లేది. ఇది సబ్‌కాన్షస్‌గా పనిచేసి ఉండొచ్చు. మా మేనమామ దగ్గర ఉన్న పుస్తకాలు, మా వూరి దొరోల్ల దగ్గరి పుస్తకాలు, గ్రంథాలయంలోని పుస్తకాలు. ఎప్పుడు నా చేతిలో పుస్తకం ఉండేది. చదివేవాడిని. ఇవి అంతర్లీనంగా సాహిత్యం పట్ల ఆసక్తిని పెంచి వుంటవి. ఈ ప్రభావాల వల్లనే కావచ్చు అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినా తెలుగులో ఫస్టొచ్చేవాడినని అప్పటి క్లాస్‌మేట్స్ తర్వాత చెప్పిండ్రు. అందువల్ల తెలుగు టీచర్లు నన్ను క్లాస్ లీడర్ని చేసిండ్రు. ఇది మరింత



ఆసక్తిని పెంచింది. అందుకే ఇంటర్లో, బి.ఏ.లో తెలుగును ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకున్న. ఆక్రమంలో 9వ తరగతిలో ఒక మిత్రుడితో కలిసి చందమామ కథల్లాంటి కథ రాసిన. ఇంటర్లో కవితలేవో రాసిన. బి.ఏ.లో పద్యాలు రాసిన. ఆంధ్రుల సాంఘిక చరిత్ర చదివి (అప్పటికి అది సురవరం రచన అని గానీ దాని గొప్పతనం గానీ తెలువదు) ఏదో వ్యాసం లాంటిది రాసిన. అవేవీ లేవు. అప్పటి కాలేజి వార్షిక సంచికల్లో ఉన్నాయేమో తెలియదు. ఎం.ఏ.లోనే క్రమపద్ధతిగా సాహిత్యంలో సంలీన మయింది.

**ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పుడే రైటర్స్ సర్కిల్ ఏర్పాటు చేశారు కదా! దాని ఆవిర్భావ వికాసాన్ని చెప్పండి? ఇలాంటి సంస్థలు అంతకు ముందు ఎవరైనా ఏర్పాటు చేశారా?**

1979లో నందిని సిధారెడ్డి, నేను, సలంద్ర, జింబో (మంగారి రాజేందర్), నాళేశ్వరం శంకర్, కె. ముత్యం కలిసి ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ స్థాపించినం. తర్వాతర్వాత కందుకూరి శ్రీరాములు, జయప్రభ, ఎస్వీ, మందల పర్తి కిశోర్, వారాల ఆనంద్, లక్ష్మారెడ్డి, బోధనం నర్సిరెడ్డి, గుడిహాళం రఘునాథం, మద్రి విజయ రావు, సారా, గుంటూరు ఏసుపాదం, కె. నర్సింహాచారి సర్కిల్‌తో కలిసి నడిచిండ్రు. తర్వాత ఏసుపాదం, నర్సింహాచారి కన్వీనర్లయినా 1979 నుండి 1983 వరకు సంస్థ నిర్వహణ బాధ్యత నా మీదే పడింది. ఆనాటి వామపక్ష విద్యార్థి సంస్థలతో కలిసి నడిచింది. యూనివర్సిటీలో అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించింది. ఆ కాలమంతా గొప్ప సంరంభంతో గడిచింది. నా పూనికతో "1971-80 ఈ తరం యుద్ధకవిత" వెలువడింది. దశాబ్ది సంకలనాలకు ఇది నాంది పలికింది. తర్వాతి కాలంలో ఘంటా చక్రపాణి, గుడిపాటి, కాసుల ప్రతాపరెడ్డి కొంతకాలం సర్కిల్‌ను నడిపించిండ్రు.



క్రమంగా వామపక్ష విద్యార్థి సంస్థలు మసకబారడంతో ఈ సంస్థ కూడా కనుమరుగయింది. అంతకు ముందు దేవరాజు మహారాజు, విద్యాసాగర్ ఒక సంస్థను కొంతకాలం నడిపింద్రు. ఇటీవలకాలంలో మహేందర్, శివరాత్రి సుధాకర్ తదితరులు ఒక సంస్థను స్థాపించి నడిపిస్తున్నారు.

**కవిగా, పరిశోధకులుగా, విమర్శకులుగా, చరిత్రకారులుగా అన్ని రంగాలలో కృషి చేస్తూ వస్తున్నారు. వీటిలో మీకిష్టమైన రంగం ఏది? మిగతా వాటికి న్యాయం చేయలేకపోయాననే అసంతృప్తి ఉందా?**

తెలంగాణ తొలి వికాసదశలో సురవరం ప్రతాపరెడ్డి లాంటి వాళ్ళు అనేక రంగాల్లో పనిచేయవలసి వచ్చింది. అట్లాగే మలి వికాసదశలో సంగిశెట్టి శ్రీనివాస్, కె. శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, నందిని సిధారెడ్డి, నాలాంటివాళ్ళం అనేకరంగాల్లో పనిచేయవలసి వచ్చింది. అట్లా మీరు పేర్కొన్న విమర్శ, పరిశోధన, చరిత్ర రచన తెలంగాణ డిమాండ్ మేరకైనా ఇష్టంగానే చేసిన. అయితే ఈ పనులవల్లనే కాక, గతంలో పౌరహక్కుల కార్యకర్తగా, సంస్థల నిర్వాహకుడిగా పనిచేసినందువల్ల కూడా నేను అమితంగా ఇష్టపడే కవిత్వానికి తగినంత సమయం ఇవ్వలేకపోయిన్ననే అసంతృప్తి వుంది. అట్లని కవిత్వంలో వెనుకబడలేదు. అది చాలు, "తెలంగాణ చరిత్ర"ను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు రచించలేకపోయిన అనే అసంతృప్తి కూడా ఉంది. ఇలాంటివి తప్పవు మరి.

**ఉద్యోగపరంగా కొన్ని రోజులు ఉత్తరాంధ్రలో కూడా పనిచేశారు కదా! అక్కడి సాహిత్య వాతావరణానికి, తెలంగాణ సాహిత్య వాతావరణానికి భేద, సారూప్యతలు ఏమున్నాయి?**

ఉత్తరాంధ్ర ప్రజలు కూడా తెలంగాణ వారిలాగే మంచివాళ్ళు, అమాయకులు. నాగావళి, వంశధార, ఝంఝావతి, బహుదా, మేఘావతి లాంటి ఎన్నో నదులున్నా తెలంగాణ 'లాగే' వెనుకబడిన ప్రాంతం. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట ప్రభావం తెలంగాణ మీద ఉంది. అక్కడి సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటాపు సత్యం, రావిశాస్త్రి, కారాల ప్రభావం తెలంగాణ సాహిత్యం మీద ఉంది. ఇది ఒకప్పటి స్థితి. తెలంగాణ అస్తిత్వ ఉద్యమం మొదలైన తర్వాత తెలంగాణ ప్రభావమే ఉత్తరాంధ్ర మీద పడింది. ఇక్కడిలాగే అక్కడా అన్ని వనరుల మీద సీమాంధ్రుల ఆధిపత్యం నెలకొన్నప్పటికీ ఇక్కడిలాగా అక్కడ అస్తిత్వ చైతన్యం ఉద్యమరూపం దాల్చలేదు. దానికి ఎన్నో కారణాలు. మిగతా అస్తిత్వోద్యమాల సాహిత్యం కూడా ఇక్కడంత బలంగా అక్కడ లేదు. దానికి ఎన్నో కారణాలు.

**'జముకు' పత్రికను తీసుకొచ్చారు కదా! దాని గురించి చెప్పండి? అది అక్కడి సాహిత్య స్తబ్దతను ఎలా విచ్ఛిన్నం**

**చేసింది?**

'జముకు' కంటె ముందు చెప్పాల్సింది 'శ్రీకాకుళ సాహితి' గురించి. నేను ఉద్యోగరీత్యా 1984లో శ్రీకాకుళం వెళ్ళిన. అక్కడి ప్రగతిశీల శక్తులను కలుపుకొని 'శ్రీకాకుళ సాహితి'ని స్థాపించినం. శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం అణచివేతకు గుర్తై స్తబ్దత ఏర్పడింది. 1985 ప్రాంతాల నుంచి ఆ విప్లవోద్యమం తిరిగి పుంజుకుంటున్న దశలో శ్రీకాకుళ సాహితి ఏర్పడింది. దాని తరపున వచ్చిందే 'జముకు'. శ్రీకాకుళ పోరాటంలో పాణిగ్రాహి చెప్పిన జముకుల కథలో వాడిన వాయిద్యమే 'జముకు'. ఆ పోరాట స్ఫూర్తినీ, స్థానిక సంస్కృతినీ స్ఫురింపజేయటానికి పత్రికకు ఆ పేరు పెట్టినం.

**తెలంగాణ, ఉత్తరాంధ్ర రెండూ ఉద్యమ నేలలే కదా! ఎందుకలా? ఈ రెండింటి మధ్య పోలికలు, విభేదాలు ఏం గమనించారు? ఉత్తరాంధ్రలో వచ్చినంత బలంగా తెలంగాణలో ఉద్యమాలు వచ్చాయనుకుంటున్నారా?**

తెలంగాణ, ఉత్తరాంధ్ర రెండూ 'వెనుకబడిన' ప్రాంతాలే. 'వెనుకబడిన' అనే పదం వాటి పూర్తి స్వభావాన్ని వెల్లడించదు. భూస్వామ్య వ్యవస్థ మిగిలివున్న ప్రాంతాలు అనడం కరెక్ట్. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా దేశంలో కొన్ని ప్రాంతాలు భూస్వామ్య వ్యవస్థను వదులుకొని పెట్టుబడిదారి సంబంధాల్లోకి వచ్చినవి. అట్లా రాని ప్రాంతాలే ఇవి. ఆ వ్యవస్థ నిర్మూలన కోసమే తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం (1946-51) జరిగింది. ఉత్తరాంధ్రలో కూడా 'మందస' రైతాంగ పోరాటాల్లాంటివి జరిగినవి. అయితే తెలంగాణలో అంత విస్తృతంగా ఉధృతం గా అక్కడ జరగలేదు. ఆ పోరాటాల తర్వాత కూడా మిగిలిపోయిన "భూస్వామ్యా"న్ని నిర్మూలించడానికి నక్సలైట్ పోరాటంగా పిలువబడిన విప్లవోద్యమం మొదట నక్సల్బరీలో శ్రీకాకుళంలో అనంతరం తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో జరిగింది. ఈ సందర్భంలో కూడా తెలంగాణలోనే విస్తృతంగా, సుదీర్ఘకాలం జరిగింది. ఆధునికత పేరుతో వ్యాపారం పేరుతో ఈ రెండు ప్రాంతాల నాక్రమించిన సీమాంధ్ర ఆధిపత్య వ్యతిరేక ఉద్యమం ఇక్కడ టి.ఆర్.ఎస్. మేధావులు, విద్యార్థుల వల్ల, సబ్బండ వర్గాలవల్ల విజయవంతమై ఆ ఆధిపత్యం నుంచి విముక్తమైంది. అక్కడ అది జరుగలేదు.

**నీలగిరి సాహితీ సంస్థ గురించి చెప్పండి? దాని వలన సాహిత్యానికి జరిగిన మేలేమిటి?**

శ్రీకాకుళం నుంచి నేను నల్లగొండకు బదిలీ అయి వచ్చిన తర్వాత 1992లో 'నీలగిరి సాహితి'ని స్థాపించినం. ఈ సంస్థ నుంచి పగడాల నాగేందర్, స్కైబాబ, మునాసు వెంకట్, అంబటి వెంకన్న, కె. వెంకట్, అవధానం దుర్గాప్రసాద్, చిత్రం ప్రసాద్, వేముల ఎల్లయ్య తదితరులు సాహిత్య ప్రపంచానికి పరిచయం కావడం సంస్థ స్థాపనకు సార్థకత. ఈ సంస్థ నుంచి వెలువడిన 'బహువచనం', 'జల్‌జలా'లు తెలుగు సాహిత్యంలో స్త్రీ దళిత, బహుజన, ముస్లింవాద అస్తిత్వ ఉద్యమాలు విస్తృతం కావటానికి దోహదం చేసినవి. తెలంగాణలో ఈ వాదాలకు నాంది పలికినవి. పైన పేర్కొన్న కవులు వివిధ వాదాలకు కేంద్ర బిందువు అయినారు.

> **1979లో** నందిని సిధారెడ్డి, నేను, సలంద్ర, జింబో (మంగారి రాజేందర్), నాళేశ్వరం శంకర్, కె. ముత్యం కలిసి ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ స్థాపించినం. తర్వాత్తర్వాత కందుకూరి శ్రీరాములు, జయప్రభ, ఎస్వీ, మందల పర్తి కిశోర్, వారాల ఆనంద్, లక్నారెడ్డి, బోధనం నర్సిరెడ్డి, గుడిహాళం రఘునాథం, మర్రి విజయ రావు, సౌరా, గుంటూరు ఏసుపాదం, కె. నర్సింహాచారి సర్కిల్‌తో కలిసి నడిచిండ్రు.

ఇంకొక రకంగా చెప్పాలంటే మూల పురుషులయినారు. నల్లగొండ ఒక సాహిత్య కేంద్రంగా విరాజిల్లింది.

**సాహిత్య సంస్థల ఏర్పాటులో, నడపడంలో ఏయే ఇబ్బందులు వస్తాయి? ఎలా అధిగమించాలి? మీరెలా అధిగమించారు?**

నిబద్దత కనీసం సాహిత్య నిబద్ధత ఉంటే సాహిత్య సంస్థలను ఏర్పాటు చేయడం సులువే. కాని నడపడంలోనే కష్టాలుంటయి. ఒక రాజకీయ దృక్పథం నాయకత్వ స్థానంలో ఉంటే, దానికి కింది నుంచి మీదిదాకా ఒక నిర్మాణముంటుంది కాబట్టి సంస్థలను నడపటం కాస్త సులువు. అక్కడా వ్యక్తిగత అహాలు ఉంటవి. రాజకీయ నిర్మాణం లేకుండా కేవలం తాత్త్విక అవగాహనతో ఉండే సంస్థల్ని నడపడం చాలా కష్టం. సంస్థలే మూతబడే పరిస్థితి ఏర్పడుతుంది. నేను భాగస్వామి నైన నాలుగయిదు సంస్థల నిర్వహణలో ఈ రెండురకాల అనుభవాల్ని చూసిన. అయితే పని చేసుకుంటూ పోతే అవే సర్దుకుంటాయి అనే పద్ధతి ద్వారా ఈ ఇబ్బందుల్ని కొంత అధిగమించిన. అసంతృప్తికి గురైన, కలవరపడిన కలత చెందిన. ఆధునికానంతర బహుళత్వ తాత్వికతతో సమాధానపడిన.

**'ముంగిలి' తరువాత ఇంకా ఏమైనా విస్మృత రచయితలు వెలుగులోకి వచ్చారా? రాకపోతే ఎందుకు రాలేదు? మీ తరువాత దాని కొనసాగింపుగా ఎవరూ పరిశోధన చేయలేదా?**

'ముంగిలి' తర్వాత నాదగ్గర 'నల్లగొండ జిల్లా ప్రాచీన సాహిత్యం అనే అంశంతో పిహెచ్.డి. చేసిన శ్రీనివాసాచారి ఒక విస్మృత కవిని వెలుగులోకి తెచ్చిండు. మల్లికార్జున అనే ఇంకొక పరిశోధకుడు 'ముంగిలి'ని దాటడం కష్టంగా ఉంది సార్ అన్నడు. గట్టి పరిశోధకుడు ఒకరిద్దరు విస్మృత కవుల్ని వెలుగులోకి తెచ్చిండు. ఈ తరం పిల్లలు కష్టపడడానికిష్టపడడం లేదు. సునాయాస సంపాదనకు అలవాటుపడుతున్నరు. ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు 'ముంగిలి'

మిగిల్చిన కర్తవ్యాన్ని పూర్తి చేస్తరు.

**వామపక్ష శిబిరాల నుంచి వచ్చిన విమర్శనే లేదా వాళ్ళు స్థిరీకరించిన విషయాలకే ఆమోదనీయత ఎక్కువ ఉన్నది. దీన్నెలా చూడాలి?**

బరువైన ప్రశ్న. లోతైన ప్రశ్న. తెలుగు సాహిత్య విమర్శ ప్రస్థానాన్ని సమీక్షించాల్సిన ప్రశ్న. తెలుగు సాహిత్య విమర్శ ఆధునిక పూర్వ, ఆధునిక, ఆధునికానంతర విమర్శ అనే మూడు ప్రస్థానాలుగా సాగింది. కట్టమంచి, సురవరం ఆధునిక పూర్వ విమర్శను చీల్చి చెండాడి వర్తమానంలో నిలబెట్టినారు. వీళ్ళు తొలి ఆధునిక విమర్శకులు, తొలి చారిత్రక విమర్శకులు. వారి కొనసాగింపుగా వామపక్ష శిబిర విమర్శ అంటే మార్క్సిస్టు విమర్శ వచ్చింది. దీనికి "ఆమోదనీయత ఎక్కువ ఉన్నది" అనేది సత్యమే. మార్క్సిస్ట్ విమర్శ సాహిత్యాన్ని స్వీయాత్మకంగా కాక నిర్మమకారంగా, వస్తుగతంగా చూస్తుందని, సాహిత్యాన్ని కేవల సాహిత్యంగానే కాక సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత, చారిత్రక,తాత్విక మొదలైన సంబంధాలనుంచి చూస్తుందని అందువల్ల అది పురోగామి విమర్శ, శాస్త్రీయ విమర్శ అని ఆ విమర్శకులు, అనుయాయులు భావిస్తారు. అందుకే ఆమోదనీయత. 1930, 40 దశకాల నుంచి అస్తిత్వ ఉద్యమాలు వచ్చేంతవరకు తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు దృక్పథానిదే పైచేయి. దానికొక నిర్మాణ ముంది. నిర్మాణానికి లోన వున్నవారు సరే, అవతల ఉన్నవారు కూడా శిరసావహించవలసిన స్థితి. అందుకే ఆమోదనీయత. ఆధునికానంతర విమర్శ వచ్చిన తర్వాత, మార్క్సిస్టు విమర్శ చెప్పినదంతా సత్యం కానక్కర్లేదనే విశ్లేషణ విస్తరించిన తర్వాత ఆ నిష్పత్తిలో ఆమోదనీయత తగ్గింది. కాబట్టి ఏదీ అంతిమసత్యం కాదు. నిరంతర అన్వేషణ జరగాల్సిందే.

**'బహువచనం' నాటికే సబాల్టర్న్ స్టడీస్ మీద దృష్టి పెట్టారు మీరు. అయినా ఇప్పటికీ ఆ వర్గాలవారి సాహిత్యానికి సరైన గుర్తింపు రావడం లేదు. ఎందుకలా? ఏ దిశగా ఆ వర్గాలు కృషి చేయాలి?**

'బహువచనం' నాటికి పదేళ్ళముందు నుంచే తాత్వికరంగంలో కొత్త చర్చ మొదలైంది. కొత్త అన్వేషణ మొదలైంది. అందులో నేనొకణ్ణి మాత్రమే. ఆ అన్వేషణలో ఎస్.యు.సి.ఐ. సభలకు కలకత్త వెళ్ళిన. ఢిల్లీ వెళ్లిన. శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ఎ.పి.సి.ఎల్.సి.ల పునరుద్ధరణ కోసం బాలగోపాల్ గారితో పర్యటించినప్పుడు ఆయనతో చర్చలు చేసిన. అదేక్రమంలో పోస్ట్ మోడర్న్, సబాల్టర్న్ గ్రంథాల్ని చదివిన. ఈ అన్వేషణ బాలగోపాల్‌తో పాటు చాలామంది చేసినరు. అందులో నేనొకణ్ణి మాత్రమే. ఈ అన్నిటి ఫలితమే అస్తిత్వోద్యమాలు. సబాల్టర్న్ స్టడీస్ అన్వయింపు బెంగాల్‌లో జరిగినట్లు తెలుగులో జరగడం లేదు. అలాంటి కృషి చేసేవాళ్ళే కరువైనారు. సంగిశెట్టి శ్రీనివాస్, నాలాంటి వాళ్ళు చేస్తున్న కృషితో అణగారిన వర్గాల విస్మృత సాహిత్యం కొంత వెలుగులోకి వస్తున్నది. దున్న ఇద్దాసు, దైదవేములపల్లి దేవేందర్ లాంటివాళ్ళు అట్లా వెలుగు చూసినారు. ఆ దిశగా మరింతమంది కృషి చేయాలి.



**ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో మీ పాత్ర ఏమిటి? తెలంగాణ సాహిత్యానికి మీ యోగదానం ఏమిటి?**

అంబటి సురేంద్రరాజు, కె. శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, స్కైబాబ, జగన్‌రెడ్డి, అనిశెట్టి రజిత, మల్లెపల్లి లక్ష్మయ్య, ఎస్వీ, తూర్పు మల్లారెడ్డి తదితరులతో కలిసి 'తెలంగాణ సాంస్కృతిక వేదిక'ను ఉద్యమ ప్రారంభ సంవత్సరాల్లోనే స్థాపించినం. ఇది తెలంగాణ సాంస్కృతిక రంగానికి దిశానిర్దేశం చేసింది. 1969 ఉద్యమం కన్న భిన్నంగా మలిదశ ఉద్యమంలో భావజాలయుద్ధం తీవ్రంగా జరిగింది. సమైక్య వాదులకు 1969 ఉద్యమంనాడు లభించినట్లు తెలంగాణ లోపలినుంచి నైతిక మద్దతు లభించకుండా ఈ భావజాల యుద్ధం ఆపగలిగింది. సమైక్య వాదుల ఆత్మవిశ్వాసాన్ని చావుదెబ్బ తీసింది. అందుకే తెలంగాణ గెలిచింది. ఈ యుద్ధంలో నావంతు కృషి చేసిన. తెలంగాణ కేవలం సెంటిమెంట్ అని చారిత్రకంగా తెలంగాణకు ప్రత్యేక అస్తిత్వం లేదని, ఉమ్మడి అస్తిత్వమే ఉన్నదని సమైక్యాంధ్ర సెంటిమెంట్‌ను తీవ్రంగా రగిల్చే ప్రయత్నం చేసినారు. ఈ వాదం చేసిన దగ్గుపాటి వెంకటేశ్వరరావు, ఆంజనేయరెడ్డి ఐపిఎస్, లగడపాటి, చంద్రబాబు, మేంద్ర

రాములు, వక్కలంక, అప్పటి విద్యామంత్రి సొకే శైలజానాథ్‌లాంటి అనేక మందికి. నేను సొంతగానూ, 'సింగిడి'తో కలిసీ అనేక వ్యాసాలు, సమాధానాలు, కరపత్రాలు రాసిన. కమ్యూనిస్టుల వైఖరిని ఖండిస్తూ వారి వాదనలోని డొల్లతనాన్ని బయటపెడుతూ నేను, సంగిశెట్టి, శ్రీధర్ దేశ్‌పాండే తదితరులం "కమ్యూనిజమా కోస్తావాదమా?" అనే పుస్తకాన్ని వెలువరించినం. దీంతో కమ్యూనిస్టులు తెలంగాణ వ్యతిరేక వైఖరిని తగ్గించు కున్నారు. చారిత్రకంగా తెలంగాణ అస్తిత్వాన్ని విశిష్టతను ఔన్నత్యాన్ని నిరూపిస్తూ 'తెలంగాణ చరిత్ర' గ్రంథాన్ని రాసిన.

తెలంగాణ సాహిత్య విశిష్టతను అస్తిత్వాన్ని నిరూపిస్తూ 'ముంగిలి' పేరుతో తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్రను రాసిన. విస్మృత సాహిత్యాన్ని వెలుగులోకి తెస్తూ అనేక సాహిత్య వ్యాసాలు రాసిన వాటిలో కొన్నింటిని 'గనుమ' పుస్తకంగా తెచ్చిన. మిగతా వ్యాసాలను 'వినిర్మాణం' పేరుతో పుస్తకంగా తెస్తున్న. తెలంగాణ ఆధునిక కవిత్వ విశిష్టతను నిరూపిస్తూ అంబటి సురేంద్రరాజుతో కలిసి 'మత్తడి' అనే కవితా సంకలనాన్ని తెచ్చిన. సంగిశెట్టి, నేను కలిసి "1969-73 తెలంగాణ ఉద్యమ కవిత్వం' ప్రచురించి అప్పుడు కవిత్వం రాలేదనే అపప్రథను తొలగించినం. మేమిద్దరమే "సురవరం తెలంగాణ వ్యాసాలు" వేసినం.

తొలినాళ్ళలోనే తెలంగాణ దీర్ఘకవిత 'దాలి' రాసిన. బాగా ప్రసిద్ధిగాంచిన "నల్లవలస" దీర్ఘ కవిత గుడిహాళం, కె. శ్రీనివాస్, శివకుమార్‌లతో కలిసి రాసిన. ఇంకా అనేక తెలంగాణ కవితలతో 'తావు' సంపుటి వెలువరించిన. 'తెలంగాణ ప్రచురణ'ల తరపున విశిష్టమైన 34 తెలంగాణ పుస్తకాలను బి. నరసింగరావు, సంగిశెట్టి, కాసుల ప్రతాపరెడ్డితో కలిసి ప్రచురించినం.

**మీ తెలంగాణ వాదాన్ని మిగతా సాహిత్య శిబిరాలు ఎలా చూశాయి? పత్రికాముఖంగానే వాదోపవాదాలు జరిగాయి కదా! వాటి గురించి చెప్పండి?**

**మాది వ్యావసాయిక మధ్యతరగతి కుటుంబం. ఇంటిల్లిపాది శెలకల్లో పొలంలో పనిచేసే వ్యవసాయ జీవితం. నల్లగొండ జిల్లా కనగల్లు మండలంలోని పగిడిమర్రి మా ఊరు. మా వూరి దొరలు కాక అక్షర జ్ఞానం ఉన్న కొద్దిమందిలో మా నాయనొకడు. 5, 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోయన్‌పల్లి అనే వూరిలో ఒక ముస్లిం పంతులు వద్ద గిద్దెలొడ్సు (వడ్ల లెక్క), బొట్లొడ్సు (పైసల లెక్క) చదువుకుండు.**



మిగతా 'సాహిత్య శిబిరాలు', అంటే మీరు ఎవరిని ఉద్దేశించి అన్నారు? బహుశా వామపక్ష సాహిత్య శిబిరాలను ఉద్దేశించి అన్నట్టున్నారు. అన్నీ మా ఆధ్వర్యంలోనే జరగాలనే పెత్తందారీతనం వాటికుండేది. "తెలంగాణ సాంస్కృతిక వేదిక"ను స్థాపించడం వారికి నచ్చలేదు. వాళ్ళు, వేరే వేదికను పెట్టుకున్నరు. 'మత్తడి' విషయమూ అంతే. సొంత గొంతుకలు తలెత్తడం సహించలేక ఒక 'కరపత్రం' సాకుతో మామీద దాడులు చేసినారు. ఆ వివరాలు ప్రస్తుతం అవసరం లేదనుకుంటా.

**'ట్యాంక్‌బండ్ మీద విగ్రహాలన్నీ మీవి, హుస్సేన్‌సాగర్‌లో శవాలన్నీ మావి' అని రాశారు కదా! తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఇంకా 'ఆంధ్ర' వాసనలు పోవడం లేదు. ఉదాహరణకు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పుతో పాటు ఇంకా చాలా విగ్రహాలు, ఆనవాళ్ళు ఉన్నాయి. ఇది తెలంగాణ అస్తిత్వానికి భంగకరం కాదా? దీన్నెలా చూడాలి? మీ సూచనలు ఏమిటి?**

అవును. ముమ్మాటికీ తెలంగాణ అస్తిత్వానికి భంగకరమే. అస్తిత్వాన్ని నిలబెట్టటానికి ఇంకా చేయవలసింది చాలా ఉంది. తెలంగాణ సోయిని అందరూ కోల్పోతున్నరు. ఇటీవల అనేక జూమ్ మీటింగ్‌లు, సెమినార్లు జరిగినవి. అందులో ఒక్కటీ తెలంగాణ అంశం మీద లేదు. ప్రస్తుతం 'తంగేడు' ఒక్కటే ఆ స్థాయిలో నడుస్తున్నది. ఇంకా ఐదు పది సంవత్సరాలు తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టే కృషి జరగాలె. మరుగునపడిన వందలాది పుస్తకాలు వెలువరించే పని జరగాలె. సీమాంధ్ర కవుల పేర్లు, వారి కవిత్వ పాదాలు, రచయితల పేర్లు మన నాలుకల మీద ఆడినట్లు తెలంగాణ కవుల పేర్లు వారి కవిత్వ పాదాలు మన నాలుకల మీద ఆడాలె. అందుకు తెలంగాణ సాహిత్యాన్ని విరివిగా ప్రచారం చేయాలె. ఊరూరా నిరంతరం సాహిత్య సమావేశాల్ని నిర్వహించాలె. తెలంగాణ చరిత్రను,తెలంగాణ సాహిత్య చరిత్రను మైక్రోలెవల్‌లో సంపుటాలుగా రాయించి ప్రచురించాలె. దీనంతటికి నిరంతరం నడిచే ఒక వ్యవస్థ నేర్పాటుచేయాలె. లేదా తెలుగు అకాడమీలో గాని, తెలుగు విశ్వవిద్యాలయంలో గాని శాశ్వత విభాగాన్నేర్పాటుచేయాలి.

**తెలుగు విమర్శ ఎలా ఉంది? తెలంగాణ విమర్శ ఎలా ఉంది? ఇంకెలా ఉంటే బావుంటుంది?**

పాతమాటే మళ్ళీ చెప్పాలె. తెలుగులో విమర్శ దీపం చిన్నది. తెలంగాణలో మరింత చిన్నది. ఏరీ ఆ దిగ్గజాలు? కట్టమంచి, సురవరం, రాళ్ళపల్లి, పాములపర్తి సదాశివరావు, రా.రా., కె.వి.ఆర్, త్రిపురనేని, బాలగోపాల్,సంపత్కుమార,సుప్రసన్న.... సరే, తర్వాతి తరం? గుంటూరు లక్ష్మీనరసయ్య అక్కడినుంచి, ఇక్కడ నుంచి సురేంద్రరాజు, కె. శ్రీనివాస్, గుడిపాటి, కాసుల ప్రతాపరెడ్డి, సంగిశెట్టి, ఎన్. వేణుగోపాల్, జిలుకర శ్రీనివాస్,పెన్నా శివరామకృష్ణ, కాంచనపల్లి, పసునూరు రవీందర్, పగడాల నాగేందర్, సీతారాం, కాశీం ఉన్నారు. నాలాగా పార్ట్‌టైం విమర్శకులు ఎందరో... పూర్తిస్థాయి (ఫుల్‌టైమ్) విమర్శకులు కావాలె. ముఖ్యంగా కవులుకాని విమర్శకులు కావాలె, గుర్రం సీతారాం లాంటివాళ్ళు. సాగర్ల సత్తయ్య, తగుళ్ళ గోపాల్ లాంటి, మీలాంటి కొత్తతరం విమర్శకులు రావాలె. నాలుగేళ్ళ క్రితం రాసిన ఒక వ్యాసంలోని వాక్యాల్ని రిపీట్ చేస్త. 'తెలంగాణ సాహిత్య విమర్శ ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అప్‌డేట్ కావాల్సి ఉంది. కొత్త విమర్శకుల ఆవశ్యకత ఎంతో ఉంది'.

**నేను, సంగిశెట్టి శ్రీనివాస్ కలిసి ప్రతియేటా తెలంగాణ కథా వార్షికలను తెస్తున్న సంగతి మీకు తెలుసు కదా! అలా కవిత్వ వార్షికలు ఎందుకు రావడం లేదు. లోపం ఎవరిది?**

మీరిరువురు చేస్తున్న పని గొప్పది. తెలంగాణ కథాసాహిత్య ఉనికిని నిలబెట్టేది. ఇష్టపూర్తి అభినందనలు. 'మత్తడి' ప్రచురణ పూర్తికాగానే ఏటా కవిత్వ వార్షికలు తెద్దామనుకున్నం. 'ముంగిలి', 'తెలంగాణ చరిత్ర' రచనలో పడి కుదరలేదు. 'మత్తడి'ని 2014దాకా విస్తరించి ప్రచురించిన తర్వాత తెద్దామనుకున్నం. అదీ కాలేదు. సుంకర రమేశ్, వేనేపల్లి పాండురంగారావు సహకారంతో కొన్ని వార్షిక సంచికలు తెచ్చిండు. మరొకరు ఆ బాధ్యత తీసుకోవాలె. భయపడుతున్నట్టున్నరు. ఎందుకంటె కవులకు అహం ఎక్కువ. తమ కవిత వేయకపోతే గాలిగాలి అయితరు. గాయిగాయి చేస్తరు. ఆదరణ లేకపోవడం మరొక కారణం. కవిత వచ్చినోడు దప్ప వాటినెవడు చూస్తలేడు. ఎన్ని ఇబ్బందులున్నా 'కవిత్వ వార్షిక' ఆవశ్యకత అయితే ఉంది.

**తెలంగాణ సాహిత్యరంగంలో పూరించాల్సిన ఖాళీలు పూరింపబడ్డాయా? ఇంకా ఏ దిశగా కృషి చేయాలి?**

పూరించాల్సిన ఖాళీలు చాల ఉన్నయి. అనేక గ్రంథాలు సేకరించాల్సి ఉంది. పరిష్కరించి ప్రచురించాల్సి ఉంది. ఉదాహరణకు తెలంగాణలోనే కాదు, తెలుగులోనే తొలి నవలలుగా భావించబడుతున్న తడకమళ్ళ కృష్ణారావు గారి కామరూప చరిత్ర, కంబుకంధర చరిత్రలు. ఇంకా ఎన్నో. 1890-1944 వరకు గల విస్తృత సాహిత్యం ఎంతో ఉంది. దాన్ని వెలికి తీయాలి.

1944 నుంచి, 1970 నుంచి కూడా వామపక్షేతర సాహిత్యం ఎంతో వెలుగుచూడాల్సి వుంది. తెలంగాణ నాటకం గురించి తెలిసింది చాలా తక్కువ. దాన్ని వెలికితీయాలె. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును ఆహ్వానించిన సాహిత్యం కొంతైనా వెలుగు చూసింది. దాన్ని వ్యతిరేకించిన సాహిత్యం వెలికి రాలేదు. ఆంధ్రప్రాంతాన్ని కూడా ప్రభావితం చేసిన తెలంగాణ దళిత చైతన్యం 1948 ముఖ్యంగా 1956 తర్వాత ఎందుకు ఆగిందో శోధించాలె. ఇంకా ఎన్నో ఉన్నవి. దీనికోసం సంగిశెట్టి 'వన్ మెన్ ఆర్మీ'గా శ్రమిస్తున్నాడు. అది చాలదు. ఇందుకోసం ఒక పరిశోధనా వ్యవస్థ నేర్పాటు చేయాలె. మద్రాసు, ఇంగ్లాండు, తిరుపతి తదితర చోట్ల ఉన్న తెలంగాణ సాహిత్య సంపదనంతా తీసుకురావాలె. కొత్త నిబద్ధతా పరిశోధకులు రావాలె. ఇదంతా పరిశోధనకు సంబంధించి, విశ్లేషణకు సంబంధించిన ఖాళీలెన్నో.

**చాలాసార్లు మీ పేరు కేంద్రసాహిత్య అకాడమి అవార్డు కోసం ప్రతిపాదింపబడినట్టు వినికిడి. అయినా మీకు అవార్డు రాలేదు. దాని వెనక ఏవైనా రాజకీయాలు ఉన్నాయనుకుంటున్నారా?**

'ముంగిలి' రెండుసార్లు, 'తెలంగాణ చరిత్ర' ఒకసారి ఫైనల్‌కు వచ్చినట్లు వినికిడి. ఫైరవీలో, సీమాంధ్ర రాజకీయాలో తెలియదు. అప్పుడు మాత్రం సీమాంధ్రులకే వచ్చినవి. 'ముంగిలి'కి కేసీఆర్ తదితర పెద్దల ప్రశంస, "తెలంగాణ చరిత్ర"ను కేసీఆర్ ఆవిష్కరించడం, తెలంగాణ రాష్ట్ర ప్రథమ అవతరణ రోజున మొదటిసారి రాష్ట్ర ఉత్తమ సాహితీవేత్త అవార్డు రావడం, వేలాది పాఠకుల ఆదరణ సాహిత్య అకాడమి అవార్డు కంటె మిన్న. అది చాలు.

**మీ సమకాలికులు, మీకన్నా జూనియర్లు చాలా మంది విశ్వవిద్యాలయాల్లో పనిచేశారు కదా! ఎప్పుడైనా అసంతృప్తిగా ఫీలయ్యారా?**

నిజం చెప్పాలంటే అసంతృప్తి చెందినమాట వాస్తవం. "యూనివర్సిటీల బయట ఉన్నందువల్లనే యూనివర్సిటీ చేయాల్సినంత పని చేయగల్గిండ్రని" మిత్రులు, విశ్లేషకుల ప్రశంసతో ఆ అసంతృప్తి మాయమైంది.

**2017లో తెలుగు ప్రపంచ మహాసభల సందర్భంగా ఒకేసారి 30 పుస్తకాలు వేశారు కదా! ఆ మేరకు పుస్తకాలు అమ్ముడుపోతున్నాయా? సాహిత్యానికి ఆదరణ ఉందా?**

పాఠకుల ఆదరణ తక్కువనే చెప్పాలె. ప్రభుత్వమే పూనుకొని ఇలాంటి పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని (స్కూళ్ళు, కళాశాలలతో సహా) గ్రంథాలయాలకు చేరే ప్రయత్నం చేయాలె. అప్పుడే తెలంగాణ సాహిత్యం విస్తృతంగా ప్రచారం కాగలదు.

**మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?**

సంగిశెట్టి తంగెడు కిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినట్టు రెండు బృహత్తర ప్రణాళికల్లో ఉన్నం.

వ్యాసం

# తెలంగాణ సాహిత్యానికి సమతల దర్పణం

సాహిత్యం సమాజానికి దర్పణంలాంటిది అని తెలిపే వ్యాసం...




డా. ఏనుగు నరసింహారెడ్డి
89788 69183


ఆంగ్లభాషా ప్రభావం ప్రాచ్య భాషల మీద ఎంత ఉందనేది చెప్పేందుకు భూమ్మీదున్న కొలమానాలేవీ పనిజేయవు. ఆంగ్ల భాషా సాహిత్యాల ప్రభావం భారతీయ సాహిత్యాలకు ఏదైనా నష్టం చేసిందంటే అది పిపీలికం పరిమాణం. అదిచ్చిన కొత్తచూపు, సృజన, గవేషణ శక్తి, ప్రజాస్వామీకరణ యొక్క ప్రధాన అంశం ఆధునిక కథ. నవల, వ్యాసం దాని ఫలితమే. కవిత్వంలో కూడా రూప పరంగానూ వస్తు స్వీకారంలోనూ కొత్త తొవ్వలు పరిచిందది. ఆంగ్లభాషను భారతదేశంలో ప్రవేశపెడుతున్న సందర్భంగా మెకాలే తన తండ్రికి రాసిన ఉత్తరంలో 'ఈ విధానం ద్వారా రూపంలో, ఆకారంలో భారతీయులుగా ఉండి మానసికంగా, ఆలోచనా పరంగా అంగ్లేయులుగా ఉండగలిగే ఒక కొత్త తరాన్ని తయారు చేయబోతున్నా' నంటాడు. ఆంగ్లంలోనైనా, తెలుగులోనైనా మరే భాషలోనైనా వ్యాసం ప్రయోజనమే లక్ష్యంగా విలసిల్లుతూ ఉన్న వాఙ్మయ రూపం. పరిశోధన వ్యాసానికి పరాకాష్ట.

పరిశోధన ప్రయోజనం గురించి చాలా నిర్వచనాలున్నాయి. విశ్వవిద్యాలయాలలో నిరంతరం సాహిత్య పరిశోధనలు జరుగుతుంటాయి కాబట్టి పరిశోధన గురించిన చర్చ జరుగుతూ ఉంటుంది. వ్యాసాల పరిస్థితి వేరు. అయితే చాలా వ్యాసాలూ పరిశోధనాత్మకంగా రాసిన వారున్నారు. పరిశోధనను వ్యాసం స్థాయికి దించిన వారూ ఉంటారు. చాలామంది పరిశోధన, వ్యాసం అన్నదమ్ముల్లాంటివని అంటూ ఉంటారు. అది నిజం కాదు. 'పరిశోధన అంటే మిక్కిలి శోధన అని శబ్దరత్నాకరంలో ఉంది. శాస్త్రీయ అధ్యయనం చేసి కొత్త అంశాన్ని కనుగొనే ప్రయత్నంగానూ, ఏదైనా విషయాన్ని ఆమూలాగ్రంగాను పరిశీలించి, ఫలితాలను నిరూపించడం'గా అకాడమీ నిఘంటువు పేర్కొంటుందని డా॥ రాయరావు సూర్యప్రకాశ్ రావు 'పరిశోధకులకు కొండంత అండ, నిత్యానందరావు వెలుదండ' అనే వ్యాసంలో పేర్కొన్నాడు. అంటే పరిశోధనను 'దత్తాంశాల ఆధారంగా ఒక విషయానికి వెనుక ఉన్న కారణ సిద్ధాంతం'గా చెప్పవచ్చు. వ్యాసం ఇందుకు భిన్నంగా దత్తాంశాలను ఉటంకిస్తూ, విశ్లేషిస్తూ ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తుంది. ఒక క్రోడీకరణకు పూనుకుంటుంది. వ్యాసం ద్వారా విస్తృతమైన సమాచారం అందివ్వ బడుతుంది. వ్యాసాల సంకలనం ఈ పనిని మరింత విస్తృతపరుస్తుంది. సంకలనంలో ఉన్న విభిన్న వ్యాసాలలో పాఠకుడికి తెలిసిన అంశాలపై, తెలియని అంశాలపై కూడా వ్యాసాలుంటాయి. వ్యక్తుల గురించి రాసే వ్యాసాలలో ఈ ధోరణి మరింత ఎక్కువ. పాఠకుడికి మరింత ప్రయోజనాత్మకం. వ్యక్తుల గురించిన వ్యాసాల సంపుటిలో తెలిసిన వ్యక్తుల గురించి తెలియని విషయాలు ఉంటాయి. మనం ఆశ్చర్య పోయేటట్లు అప్పుడప్పుడు తెలియని వ్యక్తుల గురించి తెలిసిన విషయాలూ ఎదురవుతుంటాయి. అందుకే వ్యాసాన్ని 'A short literary composition of an analytical, interpretive, or reflective kind, dealing with its subject in a non technical, limited, often unsystematic way and, usually, expressive of the author outlook and personality' అంటారు. రచయిత దృక్పథం, అభిరుచి ప్రధానంగా వ్యాసం కొనసాగుతుంది. ఈ సంపుటి రచయిత రాయరావుకు ఈ నిర్వచనం పూర్తిగా సూట్ అవుతుంది. వ్యాసాలు నాలుగు రకాలు. 1. విశదపరిచేవి 2. వివరించేవి 3. సమాచారమిచ్చేవి 4. తర్కించేవి.

డా॥ రాయరావు సూర్యప్రకాష్ రావు పరిశోధకుడు, వ్యాసకర్త, కవి. ప్రస్తుత వ్యాస సంకలనం కంటే ముందు జర్నలిస్టుగా, పరిపాలకుడుగా అనుభవ మున్నవాడు. ఉపాధ్యాయుడిగా అధ్యయనం అధ్యాపనం కొనసాగిస్తూ ఉండడంతోపాటు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా,

వ్యాఖ్యాతగా, న్యూస్ రీడర్‌గా, అనువాదకుడిగా కూడా పనిచేస్తూ ఉన్నాడు. పెబ్లో నెరూడా చెప్పినట్లు ఒక రచయిత సజీవంగా ఉండాలంటే ఏమేం క్రియలు చేయాలో అవన్నీ చేయక తప్పని పరిస్థితిని రాయరావు తనకు తానుగా కల్పించుకున్నాడు. కొత్త గ్రంథాల్ని చదవడం, కొత్త వ్యక్తుల్ని కలవడం, కొత్త ప్రదేశాల్ని చూడడం, కొత్త అనుభవాలకు నిరంతరం గురి అవుతూ ఉండడం వల్ల ఈ రచయిత జాగరూకతతో ఉన్నాడు. ఆ జాగరూకత నుండే ఇతనికొక శైలి ఏర్పడింది. నాలుగు రకాల వ్యాస లక్షణాల సమన్వయం ఈ సంపుటిలో కనిపిస్తుంది.

ఈ సంపుటిలో నలభైదాకా ఉన్న వ్యాసాలలో లక్ష్యం సమాచార వ్యక్తీకరణే అయినప్పటికీ విషయాన్ని లోతుగా వివరించే వ్యాసాలున్నాయి. పరిశోధనాత్మకంగా వ్యక్తీకరించేవి ఉన్నాయి, తర్కానికి చర్చకూ దిగిన వ్యాసాలూ ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఒకే వ్యాసంలో అన్నీ కలిసి కూడా ఉండడం కనిపిస్తుంది. ఇందులో వ్యక్తులపై కాకుండా సాహిత్యాంశలపై రాయబడ్డ వ్యాసాలు కొన్ని ఉన్నాయి. వ్యాసం రాయబడ్డ వాళ్ళందరూ సాహిత్యకారులే. వారిలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, బంగ్లా, కన్నడ రచయితలున్నారు. సాహిత్య అనుబంధ వృత్తుల (Literature Allied Professions) రచయితలు ఉన్నారు. సాహిత్య అనుబంధేతర వృత్తుల (Odd Professions) రచయితలు కూడా ఉన్నారు.

వనపర్తి ప్రాంత సంస్థానాలు-సాహిత్య పోషణ, నిత్యవెలుగుల సారస్వత క్షేత్రం, ఒకటిన్నర శతాబ్దాల తెలంగాణా నవల, రంగారెడ్డి జిల్లా నవలా సాహిత్యం, కరోనా కవితాఝరి మోగిన సమరభేరి అన్న వ్యాసాలు సంపుటిలో భిన్నమైనవి. 1948 సెప్టెంబరు వరకు తెలంగాణలో సంస్థానాలే పాలనా కేంద్రాలన్న సంగతిని గమనిస్తే ప్రధానమైన అసఫ్ జాహీలకు లోబడి పాలించినా కేంద్ర సంస్థానానికి పేచీలేని పనులెన్నో స్థానిక సంస్థానాలు నిర్వర్తించాయి. ఆ పనుల్లో ప్రధానమైనది సారస్వత సేవ. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వనపర్తి, గద్వాల, అమరచింత, జటప్రోలు, గోపాల్ పేట పాలకుల మద్దతుతో వెలువడిన సాహిత్యం తక్కువదేమీ కాదని చెప్పడం వనపర్తి వ్యాసంలోని ఉద్దేశ్యం అనుకోవడానికి వీలు లేదు. వనపర్తి సంస్థానోద్యోగి మొత్తం తెలంగాణా అంతటా తిరిగి 400 శాసనాలను సేకరించి 'లిథిక్ రికార్డ్స్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్' పేరుతో ప్రచురించడం కూడా చెప్పడం ఈ రచయిత ఉద్దేశ్యం. సంస్థానాలలోనే బహుభాషా నిఘంటువులు కూడా వెలువడ్డాయన్న సంగతి చెప్పడం ద్వారా సంస్థానాల సేవ రాష్ట్రవ్యాప్త ప్రభావం ఉన్నదని చెప్పడం రచయిత ఉద్దేశ్యం. ప్రస్తుత తెలంగాణా సారస్వత పరిషత్తు నిజాం పాలన నుండి ఇప్పటి వరకూ చేసిన సారస్వత సేవను వివరించడం అనేక చారిత్రక కోణాలను ఆవిష్కరిస్తుంది. ఒకనాడు నిజామాంధ్ర, కొన్నాళ్ళకు నిజాం మాటను తొలిగించిన ఆంధ్ర, ప్రస్తుతం ఆంధ్రను తొలగించిన తెలంగాణా నామాలను ధరించడానికి కారణాలు చెబితే మొత్తం చరిత్ర అవగతమవుతుంది. తెలంగాణా నవల మీద, రంగారెడ్డి నవల మీద రాసిన వ్యాసాలు దాదాపు తెలంగాణా నవలా వికాసాన్ని అవగతం చేయిస్తాయి. కరోనా కాలం ఇచ్చిన వెసులుబాటు, భయం వల్ల వెల్లువెత్తిన కవిత్వాన్ని ప్రచురించడానికి ఏ పత్రికా సరిపోలేదు. అందుకు ప్రత్యామ్నాయంగా యూట్యూబ్‌లో ఎవరికి వాళ్ళు చదివి ఒక వేదిక మీద అప్లోడ్ చేయడం వల్ల కనిపించిన కవిత్వాన్ని విశ్లేషించిన వ్యాసం ద్వారా కరోనాపట్ల భయాల స్థాయి, అవగాహన పరిధి, తీసుకోవలసిన జాగరూగతలను చెప్పిన కవిత్వాన్ని విశ్లేషించాడు రచయిత.

నోబెల్ బహుమతి ఎంపిక విధానాన్ని వివాదాస్పదం చేసిన ఆస్ట్రియాకు చెందిన పీటర్ హండ్కేకు 2019లో అదే నోబెల్ బహుమతిని ప్రకటించడంతో ఆశ్చర్యపోయిన రాయరావు తెలుగు పాఠకుల కోసం ఆయన వివాదాస్పదతను, సాహిత్య శక్తినీ విశ్లేషిస్తూ రాసిన వ్యాసం ఇందులో ఉంది. భారతీయాంగ్ల సాహిత్యంలో తొలిసారి జ్ఞానపీఠం పొందిన అమితావ్ ఘోష్ రచనలను పరిచయం చేస్తూ సవివరమైన వ్యాసం రాసాడు. అటల్ బిహారీ వాజ్‌పేయి హిందీ కవిత్వంలోని భావావేశాన్ని తెలుగులో అర్థవంతంగా రాశాడీ రచయిత. 'మౌత్ కా ఉమర్ దో పల్ భీ నహీం' అన్న వాజపేయి మాటను గుర్తుచేస్తూ

'చావుతో పోట్లాడాలని లేదు
కానీ మరణం నా దారికి అడ్డంగా
వచ్చింది
తన కౌగిలిలోకి తీసుకొని
నా నుదుటిపై ముద్దు పెట్టింది'

అంటూ అమెరికాలో వైద్య చికిత్స పొందుతున్నపుడు రాసిన కవితను ఉటంకించాడు. సినారె పురస్కారాన్ని స్వీకరించిన కన్నడ కవి, సాహిత్య అకాడెమీ అధ్యక్షుడు చంద్రశేఖర కంబార జీవితం, రచనలపై విమర్శనాత్మక వ్యాసం

**పారిశ్రామిక వేత్తగా నిలదొక్కుకున్న తర్వాత 50 సంవత్సరాల వయసులో కథలు రాయడం ప్రారంభించిన సోమరాజు సుశీల వెనుదిరిగి చూడలేదని 'ఇల్లేరమ్మ కతలు' శీర్షికతో రాసిన జీవిత చరిత్ర సహజమైన హాస్యంలో నడిచి ప్రసిద్ధి పొందిందని చెప్పాడు. అటు సంప్రదాయం, ఇటు మార్క్సిజం రెంటినీ ఇష్టపడ్డ వ్యక్తిగా రంగాచార్యను సరిగ్గా అంచనా వేసాడు. గోరేటి వెంకన్న కవిత్వంలోని తాత్వికతను, ఏనుగు నరసింహారెడ్డి కవిత్వంలోని సామాన్యుడి ఇజాన్ని, ఆదేశ్ రవిలోని ధ్వనిశాస్త్ర పరిజ్ఞానాన్ని, మామిడి హరికృష్ణలోని భిన్నభాషల వాతావరణాన్ని పొదివి పట్టుకొని వ్యాసాలను రాసాడు.**

రాసాడు. ప్రసిద్ధ బెంగాలీ రచయిత్రి నవ్ నీత్ దేవ్ సేన్ గురించి రాస్తూ 'ఒక నోబెల్ పురస్కార గ్రహీత ఆమెకు పేరు పెట్టాడు. మరో నోబెల్ గ్రహీతకు ఆమె సహధర్మచారిణి అయ్యారు. ఇద్దరు సాహిత్య సృజనకారులకు ముద్దుబిడ్డగా ఎదిగారు' అంటూ నవ్ నీత్ దేవ్ సేన్ గురించి ఇష్టవాక్యాలతో ప్రారంభించి ఆమె జీవన ప్రస్థానాన్ని సవివరంగా చెప్పాడు. రాజకీయాలతో తలమునకలై ఉన్న కరుణానిధి సాహిత్య జీవితాన్ని చెబుతూనే అతనికి తెలుగు నేలతో ఉన్న అనుబంధాన్ని ప్రేమతో రాసాడు.

స్వాతంత్ర్యానంతరపు తొలినాళ్ళలో దేశమంతటా విద్యావంతులు, సాహిత్యకారులే రాజకీయ నాయకులుగా ఉండేవారు. తెలుగు రాష్ట్రాల్లోనూ అట్లాగే జరిగింది. హైద్రాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రాంకిషన్ రావు, భారత ప్రధాని పీవీ నరసింహారావు స్వతఃసిద్ధంగా రచయితలు. వీరిద్దరినీ రాజకీయంగా స్మరించుకోవడం ఎంత స్ఫూర్తిదాయకమో, సాహిత్య కృషిలో గుర్తుచేసుకోవడం కూడా అంతే అవసరం. బూర్గులకు తెలుగుతో పాటు ఉర్దూ, అరబ్బీ, పారసీ, హిందీ, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో ఉన్న పాండిత్యాన్ని సారస్వత సేవకు ఉపయోగించిన విషయాన్ని వ్యాసకర్త వివరంగా రాసాడు. ఆదిశంకరుల సౌందర్యలహరి, కనకధారాస్తవాలను సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించాడు. కథలు, కవిత్వం రాయడంతో పాటు ఉమర్ ఖయాం రూబాయిలను పద్యాలలో అనువదించారు. పీవీ వ్యాసాలు ఎన్నో వివిధ అజ్ఞాత నామాలతో రాసిన విషయాన్ని చెబుతూ విశ్వనాథ వేయిపడగలు నవలను సహస్ర ఫణ్ గా, హరినారాయణ్ ఆప్టే మరాఠీ నవలను అబలా జీవితంగా అనువాదం చేయడంతో పాటు The Insider, గొల్లరామవ్వ తదితర స్వతంత్ర రచనలను మాత్రమే కాకుండా రాజకీయ చారిత్రిక వ్యాసాలను గ్రంథాలను రాసారన్న విషయం సవివరంగా చర్చించాడు. పీవీకి వచ్చే 17 భాషలను కూడా గుర్తుండేట్లు రాసాడు. పీవీపై ఇతరులు రాసిన గ్రంథాల వివరాలు చాలా ఇచ్చాడు. ఇది తెలుగు పాఠకులకు ఎంతో మేలు చేస్తుంది. రాంకిషన్ రావు గారి సొంత ఊరిపేరు బూర్గులనే ఇంటి పేరుగా మార్చుకున్న సంగతి ఈ వ్యాసం చదివాకే చాలా మందికి తెలుస్తుంది. ఈ సంప్రదాయాన్ని పాలమూరు కవులు రచయితలు ఇప్పటికీ పాటిస్తూ ఉన్నారు. సోమరాజు సుశీల, దాశరథి రంగాచార్య, గోరటి వెంకన్న, ఏనుగు నరసింహారెడ్డి, ఆదేశ్ రవి, మామిడి హరికృష్ణలు సాహిత్య సృజనకు అవకాశమున్న రంగాలకు చెందని వ్యక్తులు. అయినా వారు సాహిత్య రంగంలో మడమ తిప్పని ప్రయాణం చేస్తున్నందుకు హేతువుల్ని వెతుకుతూ వారి రచనల్లోని మేలిమి వాక్యాలను ఎత్తి చూపాడు వ్యాసకర్త.

పారిశ్రామిక వేత్తగా నిలదొక్కుకున్న తర్వాత 50 సంవత్సరాల వయసులో కథలు రాయడం ప్రారంభించిన సోమరాజు సుశీల వెనుదిరిగి చూడలేదని 'ఇల్లేరమ్మ కతలు' శీర్షికతో రాసిన జీవిత చరిత్ర సహజమైన హాస్యంలో నడిచి ప్రసిద్ధి పొందిందని చెప్పాడు. అటు సంప్రదాయం, ఇటు మార్క్సిజం రెంటినీ ఇష్టపడ్డ వ్యక్తిగా రంగాచార్యను సరిగ్గా అంచనా వేసాడు. గోరేటి వెంకన్న కవిత్వంలోని తాత్వికతను, ఏనుగు నరసింహారెడ్డి కవిత్వంలోని సామాన్యుడి ఇజాన్ని, ఆదేశ్ రవిలోని ధ్వనిశాస్త్ర పరిజ్ఞానాన్ని, మామిడి హరికృష్ణలోని భిన్నభాషల వాతావరణాన్ని పొదివి పట్టుకొని వ్యాసాలను రాసాడు.

అధ్యాపక వృత్తి, పాత్రికేయత సృజనానుకూల వాతావరణంగా చాలామంది భావిస్తారు. అలాంటి వృత్తుల్లో ఉన్న ప్రసిద్ధ సాహిత్యకారులు తెలుగులో చాలా మంది ఉన్నారు. ఒద్దిరాజు సోదరులు, గుర్రం జాషువా, దాశరథి, ఆదివిష్ణు, సినారె, యద్దనపూడి సులోచనారాణి, వట్టికోట ఆళ్వారు స్వామి, కె.శివారెడ్డి, దేవిప్రియ, అమ్మంగి వేణుగోపాల్, నందిని సిధారెడ్డి, దేవులపల్లి ప్రభాకర్ రావు, దొరవేటి, నోముల సత్యనారాయణ, వి.ఆర్. విద్యార్థి, చెన్నకేశవరెడ్డి, చక్రవర్తుల రాఘవాచారి, మసన చెన్నప్ప, నిత్యానందరావులపై ప్రత్యేకంగా వివరణాత్మకమైన వ్యాసాలు ఉన్నాయి ఇందులో.

**నోబెల్ బహుమతి ఎంపిక విధానాన్ని వివాదాస్పదం చేసిన ఆస్ట్రియాకు చెందిన పీటర్ హాండ్కేకు 2019లో అదే నోబెల్ బహుమతిని ప్రకటించడంతో ఆశ్చర్యపోయిన రాయరావు తెలుగు పాఠకుల కోసం ఆయన వివాదాస్పదతను, సాహిత్య శక్తినీ విశ్లేషిస్తూ రాసిన వ్యాసం ఇందులో ఉంది. భారతీయాంగ్ల సాహిత్యంలో తొలిసారి జ్ఞానపీఠం పొందిన అమితావ్ ఘోష్ రచనలను పరిచయం చేస్తూ సవివరమైన వ్యాసం రాసాడు.**

'కుల సమస్య వద్ద కుమ్ముదుమ్ము' అన్న జాషువా సున్నాతో మొదలై 90వ డిగ్రీ దాకా ఎదిగిన వైనాన్ని చిన్న వ్యాసంలో సమర్థంగా చెప్పాడు వ్యాసకర్త. ఎందరికో ఆదర్శమైన యద్దన పూడిని చిన్న వ్యాసపుటద్దంలో చూపాడు. ఆది విష్ణు సరిగమలు రెండు పేజీల్లో కుదించాడు. తెలంగాణా ఉద్యమంలో కవులకు మార్గ నిర్దేశం చేసిన కవి, రచయిత సిధారెడ్డిని సంక్షిప్తంగానైనా అర్థమయ్యే విధంగా పరిచయం చేసాడు. వట్టికోటను రెండుపేజీల్లో ఇమడ్చడం సాధ్యం కాదని కథలకు పరిమితమయ్యాడు. దేవులపల్లి రామానుజరావును, దొరవేటిని సరియైన సమాచారంతో నిలబెట్టాడు. సినారె, దేవిప్రియ, నోముల, కె. శివారెడ్డి గారల జీవన రేఖలు సాహిత్య గమనం వివరంగా చెప్పాడు. డా. అమ్మంగి వేణుగోపాల్ సాహిత్యం మీద సమగ్ర పరిశోధన చేసినా

ఇక్కడి వ్యాసాన్ని రెండు పేజీలకు దాటించలేని పరిస్థితిని గమనించాడు. దాశరథి, బి.ఎన్.శాస్త్రి, ఒద్దిరాజు సోదరులు, వి.ఆర్. విద్యార్థి, చెన్నకేశవరెడ్డి, రాఘవాచారి, నిత్యానందరావు, మసన చెన్నప్ప గారల సాహిత్య సృజనను పాఠకులకు ఎరుకపరిచే శక్తివంతమైన ప్రయత్నం ఈ వ్యాస సంపుటి.

సింహభాగం తెలంగాణా సృజనకారులకు సంబంధించిన ఈ వ్యాస సంపుటి ద్వారా అనేక ప్రయోజనాలను సాధించాడు రచయిత డా. రాయరావు సూర్యప్రకాష్ రావు. ఇది ఒక ప్రయోజనాత్మకమైన వ్యాససంకలనం కాబోతుంది. ఎందుకంటే బూర్గుల, పీవీల వ్యాసాలూ చదివిన వాళ్లకు సాహిత్యంతో పాటు భారతదేశంలో సంస్థానం విలీనం కాక ముందటి పరిస్థితులు కొన్ని రేఖా మాత్రంగా తెలుస్తాయి. బూర్గుల దగ్గర పీవీ జూనియర్ గా పనిచేయడం, వారిమధ్య గురు శిష్య సంబంధం గమనించదగ్గది.

వట్టికోట, రామానుజరావు, సిధారెడ్డి, అమ్మంగిలపై రాయబడ్డ వ్యాసాల ద్వారా స్వాతంత్ర్యానంతరం తెలంగాణలోని తొలి, మలితరం సామాజిక స్థితిగతులు పాఠకులకు అవగతమవుతాయి. మిగితావారిపై రాయబడ్డ వ్యాసాలూ మనకాలపు స్థితిగతులను కళ్ళకు కడతాయి. సాహిత్యం తప్పకుండా సమాజానికి ప్రతిబింబం కాబట్టి ఈ వ్యాస సంపుటి తెలంగాణ పరిశోధక విద్యార్థులు దాచుకోదగ్గది. సూర్యప్రకాశ్ గారి వ్యాససంపుటి పూర్తిగా చదివితే చరిత్రపై అవగాహన ఉన్నవారికి కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు ఏర్పడతాయి. బూర్గులను 1956లో కేరళ గవర్నరు పదవి వరించింది అంటే తెలంగాణ చరిత్ర తెలిసినవాళ్ళకు మాత్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన వెంటనే అప్పటిదాకా ఉన్న ఆయన ముఖ్యమంత్రి పదవి పోయింది అని అర్థమవుతుంది. ఉపముఖ్యమంత్రి పదవి ఉంటుందని చెప్పి నీలం సంజీవరెడ్డి మాట తప్పాడని తప్పనిసరై బూర్గుల త్రివేంద్రం పోయాడని అర్థమవుతుంది. రాయరావు రాసిన సంస్థానాల వ్యాసం చదివాక పాలమూరు జిల్లాలోని ఇప్పటి సాహిత్యకారుల సంప్రదాయ ముద్రకు మూలాలు సంస్థానాలలో ఉన్నాయని పాఠకుడికి అవగతమవుతుంది.

పాలమూరు జిల్లాలో స్వంత ఇంటిపేరుకు బదులు ఊరిపేరునే పెట్టుకునే సంప్రదాయం బూర్గుల నుండే ఉందని, అది ఇప్పటికీ కొనసాగుతుందని అర్థమవుతుంది. ఈ వ్యాస సంపుటి చదివితే తెలియని విషయాలు తెలియడంతో పాటు తెలిసిన విషయాలు సోపపత్తికంగా చెప్పడంతో మనసులో స్థిరపడతాయి.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# తూరుపు సింధూరం

స్త్రీ చైతన్యం ప్రోది చేస్తున్న కథ...



జయంతి వాసరచెట్ల
9985525355

"ఉదయం 6 గం॥ సమయం" శరణ్య ఇంటి పనంతా ముగించుకుని పూజలో కూర్చుంది. పూజలో ఉందని తెలిసేందుకు ఆ ఇంటి నుండి వచ్చే. ధూపం పొగ ద్వారా వచ్చే వాసన మ్యూజిక్ ప్లేయర్ నుండి వచ్చే సంగీతం, ఆహ్లాదంగా ఉంది.!"

"ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు
దిద్దరానీ మహిమల దేవకీ సుతుడు!!"

అంటూ

సన్నగా వినిపిస్తున్న కీర్తన శరణ్యకు ఆ పాట అంటే చాలా ఇష్టం ప్రతిరోజూ పొద్దున్నే ఆ కీర్తన వింటేనే తనకు రోజు తెల్లవారినట్లు. ఆ సమయంలో చక్కని వాతావరణం మధ్యలో శరణ్య దేవుని పూజ పూర్తి చేసి కొట్టిన గంట శబ్దం.

"సన్నగా వినిపించే అన్నమాచార్య కీర్తన. ఏదో అపూర్వమైన అనుభూతి. ఆనంద డోలికలూగుతున్నట్లు ఆహ్లాదంగా ఉంది" అక్కడి వాతావరణం.

కానీ.... శరణ్య మనసు అల్లకల్లోలంగా ఉంది. నందన గత కొన్ని రోజులుగా ముభావంగా ఎవరితోనూ సరిగ్గా మాట్లాడకుండా తనదైన లోకంలో ఉంటుంది.

"ఏమైందమ్మా అంటే....!!"

"ఏమైంది? ఏమీ కాలేదు మమ్మీ..!!"

"నీకు ఎందుకలా అనిపించింది మమ్మీ?" అంటూ తననే ఎదురు ప్రశ్న వేస్తుంది.

"నందు అదే విషయాన్ని గురించి బాధపడుతుందా?" జరిగిందేదో జరిగి పోయింది.. ఆ విషయం మరిచిపొమ్మని చెప్పాముగా?

ఆహా ఆ విషయం కాకపోవచ్చు.

"అదే అయితే మాతో చెప్పేది కదా??" అని ఆలోచిస్తూ పూజ ముగించి రెండు కప్పుల్లో కాఫీ కలిపి ట్రేలో పెట్టుకుని ఏమండీ అని పిలుస్తూ..

భర్త కోసం బెడ్‌రూంలోకి వెళ్ళింది."

ఏంటి శరణ్యా!!!

పొద్దున్నే ప్రశాంతంగా వచ్చి నెమ్మదిగా నన్ను నిద్ర లేపేదానివి ఈ రోజేంటి పొద్దు పొద్దున్నే చిరాగ్గా ఉన్నావ్ అన్నాడు భర్త ప్రమోద్.

అది కాదండీ!!!

మన నందూ గురించే నా భయమంతా!!

"ఏం... మన నందూకేమయ్యింది?" ప్రశ్నించాడు ప్రమోద్.

"ఎందుకో ముభావంగా ఉంటుంది రోజూ సంగీతం ప్రాక్టీస్ చేసేది కదా?"

"ఆ అవును" అన్నాడు ప్రమోద్..

"వారం నుండీ..... చేయట్లేదండీ...!! అదేనండీ... మనం ఆ సంబంధం వద్దనుకున్నాం కదా. అందుకే అది అలా ఉంటుందేమోనండీ?

లేకపోతే ఎందుకిలా చేస్తుంది??

ఏ పని మీద శ్రద్ధ పెట్టట్లేదు!

ఆఫీస్‌కు వెళ్ళడం లేదు లీవ్ పెట్టింది. అలాగే ఎల్లుండి తనది సంగీతం ప్రోగ్రాం కూడా ఉంది.

అది కూడా ప్రాక్టీస్ చేయట్లేదు. ఎందుకో నాకు భయంగా ఉందండీ ఒక్కగానొక్క పిల్ల..... ఏంటో".... అంది శరణ్య.

"ముందే నాకెందుకు చెప్పలేదు" అన్నాడు ప్రమోద్.

"ఎక్కడా! మీరు ఇంట్లో ఉంటేగా ఉన్నా మీకు టైం ఉంటేగా! వన్ వీక్ నుండి నిన్నేగా మీరు ఇంటికొచ్చింది....?" ఇంకా ఎప్పుడు చెప్పేదీ అంది.

"నాకు క్యాంప్ లేకపోతే ఇంటికి త్వరగానే వచ్చేవాన్నిగా.. ఏం చేస్తాం..."

**ఒక్క అభిరుచులు తెలుసుకోవడం మాత్రమే కాదు. అతని గురించి పూర్తి బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేసుకొని, మూవ్ అవడం మంచిది. ఎట్టి పరిస్థితుల్లో లొంగిపోకూడదు. తమకు అన్యాయం జరిగిందని అర్థమైతే ధైర్యంగా దగ్గరలోని పోలీసులకు వెంటనే మీలా సమాచారం అందించాలి, అని చెప్పడం ఆపి ఏం చేయాలో చెప్పాడు నందన తల్లిదండ్రులతో సిఐ నవీన్.**

కథ

అన్నాడు ప్రమోద్ ముక్తాయింపుగా....!!

"విషయం ఏంటో నెమ్మదిగా నేను కనుక్కుంటానుండు నీవు టెన్షన్ పడకు" అంటూ భార్య బుగ్గలపై చేతితో సుతారంగా తాకుతూ... నవ్వి... బాత్రూంలోకి వెళ్ళిపోయాడు ప్రమోద్.

★ ★ ★

"నందనా తల్లీ, నందనా, లేచావా?" అన్నాడు ప్రమోద్.

"అలా ఎంతసేపు కూర్చుంటావే. లే... లేచి రూంలో నుండి బయటకు రామ్మా!!" అంది శరణ్య.

నెలరోజులుగా చూస్తున్నాను.

సరిగా తినడం లేదు. నిద్రపోవడం లేదు. ఆఫీసుకు కూడా వెళ్లడం లేదు. ఎందుకీ ఆలోచన గట్టిగానే మంద లిస్తున్నట్టుగా ప్రేమగా అన్నారు ఇద్దరూ చెరోవైపు వచ్చి కూర్చుని.

"అదేం లేదమ్మా!" సర్దిచెబుతున్నట్టుగా అంది నందన.

అలా అంటున్న నందన పీక్కు పోయిన ముఖం చూసి గాబరా పడిన తల్లిదండ్రులు ఏంటి ఇలా అయిపోయింది అనుకున్నారు.

నందన ఆరోగ్యం పాడైపోయింది. బరువు కూడా తగ్గిపోవడంతో భయపడిపోయారు. డాక్టర్ని



సంప్రదించారు.

నందన ఏదో మానసిక సమస్యతో బాధపడుతోంది సమస్య ఏంటో కనుక్కోండి అన్నాడు డాక్టర్.

★ ★ ★

"చూడమ్మా! నీవు ఆ రోహన్ని మర్చిపోలేకుంటే చెప్పు. అయిందేదో అయ్యింది. వాళ్ల వాళ్లతో మాట్లాడి, పెళ్లి చేస్తాం" అనునయిస్తూ చెప్పింది తల్లి.

"వద్దమ్మా! పెళ్లొద్దు ఏమొద్దు నేను చచ్చిపోతాను" అంటూ ఏడుస్తూ తల్లిని చుట్టేసింది.

ఏమైందని తల్లీ అని తండ్రి గట్టిగా అడిగితే అసలు విషయం బయటపెట్టింది నందన.

"రోషన్...... రోషన్.... వాట్సాప్ కాల్... మెసేజ్.. అంటూ.. కాస్త తమాయించుకుని."

ఫోన్‌లోని మెసేజ్ చూపుతూ....

"డియర్.. నీవెప్పుడూ ఆనందంగా ఉండాలి అని వచ్చిన మెసేజ్‌కి నేను రిప్లై ఇవ్వలేదు అంది నందన.

నెల రోజులుగా వాట్సప్ మెసేజ్‌లతో తల తిరిగిపోతోంది నాకు నేను రెస్పాండ్ అవ్వట్లేదని.... ఆ తరువాత వెంటనే వాట్సప్ కాల్ చేస్తాడు.

"నిన్నెలా ప్రశాంతంగా ఉండనిస్తాను.

**ఫోన్ ఎత్తకపోతే మీ అమ్మా నాన్నలను తలెత్తుకోకుండా చేస్తాను అని బెదిరింపులు. ఎత్తితే బయటకు చెప్పుకోలేని మాటలతో వేధింపులు. రోజూ ఇంతే నా తల తిరిగిపోతోంది. "ఇన్నాళ్లూ మీకు ఎందుకు చెప్పడం అని నేనే పరిష్కరించుకుందామనుకున్న కానీ... నా వల్ల కావడం లేదమ్మా!! ఇక వేగలేను చచ్చిపోతాను" అంటూ తల్లిని పట్టుకుని ఏడుస్తూ అసలు విషయం చెప్పింది నందన.**

క థ

**నందన తల్లిదండ్రులకి ఒక్కతే కూతురు బాగా చదువు కుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. సంగీతం కూడా వచ్చు. పెళ్లి సంబంధాల కోసం నందన ప్రొఫైల్‌ని మ్యాట్రిమోనియల్ సైట్‌లో పెట్టారు తల్లిదండ్రులు. వచ్చిన ప్రొఫైల్స్‌లో రోషన్ నందనకు నందన కూడా రోషన్‌కు నచ్చడంతో ఇరువైపుల పెద్దలు ఒకే అనుకున్నారు. నెల రోజుల్లో ఎంగేజ్మెంట్ అయ్యింది.**

నీ ఫొటోలు అడల్ట్ ఓన్లీ సైట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. నిన్నిక ఎవ్వరూ పెళ్లి చేసుకోనివ్వకుండా చేస్తా అంటూ బూతులు మాట్లాడుతున్నాడు" ఫోన్ ఎత్తకపోతే మీ అమ్మా నాన్నలను తలెత్తుకోకుండా చేస్తాను అని బెదిరింపులు. ఎత్తితే బయటకు చెప్పుకోలేని మాటలతో వేధింపులు. రోజూ ఇంతే నా తల తిరిగిపోతోంది.

"ఇన్నాళ్ళూ మీకు ఎందుకు చెప్పడం అని నేనే పరిష్కరించుకుందామకున్న కానీ... నా వల్ల కావడం లేదమ్మా!! ఇక వేగలేను చచ్చిపోతాను" అంటూ తల్లిని పట్టుకుని ఏడుస్తూ అసలు విషయం చెప్పింది నందన.

"నీవు ధైర్యంగా ఉండమ్మా ఏదైనా పరిష్కారం ఆలోచిద్దాం సరేనా..!!" అంటూ ప్రమోద్ కూతురు భుజం తట్టి బయటకు వెళ్ళిపోయాడు."

* * *

నందన తల్లిదండ్రులకి ఒక్కతే కూతురు బాగా చదువుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. సంగీతం కూడా వచ్చు. పెళ్లిసంబంధాల కోసం నందన ప్రొఫైల్‌ని మ్యాట్రిమోనియల్ సైట్‌లో పెట్టారు తల్లిదండ్రులు. వచ్చిన ప్రొఫైల్స్‌లో రోషన్ నందనకు నందన కూడా రోషన్‌కు నచ్చడంతో ఇరువైపుల పెద్దలు ఒకే అనుకున్నారు. నెల రోజుల్లో ఎంగేజ్మెంట్ అయ్యింది. మరో నెలరోజుల్లో పెళ్లి ఫిక్స్ చేసుకున్నారు. దాంతో ఇద్దరూ రోజూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. సినిమాలు, షికార్లకు వెళ్లేవారు.

త్వరలో జీవితం పంచుకోబోతున్న వారు అనే ఆలోచనతో పెద్దలూ అడ్డు చెప్పలేదు. పెళ్లి తర్వాత ఇద్దరూ విదేశాల్లో స్థిరపడాలనుకున్నారు. అందుకు ముందస్తుగా కావాల్సిన ప్రయత్నాలూ మొదలుపెట్టారు. ఆ క్రమంలోనే రోషన్ పాస్‌పోర్ట్ చూసింది నందన. అందులో అతని పుట్టినతేదీ వివరాల్లో ఏజ్ తేడా చూసి, ఆశ్చర్యపోయింది. అదే విషయాన్ని రోషన్‌ను అడిగింది.

"రోషన్ నీ వివరాలు మ్యాట్రిమోనియల్ సైట్ ప్రొఫైల్‌లో వేరేగా ఉన్నాయి. పాస్‌పోర్టులో వేరేగా ఉన్నాయి" అని నిలదీసింది.

"అదేమంత పెద్ద విషయం కాదుకదా!" డేటాఫ్ బర్త్‌లో కొంచెం తేడా అంతేగా! అన్నాడు కొట్టిపారేస్తూ రోషన్.

ఇదే విషయాన్ని తల్లిదండ్రుల వద్ద ప్రస్తావించింది నందన. ప్రొఫైల్‌లో తప్పుడు వివరాలు ఇవ్వడం ఇన్ని రోజులూ అసలు విషయం చెప్పకుండా దాచడంతో నందన తల్లిదండ్రులు రోషన్‌ను అతని తల్లిదండ్రులను నిలదీశారు.

సరైన సమాధానం ఇవ్వలేకపోయాడు రోషన్. ఇంకా ఎన్ని వివరాలు దాస్తున్నారో..!! ఈ సంబంధం మాకొద్దు అని చెప్పేశారు నందన అమ్మనాన్నలు.

నందన కూడా తల్లిదండ్రులతో మీ ఇష్టమే నా ఇష్టం అనేసింది. దీంతో అనుకున్న పెళ్లి ఆగిపోయింది.

* * *

నందన తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి జరిగిందంతా చెప్పి రోషన్‌పై కేస్ పెట్టారు. అంతా విన్న సి.ఐ. నవీన్ మీరు ధైర్యంగా ఉండండి. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. మనమే తెలివిగా ఎదుర్కోవాలి. అవగాహన లేకుండా ముందుకెళ్ళి జీవితాలను చేజార్చుకోకూడదు. మ్యారేజీ బ్యూరోలు, డేటింగ్ సైట్స్‌లలో వివరాలతో పాటు, తప్పుడు ఫోటోలు కూడా పెడుతుంటారు. ఆ విషయం, తెలియక వారితో క్లోజ్ అయినప్పుడు ట్రాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తారు. పూర్తి ఎంక్వైరీ చేసి నిర్ణయం తీసుకోవాలి.

ఒక్క అభిరుచులు తెలుసుకోవడం మాత్రమే కాదు. అతని గురించి పూర్తి బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేసుకొని, మూవ్ అవడం మంచిది. ఎట్టి పరిస్థితుల్లో లొంగిపోకూడదు. తమకు అన్యాయం జరిగిందని అర్థమైతే ధైర్యంగా దగ్గరలోని పోలీసులకు వెంటనే మీలా సమాచారం అందించాలి. అని చెప్పడం ఆపి ఏం చేయాలో చెప్పాడు నందన తల్లిదండ్రులతో సిఐ నవీన్.

* * *

ఆ రోజు రాత్రి రోషన్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. లిఫ్ట్ చేసి మాట్లాడింది నందన. దొరికితే తన బండారం ఎక్కడ బయటపడుతుందో అని మెసేజుల్లో చాలా అందమైన, మర్యాదపూర్వకమైన భాష వాడేవాడు రోషన్ కానీ, ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. వాట్సప్ కాల్ అయితే రికార్డ్ కాదని అతని ప్లాన్.

నిపుణుల సాయం తీసుకున్న నందన. వారిచ్చిన సూచన మేరకు ఆ రోజు రోషన్ వాట్సప్ కాల్ చేసినప్పుడు స్పీకర్ ఆన్ చేసి మరో ఫోన్‌లో అది రికార్డ్ చేసింది.

ఆ వాయిస్‌ను పోలీసుల ముందు పెట్టింది. దీంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వేధింపులకు చెక్ పడింది. కేసు ఫైల్ అయ్యింది. అతను విదేశాలకు వెళ్లడం కూడా ఆగిపోయింది.

* * *

"ప్రోగ్రాం టైం అవుతుంది బయలు దేరండి" అని తొందర పెట్టాడు ప్రమోద్.

అప్పటికే అనౌన్స్‌మెంట్ చేసారు. స్టేజీపైకి వెళ్ళి మైక్ అందుకుంది నందన.

"ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు" నందన గాత్రంతో పాడిన కీర్తనతో హాలంతా ప్రశాంతతో పులకించి పోయింది. పరవశమైపోయారు.. ప్రేక్షకులు.

చప్పట్లు మారుమ్రోగాయి.

గేయ కవిత



# వలసలు వద్దు.. సేద్యము ముద్దు...



బస్వోజు సుధాకరాచారి
9704840963

కూలి మస్తుగ దొరుకుతాదని - శిస్తు భూములె అన్ని మనవని
మస్తు మస్తుగ సంతసంబున - దోస్తులందరు కూడుకొనగ

పరుగు పరుగున రండిరా-
పాలమూరు లేబరా
వలస బతుకులు యేలరా-
గోసలన్నీ బోవురా (కూలి)

చెరువు కుంటలు అలుగువారె - చేప పిల్లలు ఎగిరి దుమికె
వెరుపు లేని జీవితాలు - వెలుగు నింపె రోజులొచ్చె

కరువు కాటకమేలరా-
కదలిరార సోదరా
మంచి రోజులు మల్లెరా
మనకు లేదు సాటిరా (కూలి)

పట్నమిడిచి పరుగుదీసి - పర్కి కంపను తొలగ ద్రోచి
గెట్టులన్నీ సరిగ జూసీ - దిట్టమైనది సేద్యమనుచు

పల్లె తల్లిని జేరరా
కన్న నేలను జూడరా
నాటు కలుపు పాటగా
మిన్న లేదని పాడరా (కూలి)

నెర్రెలిచ్చిన భూములన్నీ - నిండు పచ్చని చీరలల్లే
సోకు దీరి సొగసు జూపె - సోరపిల్లె మురియుచుండె

సొగసు జూడ సోదరా
తరలిరారా తమ్ముడా
చిన్న నాటి రోజులన్నీ
తిరిగి వచ్చె సోదరా (కూలి)

కల్వకుర్తి నెట్టెంపాడు - భీమ ఫేజులన్ని వచ్చె
రిజర్వాయర్లన్ని నిండి - కాల్వలన్నీ పారెనిచట
చిన్న పెద్ద చెరువులన్నీ - ఒక్కటొక్కటె నిండుకొచ్చె
నింగి నేల ఒకటిదోచె - నిండు సాగరమయ్యి నిలిచె

పసిడి పంటలు పండురా
పాలమూరు లేబరా
వలస బతుకులు ఏలరా
పట్నమొదలి కదలిరా (కూలి)

కానసీ రాజ్యాన వోతిరి - కన్న వారిని కానరైతిరి
గుంపు మేస్త్రీల ఆగడాలు - కుమిలిపోయే జీవితాలు
పిల్ల జల్లలనంత వదలి - ఎంత దెచ్చిన వట్టి బతుకు
వద్దు వద్దు వలస బతుకు - ముద్దు ముద్దు సేద్యమనుచు

కృష్ణ నీరు వచ్చెరా
కష్టమింక తొలగురా
ఉన్న ఊరు జేరరా
కన్న వారిని గానరా (కూలి)

కొడిమెలు గాలాల గడెలూ - కోరి వెదికి చూడవయ్య
పరక చాపల బొచ్చె చాపల - పులుసు రుచినే జూడవయ్య

జల్లపిల్లలనేసుకొచ్చి
పిల్లజల్లల గూడి దినుము
కల్ల కపటం లేని పల్లెన
ఎల్ల సంతసమొందరా (కూలి)

ఏలువాడు మంచి అయితే - తరలిరాదా కృష్ణ జలము
చంటి పాపల ఆర్తిదీర్చె - చరితమౌను తల్లి కృష్ణది
మింటిదాకును సంతసంబు - కలిమి బలిమి కాంచి యిచట
గొడ్డు గోదలు ఎగిరి దుమికె - పక్షులన్నీ పాటవాడగ

పరవశించు పల్లె జనము
స్వచ్ఛమైన మనుజ గణము
అచ్ఛమైనది ఆత్మ బంధము
విచ్చుకున్న మల్లె గంధము (కూలి)

పుస్తక పరిచయం

# సంక్షిప్త సామాజిక సంగతులు

అన్నవరం ఆత్మను ఆవిష్కరించిన కూర చిదంబరం...




కూర చిదంబరం
86393 38675


గత 30 ఏళ్ళ నుండి సాహితీ సేద్యం చేస్తున్న అన్నవరం దేవేందర్ మౌలికంగా కవి. దేవేందర్ అనగానే 'తొవ్వ', 'నడక', 'మంకమ్మతోట లేబర్ అడ్డా', 'బుడ్డపర్కలు' (నానీలు), బొడ్డు మల్లెచెట్టు మరియు నిన్న మొన్నటి 'గవాయి' కవితా సంపుటులు మనసులో మెదుల్తాయి కాని, దేవేందర్ తన 'మరో కోణం' లోని వ్యాసాలతో తనలోని మరో కోణం సాహితీ ప్రపంచానికి తెలియ చేసాడు. ఇప్పుడు 'ఊరి దస్తూరి'తో తెలంగాణ గ్రామీణ జీవన సంస్కృతిని మీద కళ్ళ ముందుంచుతున్నాడు.

దేవేందర్ ఏది రాసినా ప్రవాహశైలిలో స్పష్టత, విషయ సేకరణలో సమగ్రత ప్రతివాక్యంలోనూ కనిపిస్తుంది. నాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ దగ్గరి పోతారం అనే చిన్న పల్లెటూరులో కేదారమ్మ, తండ్రి దశరథం దంపతులకు జన్మించినా, తాత మల్లయ్య కనకవ్వ (బాపమ్మ)ల దగ్గరే ఇచ్చంత్రాలు శాస్త్రాలు కైత్కాలు, కథలు నేర్చుకున్నాడు. తనచుట్టూ ఉన్న సబ్బండవర్ణాల ఉత్పత్తి జీవితాల్లోని మానవ సంబంధాలను దీక్షగా గమనించేవాడు. జానపదుల కళలు, మాటలు చేతలు వ్యవసాయ అనుబంధ జీవనం పట్ల మక్కువ పెంచుకున్నాడు. ఊరి భాష మీది ఇష్టంతో తన పాత్రికేయ వృత్తికి, రాసే కళకు సావబెట్టుకున్నాడు.

'ఊరి దస్తూరి' 162 తెలంగాణ గ్రామీణ సంస్కృతి చిత్రణ వ్యాసాల సంపుటి. ఒక ప్రముఖ దినపత్రికలో 2015 ఫిబ్రవరి నుండి 2018 అక్టోబర్ వరకు వారం వారం తెలుగు పాఠకులను అలరించింది. తెలంగాణ భాష, యాస విచక్షణకు గురియైన సమయంలో తెలంగాణ ఆవిర్భవించింది. భాష యాసలకు ఆదరణ ఏర్పడింది. సరిగ్గా ఈ సమయంలోనే తెలంగాణ భాష, పల్లె సంస్కృతి చిత్రణ ఆకలిగొన్న కడుపుకు పరమాన్నం అయింది. పాఠకులు నీరాజనం పట్టారు. ఆదరించి అక్కున చేర్చుకోవటమే కాదు. ఇంకేం రాస్తే బాగుంటుందో సూచనలిచ్చారు.







వారం వారం క్రమంతప్పకుండా పత్రికకు వ్యాసాలను అందించటం అసిధారవ్రతం ఒక ఛాలెంజీ! అట్టి ఛాలెంజీని సగౌరవంగా స్వీకరించి, సమర్థ వంతంగా పల్లెభాషలో రాస్తూ, పాఠకుల నెనరును సంపాదించుకున్నాడు దేవేందర్.

అన్నవరం దేవేందర్ లాంటి కవి తన కవిత్వ సాధనలో దాసన్నపూల, మెరుపు, తంగేడుపూల సొగసు, పడకమల్లె సౌరభం, గునుగుపూల అందాలు, పొద్దుతిర్గుడు పూల పెద్దిర్కం చూపగలడు. వ్యాసాల్లో ఇవి కనిపింపచేయగలగటం కత్తిమీద సామే! పల్లె పరిమళాలద్దుకుని రాయగలిగే ఈయన, ఈ ఛాలెంజీని అలవోకగా స్వీకరించి, అతి సహజంగా, కళ్ళకు కట్టినట్లు ఈ వ్యాసాలను రూపొందించ గలిగాడు.

ఎద్దు, ఎవుసం, బాయి, బంధం, గుట్ట, పిట్ట, చేను, చెల్క, కోల్లు, గొర్లు, లుర్లు, ఆవులు, మ్యాకలు, కోతులు, కొండంగలు, పాలు, పెరుగులాంటి జీవజాలాన్ని, జీవపదార్థాల నూతన వ్యాస వస్తువులుగా చేసుకున్నాడు. ఇవేకావు; బావ, వదిన, మామ, తాత అక్కచెల్లే- ఊరు ఊరంతా సుట్టాల్లెక్క ఉండుడు, పార బుజానేసుకుని రుమాలు తలకు సుట్టుకుని పొలం బోతున్న పెద్ద

మనిషి “బాగున్నావా.... బాపూ” అని నెనరుతో పలకరించుడు రచయిత మనసు గాఢ ముద్ర వేసాయి.

అరమరికల్లేని ఊరోళ్ల ప్రేమ, ఆత్మీయత, నిబద్ధత ఒకవేపు; పట్నం వాసుల కాగితపు పూల కృత్రిమ ప్రేమ, కపటపు నవ్వులు మరో వేపు తూకం వేసి చూపిస్తాడు.

పల్లెటూరి పైరగాలికి దూరమై పట్నపు ఉబ్బరింపు తట్టుకోలేక పడ్డ వేదనే ఈ ‘ఊరి దస్తూరి’. అసలు సిసలైన తెలంగాణ సంస్కృతి ప్రతి వ్యాసంలోనూ కనిపిస్తుంది. అయన చూపే పల్లె సౌందర్యం, ప్రాకృతిక సహజత్వంతో మనసు తుర్తి, అయితది. నిమ్మళం సుత ఆమితది. ఒక్కోచోట రచయిత వెలిబుచ్చిన ఆవేదన, మాయమవుతున్నా పంటపొలాల వివరణ, ఆయన చేసే మౌనరోదన వినగలిగిన మన మనసు కూడా బరువెక్కుతుంది.

ఆయన ‘కన్ను పెన్ను’ పరిధిలోంచి ఏదీ దాటిపోలేదు. ముఖ్యమైన దేదీ విస్మరించబడలేదు. అక్కడి పొలాలు, పండుగలు, సేద్యం, పాలు పదకటం, పెళ్ళిళ్ళు, వాటికి తయారీలు, సంక్రాంతి సకినాలు, కొత్త కొండ తీర్థంల కొన్నశిల్కల పేరు, బాయి గిర్కమీద ఊరవిశ్క, ముగ్గు వాకిళ్ళ కళకళలు, వరుసైన వాళ్ళలో పరాశ్కాలు, అక్కడి ఆస్తులే ఎడ్లు, ఎవుసం గురించిన వివరణలు చదువుతూన్న పాఠకులకు అప్పుడే పితికిన గుమ్మపాల నును వెచ్చదనం, కమ్మదనం కనిపిస్తుంది. బడికి నడుసుకుంట బోయి తొవ్వల సిత్వల కాయలు తెంపుకోవటం, జామకాయాలు, రేగ్గాయలు, సీమచింత (పులిచింత) ఎగిరెగిరి అందుకోవటం, కట్టెల పల్కలు, స్లేట్ పలకలు, రేకు పలకలు, బలుపాలు, చాకోపీసులు; సోలుపుత నించోని ఎక్కాలు చెప్పుటం, బతుకమ్మ పండుగ సంకురాత్రి దసరా పండుగల సబ్బండ వర్ణాలు తీరొక్కపూవు- ఇవేకావు; అమ్మలక్కల ముచ్చట్ల రాయేసురాలు (రజస్వల) కావటం, ఎండకాలానికి పనికొచ్చే వరుగులు తయారుచేసుకోవటం, నాటి



కల్లు పాకలు, నేటి బీర్ బరండి పారకం, లబ్బర్గాజులు రిబ్బెనలు అమ్మే ‘పూస పేర్లోల్లు- భూమీ ఆకాశం మధ్య ఏం గనిపిచ్చినా దేవేందర్ దృష్టి దాటిపోలేదు.

ఏదో రాయటం కాదు; దేవేందర్ పదచిత్రాలను సృష్టిస్తాడు. పల్లె ప్రజల సంతోషమే కాదు; దుక్కాన్నీ దృష్యమానం చేస్తాడు. మనిషి సచ్చిపోయినంక మూడొద్దులకు పిట్టకు పెడుతరు. అదో దుక్కపు దృశ్యం. దేవేందర్ మనలో ఎంతటి దు:ఖభారాన్ని కలిగిస్తాడో చూడండి. “అందరూ పెద్ద తాంబాలంల పదార్థాలు అన్నీ ఏసుకోని మీదికెల్లి తెల్లతువ్వాల కప్పుకోని కాట్నం కాడికి పోతరు. ఒగలు సర్వల నీళ్ళు పట్టుక పోతరు. ఆ పొయ్యే దృశ్యం మాట ముచ్చట లేకుంట గంభీరంగ ఉంటది. మౌనంగా ఉంటది. దుక్కంతోని ఉంటది. కాట్నం దాక నడిశి కాట్నం జూసి మరోసారి సోకం బెడుతరు”. ఆ పోయినా యన బంధువుల వెనక మనమూ నడిచిన వేదన కలుగుతది.

‘వడ్లోల్లు, కమ్మరోల్లు, కుమ్మరోల్లు, మాదిగోల్లు, సాకలోల్లు, మంగలోల్లు- ఇట్లా ఆరొక్క కులాలోల్లు’- కులాల గురించి వివరణ. నిచ్చెన, బల్లపీట, ఉపకారి, బండిగారె పానుక బోరెం, పగ్గం, ముకుదు ఎడ్లకాని, బండికాని మూదాడు, సోల, కుంచెం, పల్లకి, సవారికత్రం- 50 ఏళ్ళ క్రిందటి గ్రామీణ నేపథ్యాన్ని మనకండ్ల ముందు నిలుపుతడు.

ఎన్కటి పోరగాండ్లను, ఇప్పటోల్లను పోలుస్తూ చెట్ల పండ్లు ఆనాడు తింటే, బిస్కట్లు చాక్‌లెట్లు, కుర్‌కురేలు పైసలు పెట్టి పొట్లు తీసి ఈనాడు తినటం నిరసిస్తూ- అదో గమ్మతి జీవితం, ఇదో కృతక జీవితం. మేం పండ్లచెట్లు” (పే. 107) అంటాడు.

ఊరంటే ఎవుసం. ఎవుసం అంటే అన్నం గిన్నె అంటూ, ఊరు సల్లగుంటేనే దేశం సల్లగుంటది (పే. 38) అన్న నిజాన్ని ప్రకటిస్తాడు. నేటి పరిస్థితి ‘పైసల కీసల వైకుంఠం అయింది’ (పే. 35) నేటి కాలాన అన్నీ కొనుక్కోవల్సిన దుస్థితికి అంగలార్చుతాడు. గ్రామీణ పద సౌందర్యం మనల్ని ముగ్ధులను చేస్తుంది. మక్కంకులు ‘లగాంచి’ కాస్తాయట (పే. 51). బర్రెపాలు దవ్వదవ్వ గుంజాలె. పచ్చి పచ్చి వాసన. సర్రుసర్రు సప్పుడు. లొల్లి లొల్లి జేసుడు, కాగి కాగి (పే. 33). ఇదో అద్భుత పద సౌందర్యం.

ప్రతి వ్యాసం చివర రచయిత ఇచ్చే ముక్తాయింపు (కంక్లూజన్) ఇవ్వదలచుకున్న సందేశం, రచయిత పట్ల గౌరవాన్ని పెంపు చేస్తుంది. “ఏది ఏమైనా ఊర్లు మారియనయి. మారాల్సిందే. ఆధునికతను అందుకోవాలె కని, పాత విలువలు పతనం కావద్దు” (246) అనటం రచయిత ‘ప్రాగ్మటిజమ్’కు మచ్చుతునక. “ఇంటికి మూలవాసం లాంటి మూలవాక్యం ఈ ఊరి దస్తూరి నిండా కనిపిస్తుంది” అంటారు. డా॥ నలిమెల భాస్కర్ బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత. ఇది నూటికి నూరుపాళ్ళు నిజం!

“కాట గల్సిన గొడ్డెకు మంద మీదుండే ఆరాటం, మందకు ఆ గొర్రె మీద ఉండదు”. దేవేందర్ ఆరాటాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం అందరూ చేయాలి.

(ఊరి దస్తూరి, తెంగాణ సాంస్కృతిక చిత్రణ, వ్యాసాలు, రచన : అన్నవరం దేవేందర్; వెల రూ. 250/-; ప్రతులకు : ఏదునూరి రాజేశ్వరి, 406, మారుతి హైట్స్ భగత్‌నగర్, కరీంనగర్ - 500 001; నవతెలంగాణ, నవచేతన, నవోదయ బుక్ హౌజ్ మరియు అమెజాన్ స్టోర్స్).




**చిత్రం : కెప్టెన్ అమెరికా ద ఫస్ట్ అవేంజర్**
**దర్శకుడు : జాన్‌సన్**
**భాష : ఆంగ్లం**

# కెప్టెన్ అమెరికా
## ద ఫస్ట్ అవేంజర్

అవెంజర్స్ నాయకుడు. అమెరికా దేశవీరుడు, తరతరాలకు ప్రేరణగా నిలిచే "కెప్టెన్ అమెరికా" (స్టీవ్ రాజర్స్) కథ. ఈ చిత్రం యాక్షన్‌తో అలరిస్తూ, సరదాగా నవ్విస్తూ సహజంగా సాగే ఈ చిత్రం ఎన్నో జీవిత పాఠాలను చెప్పకుండా చెప్పేస్తుంది. వరల్డ్ వార్-2 జరిగిన సమయంలో జరిగిన ఆ కాలం నాటి ప్రజల బాధలను, వారి బాధ్యతలను చూపిస్తుంది.

స్టీవ్ రాజర్స్, బ్రూక్‌లిన్ అనే చిన్న ఊరి అబ్బాయి. తల్లిదండ్రులిద్దరు దేశం కోసం ప్రాణాలు కోల్పోతారు. తాను కూడా ఈ దేశం కోసం నిరంతరం ఏదో ఒకటి చెయ్యాలని అనుకుంటూ ఉంటాడు. తన కంటే ఎంత శక్తివంతుడు వచ్చి పోరాడినా ఒక్క అడుగు వెనకేయకుండా "ఐ కెన్ డూ దిస్ ఆల్ డే " (నేను ఇది రోజంతా చేయగలను) అని చెప్పి ధైర్యంతో పోరాడే ఇతనికి ఆస్తమాతో పాటు ఎన్నో అవయవ లోపాలు ఉన్నా ఆర్మీలో చేరడానికి ఎంతో ప్రయత్నిస్తాడు. తన మిత్రుడు (బకీ బార్న్స్) ఎంత చెప్పినా వినడు. డా॥ అబ్రహం ఇయోకిన్ అనే గొప్ప శాస్త్రవేత్త ప్రభుత్వం కోసం పనిచేస్తాడు. ఇతను స్టీవ్ దగ్గర సైనికుడి లక్షణాలు లేకపోయినా ఒక నిజమైన పోరుడి లక్షణాలు ఉన్నాయని గుర్తించి అతనిని ఆర్మీలోకి చేర్పిస్తాడు.

ఆర్మీ పెద్దలకు స్టీవ్ అంతగా నచ్చకపోయినా డా॥ అబ్రహం పట్టుబట్టడంతో స్టీవ్‌ని సూపర్ సైనికుడిగా మార్చడానికి ఒప్పుకుంటారు.

అబ్రహం జర్మనీ దేశానికి సంబంధించిన అతను. అక్కడ పనిచేసినప్పుడు జాన్ స్మిత్ అనే అతనికి సూపర్ సైనిక సీరం ఇస్తాడు. శక్తి అనే ఆశకి బాధితుడైన అతడికి ఈ సీరం శక్తిని ఇచ్చినా తన శరీరానంతా ఎర్రగా మార్చేస్తుంది. దానితో అతనికి 'రెడ్ స్కల్' అనే పేరు వస్తుంది. అబ్రహం స్టీవ్ కూడా సూపర్ సైనిక సీరం ఇస్తున్నాడని తెలుసుకున్న రెడ్ స్కల్ అబ్రహంను చంపి, అతని దగ్గర ఉన్న సీరంను తెమ్మని చెప్తాడు స్టీవ్‌కు సూపర్ సైనిక. సీరం ఇచ్చాక హైడ్రా (రెడ్ స్కల్ ఆర్గనైజేషన్) మనిషి అబ్రహంను చంపి సూపర్ సైనిక సీరం దొంగలించడానికి ప్రయత్నిస్తాడు. కాని స్టీవ్ అతన్ని ఆపి సీరంను ధ్వంసం చేస్తాడు. అతన్ని ఎవరు పంపించారో అడిగే ముందే తనని తాను చంపేసుకుంటాడు. అబ్రహం లేకపోవడం ఆర్మీవారు స్టీవ్‌ని చేర్చుకోవడానికి నిరాకరిస్తారు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో స్టీవ్ దగ్గరికి ఒక బిజినెస్ మ్యాన్ వచ్చి అతనికి అడ్వటైజర్ జాబ్‌ను ఇస్తాడు. స్టీవ్ కెప్టెన్ అమెరికాగా నటిస్తూ, ఊరురా వెళ్ళి యుద్ధానికి ధనసహాయం ఇవ్వాలని అందరినీ ప్రోత్సహిస్తాడు.

ఇలా ఒక రోజు ఆర్మీలో ప్రదర్శన చేయడానికి వెళ్ళినప్పుడు తన మిత్రుడు (బకీ) శత్రువుల దగ్గర బంధింపబడ్డాడని తెలుసుకుంటాడు. బాండ్స్ అమ్మడమే అతని జీవితార్థం కాదని తెలుసుకొని కాప్టెన్ అమెరికా ఆర్మీ తీసుకొని హైడ్రా బేస్‌కు వెళ్ళి తన మిత్రుడు బకీతో పాటు ఎంతో మంది సైనికులను కాపాడతాడు. తన సాహసాన్ని అభినందిస్తూ స్టీవ్ ఆర్మీలోని తీసుకోబడతాడు. బకీ, స్టీవ్ ఆర్మీ వాళ్ళతో కలిసి ఎన్నో హైడ్రా బేస్‌లను నేలకరిపిస్తారు. అలా వెళ్ళినప్పుడు బకీ కొండపై నుండి కిందపడి చనిపోతాడు. తన మిత్రుడి ప్రాణ త్యాగం వృథా కాకూడదని రెడ్ స్కల్‌ను చంపడానికి వెళ్తాడు. ఎంతో ప్రయత్నం తరువాత ఆఖరుకు రెడ్ స్కల్‌ను అంతం చేస్తాడు రోజర్స్. కానీ షిప్‌లో న్యూక్లియర్ బాంబ్ ఉంటుంది. కాబట్టి సామాన్య ప్రజలకు ఏమి కాకుండా షిప్‌ను అంటార్కిటాకు తీసుకెళ్తాడు. అతని ప్రాణాలను పణంగా పెడతాడు. కానీ సూపర్ సైనిక శక్తుల వలన 70 ఏళ్ళు మంచులో గడ్డకట్టినా అతను ప్రాణాలతోనే ఉంటాడు. క్షణక్షణం వినోదానిస్తూ అద్భుతమైన స్ఫూర్తిదాయక కథను ప్రదర్శిస్తుంది 'కెప్టెన్ అమెరికా' ప్రేమ, దేశభక్తి, బాధ్యత మరియు స్నేహం అంశాలలో మనకు ఎన్నో పాఠాలను నేర్పుతుంది. చిత్రంలో చూపించబడిన అంశాలు మన నిజ జీవితాలకు చాలా దగ్గరగా ఉంటాయి.

సాహితీ సమాచారం

# "పోరు తత్వం తెలంగాణ కవిత్వం"

**సాహితీ వేత్త డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు**

అన్యాయాన్ని నిలదీసే పోరుతత్వ కవిత్వమే తెలంగాణ నుండి వెలువడిందని, అందుకు నిదర్శనంగా అనేకమైన రచనలు అందుబాటులో ఉన్నాయని విఖ్యాత సాహితీ వేత్త, తంగేడు పక్షపత్రిక అసోసియేట్ ఎడిటర్ డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ కవయిత్రి ఐ.వి.సుబ్బాయమ్మ గారి కవితా సంపుటి 'అక్షరాభిషేకం' ఆవిష్కరణ సాహితీ స్రవంతి లక్సెట్టిపేట ఆధ్వర్యంలో జూలై 21న స్థానిక హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు 'సమాజ పరిణామ క్రమం-కవిత్వం' అనే అంశంపై ప్రసంగిస్తూ సమాజ పరిణామ క్రమంలో కవిత్వం పాత్ర గొప్పదని శ్లాఘించారు. సభాధ్యక్షులు గోపగాని రవీందర్



మాట్లాడుతూ సహృదయ కవిత్వానికి ప్రతీక సుబ్బాయమ్మ కవిత్వం అంటూ కొనియా డారు. ప్రముఖ కవి నూటెంకి రవీంద్ర పుస్తకాన్ని సమీక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు పాటిబండ్ల శ్రీరామ మూర్తి, ప్రముఖ అష్టావధాని ఎం. వీ. పట్వర్ధన్, ఎం. వీ. కిషన్ రావు, కవులు ముత్యబోయిన మలయశ్రీ, అల్లాడి శ్రీనివాస్, బొడ్డు మహేందర్, రాజేశం గౌడ్, ల్యాదాల గాయత్రి, రాచకొండ శ్రీనివాస్, లేదాళ్ళ రాజేశ్వరరావు, కందుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# మహా కవుల జయంతి...



దాశరథి సినారె మహాకవుల జయంతి సందర్భంగా సాహితీ గౌతమి కరీంనగర్ అంతర్జాల మాధ్యమంలో తేదీ 22-07-2021 నుండి 29-07-2021 వరకు ఎనిమిది రోజులపాటు సాహిత్య ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మొదటి రోజైన 22 నాడు ప్రారంభ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి జీవి శ్యాంప్రసాద్ లాల్ ప్రారంభించి, ముఖ్య అతిథి ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా సాహితీ గౌతమి అధ్యక్షులు డాక్టర్ గండ్ర లక్ష్మణ్ రావు వ్యవహరించారు. ప్రతిరోజు ఒక ప్రధాన వక్త ప్రసంగంతో పాటు ఎన్నిక చేయబడిన కవుల చేత కవితా గోష్ఠి ఎనిమిది రోజుల పాటు నిర్వహించడం జరిగింది. ఈ ఉత్సవాలు నిర్వహించడం చాలా ఆనందకరమైనటు వంటి విషయమని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గండ్ర లక్ష్మణ్ రావు, గాజుల రవీందర్‌లు వివరించారు.

# మహాకవి దాశరథి



కవిత్వం మరియు తెలంగాణ ఈ రెండు అంశాల ను మహాకవి దాశరథి ఆరాధించి తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రజల హృదయాలలో గొప్పగా నిలిచిపోయారని ప్రసిద్ధ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య సమాలోచన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మనుషుల జీవితాలు నుంచి వచ్చిన కవిత్వమే బలమైన కవిత్వం అటువంటి కవిత్వాన్ని అందించిన దాశరథి అందరికీ ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ తెలంగాణకు వెలుగులను ప్రసాదించిన దీపస్తంభం దాశరథి అని వర్తమాన కాలంలో ఆ బాధ్యతను నిర్వహిస్తున్న కవి సిధారెడ్డి అని విశ్లేషించారు.

# 'మకర హృదయం' పుస్తకావిష్కరణ



ప్రముఖ సాహితీవేత్త ఆచార్య దివాకర్ల వేంకటావధాని 110వ జయంతి సందర్భంగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించిన మకర హృదయం పుస్తకావిష్కరణ సభ తెలుగు విశ్వవిద్యాలయం, భాష అభివృద్ధి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి. రమణాచారి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. తంగేడు పత్రిక సహ సంపాదకులు డా॥ కాంచనపల్లి గోవర్ధన రాజు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, ఆచార్య సూర్య ధనుంజయ్, ఆచార్య ఎం.ఎస్. రాజు, శాస్త్రి రఘుపతి, డా॥ సంగారెడ్డి, ఆచార్య రెడ్డి శ్యామల, దివాకర్ల గాయత్రి తదితరులు పాల్గొన్నారు.




## శంకర ! పంచ శతి

డా॥ కూర్మాచలం శంకరస్వామి

**అన్నపూర్ణ ప్రచురణలు**
హైదరాబాద్
సెల్ : 9390828188
వెల : రూ. 100/-




## తెనుగు పాప!

ముత్యబోయిన మలయశ్రీ
మంచిర్యాల
సెల్ : 7013711680
వెల : రూ. 60/-




## నాన్న మొగ్గలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
సెల్ : 9032844017




## శిలాఫలకం

దేవనపల్లి వీణావాణి
వరంగల్
సెల్ : 09951331122
వెల : రూ. 150/-




## యజుర్వేదము

యం.వి. నరసింహారెడ్డి

**సాహిత్య నికేతన్**
హైదరాబాద్
ఫోన్ : 040-27563236
వెల : రూ. 200/-




## పొత్తి

నర్రా ప్రవీణ్ రెడ్డి
నల్లగొండ

**తెలంగాణ భాషా సంస్కృతిక మండలి**
సెల్ : 9492557037
వెల : రూ. 150/-




## ఎర్రమందార మకరందం

కె. ప్రభాకర్

**రవి పబ్లిషింగ్ హౌస్**
హైదరాబాద్
సెల్ : 944013665
వెల : రూ. 150/-




## సంధ్యావందనము

అంబటిపూటి వెంకటరత్నం

**దేసు గణేష్‌కుమార్**
హైదరాబాద్
వెల : రూ. 100/-




## ఋగ్వేదము

యం.వి. నరసింహారెడ్డి

**సాహిత్య నికేతన్**
హైదరాబాద్
ఫోన్ : 040-27563236
వెల : రూ. 250/-




## యర్రా సత్యనారాయణ రాజు గారి పద్యకుసుమాలు

యెర్రా శ్రీధర్ రాజు

**బెల్లంపల్లి**
ఆదిలాబాద్


నాడు పీవీ వర్ణనలు..
నేడు ప్రపంచ యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు
ఇదీ రామప్ప ఆలయ విశిష్టత....